# శరశ్చంద్రికలు

## పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలు

(ఆంగ్ల సత్సంగ భాగాలకు ఆంధ్రానువాదం)




## మొదటి భాగం

2011వ సంవత్సరంలో వెలువడిన

ఈ-మెయిల్ సంచికల సంకలనం

*Sarathchandrikalu (Telugu)*

శరశ్చంద్రికలు

ప్రచురణ: సాయిపథం పబ్లికేషన్స్
సాయిపథం, శిరిడీ – 423109

*Saipatham Publications*
*Saipatham, Shirdi - 423109*
*publications@saimail.com*

*Copyright © 2012* *Saibaba Foundation*

*ISBN:* 978-81-88560-09-7

ప్రథమ ముద్రణ: గురుపూర్ణిమ, 2012
*Guru Purnima, 2012*

ప్రోసెసింగ్: సాయిముద్ర, శిరిడీ
*Sai Mudra, Shirdi*

ముద్రణ: సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్
చెన్నై – 106

*Saibonds Print Systems*
*Chennai - 106*

*Website:* *www.saibaba.com*

సాయిపథం పబ్లికేషన్స్
శిరిడీ | చెన్నై | హైదరాబాద్

మా సద్గురుదేవులు
శ్రీసాయినాథుని శరత్‌బాబూజీని మాకు అనుగ్రహించిన
శ్రీసాయిబాబా చరణారవిందములకు,
శ్రీసాయిబాబాని చూపి, సాయి నిజతత్త్వాన్ని దర్శింపజేసిన
పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పాదపద్మములకు
భక్తిపూర్వక సమర్పణ





*సర్వత్రా సర్వజీవులలోను ప్రకాశించే చైతన్యాన్ని
మనచే దర్శింపజేయడమే శ్రీసాయి ద్వారా ప్రకటమైన
లీలాప్రబోధాల యొక్క పరమార్థం. ఆ సత్యాన్ని
దర్శించడమే సాయిభక్తుల సాధన లక్ష్యం!*

**- శ్రీబాబూజీ**





## ప్రకాశకుల ముందుమాట

సాయితత్త్వ ఆకాశంలో ప్రేమ వెన్నెల పరచి, సుజ్ఞాన కిరణాలతో శోభిల్లిన శరశ్చంద్రుడు – పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ. ఆ సద్గురు శరశ్చంద్రుని నుండి సత్సంగభాషణల రూపంలో ప్రభవించిన జ్ఞానవెన్నెల కిరణాలే – శరశ్చంద్రికలు. శ్రీబాబూజీ సత్సంగభాషణకు అక్షర రూపాన్నిస్తూ రూపొందించిన సత్సంగాల సంకలనమైన ఈ 'శరశ్చంద్రికలు' – మనలోని అజ్ఞానతిమిరాన్ని పారద్రోలే సుజ్ఞాన దీపికలు.

జ్ఞానానందపరవశులైన మహాత్ములు పలికిన అనుభూతుల సారమే – వేదాలు. సాయితత్త్వామృతంతో తన్మయులై, సాయి ఆనంద స్వరూపంలో మమేకమైన మహాత్ములు – పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ. వారి వాక్సుధైన ఈ 'శరశ్చంద్రికలు' – శరత్ శ్రుతులే.

"మన జీవితమనే గ్రంథాన్ని అర్థవంతంగా, రసవత్తరంగా చదువుకునేందుకు అవసరమైన అంశాలపై బాబా చెప్పక విడిచిన విషయం లేదు" అంటారు శ్రీబాబూజీ. ఆ జీవిత గ్రంథాన్ని బాబా ప్రబోధించిన విధంగా ఎలా చదవాలో, బాబా చూపిన ఆనంద

పథంలో ఎలా నడవాలో శ్రీబాబూజీ పలుమార్లు తమ సత్సంగాల్లో ప్రస్తావించారు. ఆ సత్సంగాల సంకలనమైన ఈ 'శరశ్చంద్రికలు' – సాయిపథగాములకు జీవనవేదాలే.

## సుజ్ఞాన సర్వస్వం

"అడిగిన వారికి అడిగినంత సమృద్ధిగా ఇవ్వమని నా యజమాని నన్ను ఆదేశించాడు. కానీ నా మాటలు చెవినబెట్టేదెవరు? నా ధనాగారపు తలుపులు బార్లా తెరచిపెట్టి ఉంచాను. కానీ ఆ సంపదను తీసుకొనిపోయేవారే లేరు! ప్రజలు ఊరకే నా వద్దకొచ్చి 'ఇవ్వు! ఇవ్వు!' అంటారు. నేను 'తీసుకో'మంటాను. కాని తీసుకునేవారేరి?" అన్నారు బాబా. శ్రీబాబూజీకి శ్రీసాయిబాబా పట్ల ఉన్న అనన్య ప్రేమ వలన, అనుక్షణం వారు చేసిన సాయి మనన, స్మరణల వలన, అక్షయమైన సాయి సుజ్ఞాన భాండాగారం సాయి అనుగ్రహప్రసాదంగా వారి సొంతమయింది. శ్రీసాయిని గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలన్న వారి తపన తపస్సై, సాయి సచ్చరిత్రకు సంబంధించి ఎన్నో పరిశోధనలు చేసి అంతవరకు వెలుగుచూడని ఎన్నో విషయాలను వెలికితీసి, సాయితత్త్వాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించారు. అగాధమైన సాయితత్త్వసాగరాన్ని మథించి, ఆ సాగరగర్భంలో దాగిన ఎన్నో ఆణిముత్యాలను, జ్ఞానరత్నాలను వెలికితీసి, తమ సత్సంగాల ద్వారా ఆ అక్షయ సంపదనంతా భక్తుల ముంగిళ్ళకు చేర్చారు.

ఎన్నో జీవిత సత్యాలను, ఆధ్యాత్మిక రహస్యాలను ఆవిష్కరించిన అపార మేధస్సు, ప్రజ్ఞ, సునిశిత పరిశీలన, విలక్షణమైన ఆలోచనా విధానం, అచంచలమైన దీక్ష, పట్టుదల, త్రికరణశుద్ధి, నిబద్ధత, క్రమశిక్షణ, సాయిపట్ల ఎనలేని ప్రేమ, తాము పొందుతున్న సాయి

ప్రేమానుగ్రహం అందరూ పొందాలన్న వారి ఆకాంక్ష – ఇవన్నీ శ్రీబాబూజీని అత్యున్నత శిఖరాలకు చేర్చాయి. వారి ఆంతర్యం అవగతం చేసుకోవడానికి ముందుగా వారి ఆదర్శ జీవితగమనాన్ని క్లుప్తంగానైనా తెలుసుకుందాం.

## జీవిత ప్రస్థానం

అక్టోబర్ 7, 1954, విజయదశమి పర్వదినాన శిరిడీలో శ్రీసాయిబాబా మహాసమాధి మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. బాబా సమాధి దగ్గర నాటివరకు ఉన్న చిత్రపటం స్థానంలో అందాలొలికే బాబా పాలరాతి విగ్రహానికి ప్రతిష్ఠాపన జరిగింది. అదే రోజున – దక్షిణ భారతదేశంలో సాయి దివ్యప్రభ దేదీప్యమానంగా విస్తరించడానికి వేదికగా నిలిచిన చెన్నైలోని మైలాపూర్‌లో పూజ్యశ్రీ బాబూజీ జన్మించడం కేవలం ఒక యాదృచ్ఛికమైన సంఘటన కాదని, శ్రీసాయితో వారికి ఉన్న దివ్యబంధానికి అదొక ప్రతీకయని శ్రీబాబూజీ జీవితయానాన్ని పరిశీలిస్తే అవగతమవుతుంది. సాయి అనుగ్రహం పైనే ఆధారపడి జీవించిన వారి జీవితం – సాయి మలచిన ఓ దివ్యకావ్యం.

శ్రీబాబూజీ తల్లిదండ్రులు నెల్లూరు వాస్తవ్యులు కావడంతో, వారి బాల్యమంతా నెల్లూరు, దాని చుట్టుప్రక్కల వివిధ ప్రాంతాల్లో గడిచింది. వారికి మూడు సంవత్సరాల వయస్సున్నప్పుడు, పవిత్ర తిరుమల క్షేత్రంలోని మూలవిరాట్ సన్నిధిలో జటాజూటధారియైన ఓ మహాత్ముడు రమ్మని పిలిస్తూ దివ్యదర్శనం ప్రసాదించారు. ఆ పిలుపు వారి జీవితంలో ఒక మేలుమలుపని ఆ తరువాత రోజుల్లోగాని తెలియరాలేదు. బాల్యంలో వారి నాయనమ్మగారి

ఇంట్లో ప్రప్రథమంగా సాయిబాబా చిత్రపటాన్ని చూశారు. అనేక దేవతామూర్తుల మధ్య ఉన్న ఆ సాయిబాబాపైనే వారి దృష్టి నిలిచేది. ఆ బాబా చిత్రపటాన్ని చూసినప్పుడల్లా ఎంతో పరిచయం ఉన్న వ్యక్తిగాను, అదే సమయంలో ఏ మాత్రం తెలియని నిగూఢమైన అద్భుతవ్యక్తిగాను వారికి అనిపించేది. బాగా తెలిసిన, అసలు ఏ మాత్రం తెలియనట్లున్న ఆ సాయిబాబా దివ్యరూపం వారిని అమితంగా ఆకర్షించేది. చిన్నతనంలో వారి అంతరంగాన్ని అలౌకిక నేపథ్యంలో ఉన్న భావాలు, ఈ సృష్టికి, విశ్వానికి సంబంధించిన అనేక ప్రశ్నలు చుట్టుముట్టేవి. దాంతో ఆ పసిమనస్సులో ఏదో తెలియని వెలితి, అసంతృప్తి, సంఘర్షణ. తనలో అస్పష్టంగా ఉన్న ఆ భావాలకు రూపునిచ్చి సంపూర్ణంగా సాకారం చేసుకోవాలనే తపన. ఆ తపన తపస్సుగా మారింది. తనలోని ఆ వెలితిని తీర్చుకొనే క్రమంలో ఎన్నో సంవత్సరాలు అన్వేషణ కొనసాగింది. విద్యానగర్‌లో శ్రీబాబూజీ డిగ్రీ చదువుతున్న రోజుల్లో శ్రీసాయిని అత్యంతంగా ఆరాధించే మాస్టర్ ఎక్కిరాల భరద్వాజగారు వారికి పరిచయమయ్యారు. దాదాపు 14 సంవత్సరాల వారి సహచర్యం మహోన్నత సాయియానంలో సాగింది. సాయితత్త్వాన్ని అర్థం చేసుకునే క్రమంలో, ఈ ప్రపంచంలో వెల్లివిరిసిన అన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాలను, సకల శాస్త్రాలను, వేదవేదాంగాలను, అష్టాదశ పురాణాలను, ఉద్గ్రంథాలనెన్నింటినో క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిపై సాధికారతను సముపార్జించారు. చదువుకునే రోజుల్లో వారు తరచుగా తిరువణ్ణామలై వెళ్ళి, అక్కడే ఉండి దేహావసరాలను కూడా మరచి సాధన చేసుకుంటూ గడిపేవారు. ఆ సమయంలో శ్రీరమణమహర్షి జీవితం, ప్రబోధాలపై వారు చేసిన పరిశోధనలు

సాయితత్త్వాన్ని విశ్లేషించుకోవడానికి ఉపకరించడమేగాక, ఈ జీవిత కాలంలో ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితిని చేరుకోవచ్చున్న విశ్వాసాన్ని కలిగించాయి. తీవ్రంగా సాధన చేసుకొంటున్న దశలో వారికి అనంత సిద్ధులు ప్రాప్తించాయి. ఆ సిద్ధులు ఆధ్యాత్మిక పురోగతికి ప్రతిబంధకమని, సాయిపట్ల ఉన్న ప్రేమ తప్ప మరేదీ జీవిత సాఫల్యాన్ని ప్రసాదించదని భావించి, సాయికి నివేదించుకొని, లక్ష్యశుద్ధితో వాటన్నింటిని తృణప్రాయంగా త్యజించి ముందుకు సాగారు. 1974లో తిరువణ్ణామలైకు 22 మైళ్ళ దూరంలో ఉన్న పూండీ గ్రామంలో పూర్ణావధూత 'శ్రీపూండీస్వామి' దివ్యసన్నిధిలో శ్రీబాబూజీ చేసిన కఠోరసాధన, శ్రీసాయి అనుగ్రహవిశేషంగా ఫలప్రదమయింది. ఆ క్రమంలోనే సాయితత్త్వాన్ని సంపూర్ణంగా తెలుసుకునేందుకు అకుంఠిత దీక్షతో సాగించిన సాధనాప్రస్థానం వారిని ఆధ్యాత్మికంగా అత్యున్నత శిఖరాలను అధిరోహింపజేసింది.

మాస్టర్‌గారి సూచనతో - సాయి భక్తురాలు, మాస్టర్‌గారికి స్వయానా మరదలైన అనసూయమ్మగారిని, ఒంగోలులో మే 27, 1982 గురువారంనాడు శ్రీబాబూజీ వివాహం చేసుకున్నారు. ఆ దంపతుల అనురాగ దాంపత్యానికి ప్రేమఫలంగా పాప జన్మించింది. అప్పటికే ఆధ్యాత్మికంగా మహోన్నత స్థితిలో ఉన్న వారికి గృహస్థ జీవితం ఏమాత్రం ప్రతిబంధకం కాలేదు.

సమాజ పురోభివృద్ధికి విద్య అత్యంత ఆవశ్యకమైనదిగా భావించి, 1983లో సాయిబాబా సెంట్రల్ స్కూల్‌ను ఒంగోలులో స్థాపించి, స్వీయ నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు, విలువలే పునాదిగా విద్యారంగంలో నూతన బోధనాపద్ధతులను ప్రవేశపెట్టారు. 1988లో 'సాయిపథం' మాసపత్రికను స్థాపించి, సాయిలీలాప్రబోధమే ఆధారంగా

ఆధ్యాత్మికత పేరున చలామణి అవుతున్న సంకుచిత భావాలను, మూఢత్వాన్ని రూపుమాపారు. అంతవరకు వెలుగుచూడని సాయి లీలలను, అలభ్యంగా ఉన్న సాయి సాహిత్యాన్ని, అరుదైన సాయిబాబా ఒరిజినల్ ఫోటోలను 'సాయిపథం' ద్వారా సాయిభక్త ప్రపంచానికి అందించారు. వారి రచనా శైలి ఎంతో రమణీయంగా, ప్రత్యేకంగా ఉండి, పండిత పామర భేదం లేక సర్వులనూ రంజింపజేస్తుంది.

తమ సద్గురుస్థానం, శ్రీసాయిబాబా పదసన్నిధియైన శిరిడీలోనే ఉండాలని భావించిన వారు ఎంతో అభివృద్ధిలో ఉన్న స్కూల్‌ను, 'సాయిపథం' పత్రికను సాయిభక్తుల నిర్వహణకు అప్పగించి, 1989వ సంవత్సరం, మే నెలలో శిరిడీ చేరుకున్నారు. వైద్యాన్ని సమాజపు ప్రాథమిక అవసరంగా భావించి, వారు శిరిడీకి వచ్చిన తొలిరోజుల్లో ఉచితంగా హోమియోవైద్యం చేసి, దీర్ఘకాల రుగ్మతలతో బాధపడేవారికి సైతం నయంజేశారు.

అపరిగ్రహాన్ని అత్యంత నిష్ఠగా పాటించిన ఆ మహనీయుడు ఎవరి నుండి దక్షిణలు, విరాళాలు స్వీకరించేవారు కాదు. ఒంగోలులో వారు స్థాపించిన సాయిబాబా సెంట్రల్ స్కూల్ నుండి ప్రతి నెల వారికి గౌరవ వేతనం లభించేది.

శ్రీసాయి అనుగ్రహాన్ని, ప్రేమను అనుక్షణం అనుభవిస్తూ, ఆస్వాదించిన శ్రీబాబూజీ, ఆ ప్రేమానుగ్రహాలను దేశవిదేశాల నుండి తమ చెంతకు వచ్చిన భక్తులకు పంచారు. అత్యంత సహజమైన వారి ప్రేమను, సాన్నిధ్యాన్ని చవిచూసినవారు శాంతిఆనందాలను, సంతృప్తిని మాటల్లో చెప్పలేనంతగా పొందేవారు.

శ్రీబాబూజీతో అనుబంధమున్న వారెందరో వారిని సద్గురువుగా భావించి ఆరాధిస్తున్నారు. వారిని ప్రేమగా "గురువుగారు" అని

సంబోధిస్తారు. కాని వారెన్నడూ తాను 'గురువు'నని చెప్పలేదు. "నేనెవరికీ గురువును కాదు, బాబానే మనందరికీ సద్గురువు" అని అంటుండేవారు. మరి మీ దగ్గరకు వచ్చిన వారినందరిని ఎందుకు ఇంతగా ఆదరిస్తున్నారు అని అడిగినప్పుడు, "బాబా ఏమన్నారు? 'ఋణానుబంధాన్ని గుర్తుంచుకో. ఎవరూ నీ వద్దకు ఋణానుబంధం లేనిదే రారు' అని. అందువలన ఋణానుబంధమే మీ అందరినీ నా వద్దకు రప్పిస్తున్నది. కాబట్టి నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావిస్తాను. మరి నేను మిమ్మల్ని ఒట్టి చేతులతో ఎలా పంపగలను? బాబా నాకు ఇచ్చినదేదో అది మీతో పంచుకోవడం ద్వారా శ్రీసాయితో అనుబంధం పెంచుకోగలుగుతున్నాను" అని విశదపరచారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని, దివ్యత్వాన్ని వివరించడం ఈ ముందుమాట పరిధులకు మించినది. అందువల్ల వారి జీవిత రేఖాచిత్రాన్ని గీసే ప్రయత్నం మాత్రమే ఇక్కడ చేయగలిగాము.

## సత్సంగ సౌరభాలు

'సత్' స్వరూపులైన మహాత్ముల సాన్నిధ్యం - సత్సంగం. 'సత్' అనుభవసిద్ధితో తన్మయులైన మహాత్ముల దివ్యవాణి ఆ 'సత్' స్వరూపానందాన్ని ప్రసాదిస్తుంది. అందువలన అది సత్సంగమే అవుతుంది. అటువంటి దివ్యసన్నిధిని, దివ్యప్రబోధాన్ని ఒకే చోట ప్రసాదిస్తుంది - శ్రీబాబూజీతో జరిగే సత్సంగం.

శ్రీబాబూజీ సత్సంగానికై భక్తులు తపించేవారు. చిన్న గ్రూప్‌తో ఒక ఇష్టాగోష్ఠిలా శ్రీబాబూజీ సత్సంగం జరిగేది. శిరిడీలో సాయిపథ ఆవరణంలోనో, అరుణాచలంలోని చిన్న ఫ్లాట్‌లోనో, తిరుమలలోని

కాటేజీలోనో, పవిత్ర గంగాతీరంలోని హృషీకేశ్, వారణాశిలోనో, సముద్రతీరాన చెన్నైలోనో, ఒక్కొక్కసారి ప్రయాణించే రైలులోనో, బోట్‌లోనో... ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా కావచ్చు... ఆ రోజున, ఆ క్షణాన, ఆ ప్రదేశంలో అక్కడున్న వారందరకూ అనూహ్యంగా ఆ సత్సంగ మహద్భాగ్యం కలుగుతుండేది.

సత్సంగం ఆరంభంలో శ్రీబాబూజీ అక్కడున్న వారినందరిని ఆప్యాయంగా, పలకరింపుగా చూస్తూ 'ఏంటయ్యా, చెప్పండి' అనగానే అందరి మనస్సులు ఒక్కసారి ఆనందంతో ఉప్పొంగిపోయేవి. సత్సంగంలో ఉన్న భక్తులను ఉద్దేశించి 'అడగండయ్యా' అనిగాని, లేక 'ఏమి చెప్పమంటారు' అనిగాని వారనడం ఎప్పుడూ వినలేదు. వారెంతో మహోన్నతస్థితిలో ఉన్నప్పటికీ తాము అక్కడున్నవారు చెబితే వినడానికి వచ్చినట్లు 'చెప్పండయ్యా, ఇంకేంటి?' అనేవారు.

శ్రీబాబూజీ సత్సంగం – విశ్వజనీనమైన ఓ అనంత జ్ఞానవాహిని. వారి సత్సంగం ప్రత్యేకంగా ఒక మతప్రబోధంగానో లేక ఆధ్యాత్మిక ప్రవచనంగానో ఉండేది కాదు. సత్సంగంలో భక్తులు అడిగినదానికి సమాధానం చెప్పేవారేగాని, శ్రీబాబూజీ వేదికలెక్కి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవారు కాదు.

శ్రీబాబూజీ సత్సంగం స్పృశించని అంశాలు, కోణాలు లేవు. ప్రశ్నలడిగేందుకు ఎటువంటి పరిధులు, పరిమితులు ఉండేవి కాదు. కొందరు బాబాతత్త్వం, సచ్చరిత్ర, బాబా అనుగ్రహం, లీలాప్రబోధం తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసేవారు. మరికొందరు జీవితంలోని సమస్యలు, కష్టాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగేవారు. మరికొందరు ఆధ్యాత్మికసాధనలో వారు ఎదుర్కొనే సమస్యలను నివేదించుకుని సందేహనివృత్తి చేసుకునేవారు.

ప్రపంచంలోని ఏ అంశం గురించి అయినా అడిగి, శ్రీబాబూజీ నుంచి సవివరమైన సమాధానం పొందేవారు. ఏ ప్రశ్నలకైనా వెనువెంటనే వారు సూటిగా ఇచ్చే సమాధానాలను వింటుంటే, ఈ ప్రపంచంలోని జ్ఞానసంపదంతా వారి చెంతనే ఉన్నదా! అనిపిస్తుంది.

బాబాను అన్ని కోణాల్లో ఆవిష్కరిస్తూ వారు చెప్పే వివరణ ఎంతో ఆసక్తిదాయకంగా, ప్రబోధాత్మకంగా, ఆనంద రసస్ఫోరకంగా ఉండేది. వారు బాబా లీలను వర్ణిస్తుంటే, శ్రోతలకు - ఆ లీల జరుగుతున్నప్పుడు వారు ఉంటే పొందే ఆనందానుభవంతో పాటు ఆ లీల నేపథ్యంలో ఉన్న ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలిసేవి.

అడిగిన వ్యక్తి అవసరం, అవగాహన, ఆర్తి, ఆలోచనాసరళి, నేపథ్యాన్ని అనుసరించి వారి సమాధానముండేది. మన ఆలోచనలను, అంతరంగాన్ని ఆసాంతం చదివారా అనిపించేది. ఆ వివరణ అక్కడ ఉన్నవారి అంతరంగలోతుల్లో అవ్యక్తంగా ఉన్న ఎన్నో సందేహాలను నివృత్తి చేసేది. వినేవారి పరిణతిస్థాయి, ఆలోచనావిధానాలను బట్టి ఆ సమాధానం ఎవరికి ఎలా చేరాలో అలా చేరేది. కొన్నిసార్లు ప్రశ్న అడిగినవారిని మధ్యమధ్యలో తిరిగి ప్రశ్నలు వేస్తూ, వారికి ఆ విషయంపట్ల ఉన్న అవగాహనను పెంపొందించడానికి లోతుగా ఆలోచింపజేసేవారు. మనకు అంతా తెలుసుననుకున్న అంశాల్లోని ప్రాథమిక విషయాలు కూడా మనకు తెలియవని వారి సమాధానం విన్న తర్వాతగాని అర్థమయ్యేదికాదు. వారి సన్నిధిలో ఉన్నప్పుడు అహపు పొరలు పలుచబడి మన ఆలోచనావిధానమేమిటో, మనఃస్థితి ఏమిటో ఎవరికి వారికి ప్రస్ఫుటంగా తెలిసేది. మనకు తెలిసిన విషయాలను కూడా సరిక్రొత్త కోణంలో దర్శింపజేస్తూ వారు చెప్పే సమాధానం వినగానే, అప్పటివరకు మనకు అర్థంగాని

విషయాలు ఒక్కసారిగా అవగతమయ్యేవి. అస్పష్టంగా ఉన్న అనేక భావాలు ఒక నిర్దిష్టమైన రూపును సంతరించుకునేవి.

ఆధ్యాత్మిక పరిభాషలో ఉపయోగించే ఆత్మ, పరమాత్మ, ముక్తి, మోక్షం, ఆత్మసాక్షాత్కారం వంటి పదాలేవీ వారి మాటల్లో వినిపించేవికావు. ఏ విషయాన్నైనా వివరించేటప్పుడు – శాస్త్రాలను, వేదాంతోపనిషత్తులనుగాక, మనకు తెలిసిన చిన్న చిన్న విషయాలను, అనుభవాలను ప్రమాణంగా తీసుకొని చెప్పేవారు. ఎవరైనా శాస్త్రాల్లోని విషయాలను ప్రస్తావించినప్పుడు ఆ శాస్త్రాల్లో చెప్పిన అంశాల్లోని అసలు అర్థాన్ని తెలియజేసేవారు. సత్సంగంలో వారు చెప్పిన వివరణల వల్ల జీవితం పట్ల, ఆధ్యాత్మికత పట్ల – మన దృక్పథం ఎలా ఉండాలో, పరిస్థితులను, సందర్భాలను ఎలా చూడాలో, ఏ విధంగా విశ్లేషించుకోవాలో – అన్న అనేక విషయాలలో భక్తుల్లో అవగాహన పెంపొందేది. మన చుట్టూ జరిగే సంఘటనలనుగాని, మన అనుభవాలను తీసుకునిగాని లేదా మనకు తెలిసిన చిన్న చిన్న ఉదాహరణలతోగాని మనందరికి అర్థమయ్యే సులభరీతిలో చాలా సంక్లిష్టమైన ఆధ్యాత్మిక రహస్యాలను, గొప్ప సత్యాలను, సూక్ష్మాలను వివరించేవారు. స్వీయానుభవాలను వివరించిగాని, మహాత్ముల అనుభవాలను విశ్లేషించిగాని సాధనాపరమైన విషయాల్లో మనకున్న అవగాహనాలేమిని పోగొట్టేవారు.

శ్రీబాబూజీని భారతీయులు మాత్రమేగాక కొందరు పాశ్చాత్యులు కూడా అనుసరిస్తుండేవారు. వారి ప్రత్యక్ష సాన్నిధ్యం కోసం, సత్సంగాల కోసం నెలలు తరబడి తమ దేశాలను విడిచి శ్రీబాబూజీ ఉన్న ప్రదేశంలోనే ఉంటుండేవారు. భిన్నమైన భాషాసంస్కృతులు, దేశాల నుండి వచ్చిన వారందరినీ సద్గురు ప్రేమబంధమే వారి చెంత

అలా ఉండేలా చేసింది. భిన్న నేపథ్యాల నుండి రావడం వల్ల, వారి ఉచ్చారణ, ఆలోచనావిధానం సహజంగానే విభిన్నంగా ఉండేవి. అయినా వారందరూ చెప్పేవాటిని వెంటనే గ్రహించి, వారికి అర్థమయ్యే విధంగా శ్రీబాబూజీ వివరించేవారు. సార్వజనీనమైన వారి వివరణలు, సూచనలు ఏ నేపథ్యం వారికైనా ఆమోదయోగ్యంగాను, ఆచరణాత్మకంగానూ ఉండేవి.

అత్యున్నత స్థాయిలో ఉన్న ఆ మహనీయుడు సత్సంగానికి భక్తులతో కూర్చున్నప్పుడు, మనలో ఒకరై, ఒక ఆత్మీయునిలా, స్నేహితునిలా సంభాషించేవారు. మేధాసంపత్తితో మేళవించిన హాస్యచతురత, అంతర్దృష్టి, చమత్కారంతో సందర్భోచితంగా నవ్విస్తూ వారిచ్చే వివరణలు ఒకవైపు ఆనందసాగరంలో ఓలలాడిస్తూ మరోవైపు ఎంతో జ్ఞానదాయకంగా కూడా ఉండేవి. సత్సంగం ఆద్యంతం అక్కడున్నవారు పొట్టలు చెక్కలయ్యేలా నవ్వుతూ ఆదమరచి ఆనందించేవారు. వారు హాస్యానికన్న మాటల్లో కూడా ఎంతో గూడార్థం ఉండేది. రాత్రి మొదలైన వారి సత్సంగాలు ఎన్నోసార్లు తెల్లవారుఝాము వరకు జరిగేవి. అయినా అందరూ చివరివరకు అదే ఆసక్తితో పాల్గొనేవారు. వారి సత్సంగ సాన్నిధ్యంలో అవధులు లేని ప్రేమ, అపార ఆనందం, ప్రశాంతత అనుభవమై భక్తులు ఉత్తేజపూరితులయ్యేవారు. వారి సత్సంగ జ్ఞాన సుమాల సౌరభాలు ఆస్వాదించిన ప్రతి హృదయం తన్మయత్వంతో పరవశించిపోయేది.

## అంకురార్పణ

అపూర్వమైన దివ్యసన్నిధి, అవధిలేని ప్రేమ, అద్వితీయమైన సత్సంగ ప్రబోధాలతో ఎన్నో జీవితాలను ప్రభావితంజేసి, తీర్చిదిద్దిన

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ నవంబర్ 13, 2010న మహాసమాధి చెందారు. శ్రీసాయిని అనన్యంగా ప్రేమించి, ఎన్నో జీవితాలకు సాయిప్రేమతో ఊపిరిలూదిన ఆ రూపం అనంతమైన ఆ ప్రేమస్వరూపంలో ఐక్యమైంది. శ్రీబాబూజీని తమ సద్గురువుగా భావించి, ఆరాధించిన వారందరికి వారు భౌతికంగా లేని లోటు అశనిపాతమైంది.

ఆ సమయంలో హృదయవేదనతో ఉన్న గురుబంధువులు, ఎంత చెప్పుకున్నా తనివితీరని వారి మధురస్మృతులను కలబోసుకుంటున్న సమయంలో, శ్రీబాబూజీ వాక్సుధను అందరితో పంచుకోవాలన్న ఆలోచన కలిగింది. శ్రీబాబూజీ పట్ల ఉన్న ప్రేమకు ఓ వ్యక్తీకరణగా, భక్తిపూర్వక సమర్పణగా, సత్సంగభాగాలతో కూడిన ఈ-మెయిల్ సంచికను ప్రతి మాసం మొదటి తేదీన తెలుగులో 'శరశ్చంద్రికలు', ఆంగ్లంలో 'రోజ్ పెటల్స్' పేరున అందించాలని తలచి దానికి కార్యరూపాన్నిచ్చారు.

1993-2010 సం॥ల మధ్య శ్రీబాబూజీతో జరిగిన ఆంగ్ల, తెలుగు సత్సంగాలలో ఉన్న ఒకే అంశానికి సంబంధించిన విషయాలను గ్రహించి, ఒక శీర్షిక క్రింద ప్రతి సంచికలో పొందుపరచాలని భావించారు. శిరిడీలో డిసెంబర్ 31, 2010 నుండి జనవరి 2, 2011 వరకు జరిగిన 'శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు' సందర్భంగా, జనవరి 1, 2011న "శ్రీబాబూజీ సన్నిధానం"లో, అశేష భక్తుల సమక్షంలో పూజ్యశ్రీ బాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మగారు(అమ్మగారు) ప్రథమ సంచికను ఆవిష్కరించారు. శ్రీబాబూజీ మహాసమాధి చెందిన రెండు నెలలలోపే 'శరశ్చంద్రికలు' రూపుదాల్చడం సద్గురు కృపావిశేషమే.

శ్రీబాబూజీ సత్సంగాలలో, ఆంగ్లంలో ఉన్న సత్సంగాలకు అప్పటికే 'డేటాబేస్' రూపొందించడం వలన, ఒకే శీర్షికకు సంబంధించిన అంశాలను సేకరించడంలో ఉన్న సౌలభ్యం వల్ల, మొదట ఆంగ్ల సత్సంగాల్లోని భాగాల నుండి విషయాలను గ్రహించి, వాటికి అనువాదాన్ని ఈ సంచికల్లో పొందుపరచడం జరిగింది. (12 అధ్యాయాలలో ఉన్న 'సత్సంగాలలోని భాగాలు' ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ వివరాలు ఈ గ్రంథం చివర 'అనుబంధం'లో పేర్కొనబడినవి.) మొదటి సంవత్సరంలో వచ్చిన సంచికల్లోని భాగాలు, ఒకటి రెండు మినహా, మిగతా అంతా శ్రీబాబూజీ ఆంగ్ల సత్సంగ అనువాదాలేగాని, వారు నేరుగా తెలుగులో మాట్లాడినవి కావు. అయితే అనువాదాల్లో సాధ్యమైన చోట, శ్రీబాబూజీ మాటల్లోని శైలిని చొప్పించడానికి అనువాదకులు ప్రయత్నించారు.

2011వ సంవత్సరంలో వెలువడిన 12 సంచికలను ఒకచోట చేర్చి, "*శరశ్చంద్రికలు–2011*" సంపుటిని, సద్గురు అనుగ్రహ వెన్నెల కుండపోతగా వర్షించే "గురుపూర్ణిమ" పర్వదినాన (జూలై 3, 2012) శిరిడీలో "శ్రీబాబూజీ సన్నిధానం"లో ఆవిష్కరించేందుకు '*శరశ్చంద్రికలు*' సంపాదకవర్గం నిర్ణయం తీసుకుంది.

## కృతజ్ఞతాభినందనలు

'శరశ్చంద్రికలు' ఆలోచనకు అంకురార్పణ నుండి ప్రతి సంచిక రూపొందించడంలో, మాతృకను యథాతథంగా అనువదించడంలో, ఆంగ్ల సత్సంగాలలోని మూలభావం చెడకుండా తెలుగుశైలికి మలచడంలో, భాష, శైలి సరళంగా ఉండడంలో ఎంతో కృషి చేసి,

సకాలంలో సంచిక విడుదలకు సహాయసహకారాలు అందించి, ముందుండి నడిపించిన శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి సాయినాథుని అనసూయమ్మగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతాభివందనాలు.

'శరశ్చంద్రికలు' మాతృకైన 'రోజ్ పెటల్స్'ను రూపొందించడంలో అవిరళకృషి చేసిన పాశ్చాత్య భక్తులు శ్రీయుతులు అరుణ అల్మెలా, బాబ్ బార్నెట్, శాంతి బేరన్, భక్తి బోన్నర్, క్రిస్ బర్జెస్, రామ్ బ్రౌన్ క్రొవెల్, కరిన్ డర్కోట్, పామ్ డోనాల్డ్‌సన్, కార్లోస్ గిల్ సొబెరా, కషల్య మిలాన్, నాడ్జా నేతన్, లోలా నవర్ర, ఆంకి స్టెర్నాండర్, లరిసా వెబ్బ్, పీటర్ వెస్టో మరియు ఆలిసన్ విలియమ్స్‌లకు కృతజ్ఞతాభినందనలు.

1993 నుండి మహాసమాధి వరకు శ్రీబాబూజీకి అత్యంత శ్రద్ధాభక్తులతో సేవచేసుకున్న ధన్యురాలు, శ్రీబాబూజీ సన్నిధికి వచ్చిన ప్రథమ పాశ్చాత్య భక్తురాలు ఇవాన్ వయర్‌గారు– ఆంగ్ల సత్సంగాలలోని భావాలను సరిగా వ్యక్తీకరించడంలో, సత్సంగంలోని వివిధ అంశాలను నిర్ధారించడంలో అందించిన సహకారాలు మరువలేనివి. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఆంగ్ల సత్సంగాలను అత్యంత శ్రద్ధతో, అంకితభావంతో సులభ శైలిలో అనువదించిన కె. భీమేశ్వర్, శ్రీమతి పి. శైలజ ద్వారకనాథ్, మేజర్ ఎస్. సురేష్‌బాబుగార్లకు, చక్కగా ఎడిట్ చేసిన పోలా శ్రీనివాస్, శ్రీమతి బి. శిరీష, సాయినాథుని శృతి, కె. ఉపేంద్ర, డి. రఘు, సిహెచ్. రమణగార్లకు కృతజ్ఞతాభినందనలు.

ఈ గ్రంథ నేపథ్యాన్ని ఆవిష్కరిస్తూ, ఆకర్షణీయంగా కవర్ పేజీని రూపొందించిన అరుణ అల్మెలాగారికి, శ్రీబాబూజీ ఫోటోలను చక్కగా తీర్చిదిద్దిన శ్రీఎమ్. పద్మాకరన్‌గారికి, గ్రంథాన్ని సకాలంలో

అందంగా అచ్చువేసి అందించిన సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్, చెన్నై మేనేజింగ్ డైరెక్టర్ శ్రీఎల్.వి.ఎస్. వాసుదేవరావుగారికి, ప్రతి మాసం సంచిక వెబ్ పేజీని ప్రచురించడంలో సహకరించిన శ్రీశాఖమూరి రామకృష్ణగారికి కృతజ్ఞతాభివందనాలు.

సత్సంగభాగాలతోపాటు శ్రీబాబూజీ ఫోటోలను కూడా జోడించి తీర్చిదిద్దిన ఈ సంపుటిని చదువుతున్నంతసేపూ, మనతోనే వారు సూటిగా మాట్లాడుతున్నట్లు, ఆ మహితాత్ముని దివ్యసన్నిధి అనుభవమవుతూనే ఉంటుంది. సత్యాన్వేషకులు, సాధకులు, జిజ్ఞాసువులకే కాక అందరికీ ఈ *'శరశ్చంద్రికలు'* సరియైన మార్గాన్ని చూపిస్తాయి. శ్రీబాబూజీ సత్సంగ సౌరభాలు సర్వత్రా వ్యాపించాలని, సద్గురు చంద్రుని జ్ఞానవెన్నెల పరచుకున్న హృదయాలు జ్ఞానానంద పరవశం కావాలని ఆకాంక్షిస్తూ, ఈ అమూల్య గ్రంథ కుసుమాన్ని సద్గురు చరణారవిందములకు ప్రేమపూర్వకంగా సమర్పిస్తున్నాము.

SAI SEEKERS

# విషయసూచిక


ప్రకాశకుల ముందుమాట ... vii

1 సద్గురువు ... 1

2 ఆనందం ... 7

3 సమాధానం చెప్పే సమాధి ... 15

4 జీవితం ... 25

5 ధ్యానం ... 33

6 అసమానమైన సాయి మహిమ ... 43

7 ప్రేమ - భక్తి ... 53

8 నిష్ఠ - సబూరి ... 63

9 ఆనందస్వరూపం ... 73

10 గురువుగారి బాబా ... 83

11 ప్రేమించు ప్రేమకై ... 97

12 నమస్కారం ... 107

అనుబంధం ... 115

# శరశ్చంద్రికలు



*తిరుపతి, 2001*



# సద్గురువు

**గురువుగారు:**

సద్గురువు నీకొకసారి లభించాక, నీ బాధ్యత ఆయన స్వీకరించారు అని తెలిసాక నీకు కష్టాలెదురైనా ఆయన ఉన్నారనే భావన నీకు అభయాన్నిస్తుంది. అందువలన నీలోని తపన, నీవు పడే బాధ పూర్వం వలె అనుభవంగాక నీ అనుభవంలో మార్పు వస్తుంది. నీ కోరికలు, సంతోషవిషాదానుభూతులలో మార్పు కన్పిస్తుంది. సద్గురువు యొక్క అభయం లభించేదాకా కోరికలు వాటికవే పెరుగుతూ నిన్ను అనంతంగా బాధిస్తాయి. ఆయన లభించిన తర్వాత నీ కోరికల స్వరూపమే మారిపోతుంది. నీకు కోరికలు ఉంటాయి కానీ అవి ఆయన ద్వారా తీరుతుంటాయి. ఒక దశను చేరుకున్న తరువాత, ఆ కోరికలన్నీ నీ ప్రేమను వ్యక్తీకరించేవిగా రూపుదిద్దుకుంటాయి.

**గురువుగారు:**

సద్గురువు ఒక మంచి అధ్యాపకునిలాగా నీలో ఎదగాలనే, పరిణతి చెందాలనే తపనను, ప్రేమను పెంచుకోవాలనే కోరికను, విమర్శనా సామర్థ్యాన్ని పెంపొందించి, జీవితం యొక్క అర్థం తెలుసుకోవాలనే జిజ్ఞాసను కలిగిస్తారు. మంచి అధ్యాపకుడు చిన్నపిల్లకు విషయం (పాఠం) అర్థం కాకపోతే ఇక (ఆమె) వల్ల కాదు అనరు. తను ఓ చిన్నపిల్ల! ఒకవేళ ఆ పాప తను పెద్దదాన్నయినానని భావిస్తే ఇంక అధ్యాపకుని ఉపయోగం ఏమిటి? ఆ చిన్నపిల్లకు గల పరిమితులను దృష్టిలో ఉంచుకొని బోధించడానికే అధ్యాపకుడు ఉండేది. ఆయన ఇక ఆమె వల్ల కాదు అనరు. ఆయన చాలా ఓరిమి కలవారు.

ఏ సద్గురువూ ఐహిక ప్రపంచం పట్ల విరక్తి కలిగివుండమనరు. వారి ప్రబోధం నీలో నెమ్మదిగా వ్యక్తిత్వవికాసం కలిగించి, ఎదగాలనే తపనను పెంచి ఇంకా ఇంకా పరిపూర్ణ వ్యక్తిలా మారుస్తుంది. మనం మొగ్గకున్న రెక్కలను విడదీసి పువ్వును వికసింపజేయలేము. మొగ్గ పువ్వులాగా మారడానికి అవసరమైన ఎరువు, నీరు, వెలుతురు మొదలైన వాటిని దానికందజేస్తాము. సద్గురువు చేసేది కూడా నీకు అనుకూల పరిస్థితులను కల్పించడమే. ఆయన కొంత వాచా బోధించి, కొన్ని అలౌకిక అనుభవాలను ప్రసాదిస్తారు. సారవంతమైన నేల, ఎరువు, మంచి నీరు, గాలి, వెలుతురు, రక్షణ కొరకు సత్సంగమనే కంచె ఏర్పరచి మొగ్గ పువ్వు అయ్యేలా చూస్తారు. రాత్రికి రాత్రే మొగ్గ పువ్వులా మారాలని ఆయన నేరుగా ఆ మొగ్గను తాకి దాని రేకులను విడదీయరు. ఆ మొగ్గ దానికి తగిన సమయంలో సహజంగా వికసించి, పువ్వుగా మారేలా చేయడం ఆయన పద్ధతి.

**గురువుగారు:**

వేమన యోగి, "ఇహము లేదు పరము కలదను వాడి మాట కల్ల మాట" అని ఒక పద్యంలో అంటారు. ఎవరైనా, ఇహము అశాశ్వతమైనది. మీరు అదంతా వదలివేయండి. ఆ పరమైన పరబ్రహ్మస్వరూపాన్ని ధ్యానించి దాన్ని పొందండి అన్నాడా! వాడు దొంగ. వాడి మాట కల్ల (అబద్ధం). వాడికి ఏమీ చేతగాక ఏమీ చేయలేక వాడి అసమర్థతను కప్పిపుచ్చడానికి చెప్పే మాట అది. సమర్థ సద్గురువెప్పుడూ ఆ మాట అనరు. ఇహములోనే పరము చూపేవాడే సద్గురువు. నీవనుకునే ఆ భావాతీతస్థితిని ఇక్కడికి నీ కోసం తెచ్చి ఇచ్చినవాడే నిజమైన సద్గురువు. నీవు సంసారబంధాలను, అన్ని వాంఛలను, ప్రపంచాన్ని వదిలి పైమెట్టు మీద ఉన్న నా దగ్గరకు వస్తే ఆ బ్రహ్మానందాన్ని నీకు ప్రసాదిస్తానని ఎవరైనా అంటే ఇక ఆయన ఇచ్చేదేమిటి?

ఈ ఐహిక ప్రపంచంలో ఉన్న మనం సాంసారిక బంధాలను త్యజించి, నిచ్చెన ఎక్కి పైకి వెళ్ళలేము. ఇక ఆయన కోసం పైకి ఎలా వెళ్ళగలం? ఆయనే మన చెంతకు స్కందాశ్రమం నుండి గిరిపాదం వద్దకు* (ఈ జగత్తులో మనం ఎక్కడ ఉంటే అక్కడకు) దిగివచ్చి ఆ స్థితిని మనకు ప్రసాదించాలి! మన వాంఛలన్నీ నిర్మూలనం చేసుకొని ఆయనంత ఎత్తుకు చేరుకోగలిగితే ఇక ఆయన అవసరమేముంది? మన కృషిని గురించీ, మనం జపధ్యానాదులు చేస్తున్న తీరు గురించీ, మరో దాన్ని గురించీ పట్టించుకోక మన దగ్గరకు దిగివచ్చి ఇక్కడే మనల్ని బంధవిముక్తుల్ని చేసేవాడే నిజమైన సద్గురువు. ఏ షరతులకు లోబడని ఆయన కృప మన మీద వర్షిస్తూ ఉంటుంది.

---

* గురువుగారు ఇక్కడ భగవాన్ శ్రీరమణమహర్షిని ఉదహరిస్తున్నారు.

తండ్రి తన బిడ్డనెలా ప్రేమిస్తాడో అలాగే సద్గురువు ఆయనకూ, మనకు ఉన్న సంబంధాన్ననుసరించి మనలను ప్రేమిస్తాడు. ఏ తండ్రైనా తన బిడ్డను ప్రేమించే ముందు ఆ బిడ్డ అర్హతలను చూస్తాడా? అయినా బిడ్డకు కావలసిన అర్హతలేమిటి? ఆ తండ్రికి పుట్టడమే, ఆ ఋణానుబంధమే– అర్హత! ఆ బిడ్డ మంచివాడా, చెడ్డవాడా అని చూడడు. ప్రేమిస్తాడంతే! అలాగే సద్గురువు మనలను ప్రేమిస్తారు. మనమందరం ఆయన బిడ్డలం. ఏ విషయంలోనైనా వరుసక్రమంలో ముందు ఉన్నవారికే ఎంచుకొనే హక్కు ఉంటుంది. ఈ తండ్రికి పుట్టాలని నేను ఇతనిని ఎన్నుకొన్నానని ఎవరైనా అంటారా? లేదు – అది మన ఎంపిక కాదు. అది బాబా సంకల్పం. అందుకే బాబా నిర్ద్వంద్వంగా, "నా భక్తులను నేనే ఎన్నుకొంటాను" అన్నారు.

సద్గురువు తమ భక్తులను తామే ఎన్నుకొంటారు. భారతీయ సాంప్రదాయంలో శిష్యుడు గురువు వద్దకు వెళ్ళి తనను స్వీకరించ వలసిందిగా ప్రార్థించి వారి అనుమతికై పరితపిస్తుంటాడు. గురువును గుర్తించగలగడం మాటలకందని ఒక ఆకర్షణ, అనుబంధం, ఇష్టం. అది మనసుకు మాత్రమే తెలుస్తుంది. అప్పుడు నీకు, గురువుతో అనుబంధమేర్పడకముందే ఆయన నిన్ను ఎన్నుకొన్నారనీ, గురువు ఎన్నుకొన్న తర్వాతే నీవాయనను వెతికి కనుగొన్నావనీ అర్థమౌతుంది.

**గురువుగారు:**

బాబా ఎవరు? బాబా అంటే ఏమిటి? ఆయనను మనం ఎలా అర్థం చేసుకోగలం? అనేది ప్రశ్న. ఆయన కంటికి రెప్పలా సదా మనలను రక్షిస్తుంటారు. కావలివానిలా ఎల్లవేళలా మనలను కనిపెట్టుకుని

ఉంటారు. మనమెప్పుడు మన వ్యక్తిత్వపరిమితుల నుండి బయటపడి ఆయన ఇవ్వదలుచుకున్న దానిని ఎప్పుడు అడుగుతామా అని ఎంతో ఆతురతతో ఎదురుచూస్తుంటారు. ఎప్పుడెప్పుడు వీళ్ళు నన్ను అడుగుతారా (ఆయన ఇవ్వదలుచుకొన్నది) అని ఆశతో నిరంతరం నిరీక్షిస్తారాయన. అదీ – సాయిబాబా అంటే! అంతులేని సహనశీలి. ఆయన మనలను సబూరి అడుగుతారు. మనమివ్వం కనుక ఆయనే మన పట్ల ఓర్పుతో ఉంటారు. అదీ సబూరి అంటే. మనమివ్వలేనప్పుడు ఆయనైనా ఇవ్వాలికదా మరి. (గురువుగారు నవ్వుతూ...) ఆయన సబూరి ఇచ్చి "రండి, కనీసం ఒక్క వాసననైనా వదిలిపెట్టండి" అని మరలా పుచ్చుకుంటారు. ఆయన ఎంతో సహనం, పట్టుదల కలవారు. మనమేం చేసినా సహనం, పట్టుదలతో వేచిచూస్తుంటారు. అనుకున్నది సాధిస్తారాయన. అదే సాయిబాబా.

**గురువుగారు:**

"ఎవరైనా నా దగ్గరకు ఋణానుబంధంవల్లనే వస్తారు" అన్నారు బాబా. మనందరికి మధ్యగల ఋణానుబంధాన్ని అనుసరించి నేను మిమ్మల్ని బాబా నాకిచ్చిన ప్రసాదంగా భావిస్తాను. అంతేకానీ మరేదీ కాదు. మీరు పవిత్రంగా చూస్తారో లేదో – అది వేరే విషయంగానీ, నాకు మాత్రం మీరంతా బాబా ఇచ్చిన పవిత్రమైన ప్రసాదం. మిమ్మల్ని బాబా ప్రసాదంగా స్వీకరిస్తాను. బాబా అందరికీ హితమే చేకూర్చుతారు, మీకు మంచి చేస్తారు. అప్పుడు మీరు, మీతో పాటు నేను, అందరం సంతోషిస్తాము.




*శిరిడీ, 1997*



# ఆనందం

**గురువుగారు:**

ఆనందంపై లగ్నంచేయి. అది చాలు. నీకున్న అవసరంమీద, దానిని (ఆ కొరతగా ఉన్నదానిని) పొందే మార్గం మీద లగ్నంచేయి. దానిని పొందుతామన్న ఆలోచనే నీకు ఆనందాన్నిస్తుంది. అదే బాబా దాసగణుమహరాజ్‌ను దీక్షిత్ ఇంటికి పంపించినప్పుడు ఈశావాస్యోపనిషత్తు ద్వారా ఆయనకు బోధపరచినది. అది ఒక చక్కని బోధ. దాసగణు మహరాజ్ చాలామంది పండితోత్తములకు సైతం ప్రశ్నార్థకంగా నిలిచిన ఈశావాస్యోపనిషత్తులోని మొదటి శ్లోకానికి సరైన వ్యాఖ్యానం కోసం తపించిపోయాడు. ఏ పండితుడూ ఆయనకు సంతృప్తికరంగా సమాధానమివ్వకపోవడంతో ఆఖరుకు ఆయన బాబాను అడిగాడు. బాబా తేలికగా, “ఓ, ఇదా నీ ప్రశ్న? నన్నెందుకు అడుగుతావు? దీక్షిత్ ఇంటికి వెళ్ళు. ఆయన పనిపిల్ల

నీకు చెబుతుంది” అన్నారు. దాసగణుకిది చాలా అవమానంగా తోచింది. స్వయంగా తానొక గొప్ప పండితుడు. దానికి తోడు తాను చాలా మంది గొప్పగొప్ప పండితులను సంప్రదించాడు కూడా! వాళ్ళు కూడా దానికి సమాధానమివ్వలేకపోయారు. ఇప్పుడతనికి బాబా తనను నిరక్షరాస్యురాలైన దీక్షిత్ పనిపిల్ల దగ్గరకు వెళ్ళమని చెప్పి అవమానపరుస్తున్నారనిపించింది.

ఏదేమైనా బాబా చెప్పారు కనుక ఊరికే దాసగణు బొంబాయి వెళ్ళి అటునుంచి విల్లెపార్లెకు, తర్వాత కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి వెళ్ళాడు. ఆ రాత్రి అక్కడే బసచేశాడు. మరునాటి ఉదయం ఆయన, దీక్షిత్ ఇంటిలోని పనిపిల్ల ఎంతో ఆనందంతో నాట్యం చేస్తుండటం చూశాడు. ఆయన ఎందుకంత ఆనందంగా ఉన్నావని ఆమెను అడిగినపుడు, దీక్షిత్ భార్య తనకు ఒక చీర ఇచ్చిందనీ, అది తన పెట్టెలో ఉన్నదనీ, అందుకే అంత సంతోషంగా ఉన్నాననీ చెప్పింది. ఆమె చీరను ఇంకా ధరించకపోయినా, ఆ చీర గురించిన ఆలోచనే ఆమెనలా నాట్యమాడేలా చేసింది. అప్పుడు దాసగణు మహరాజ్, కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్ల తన ప్రశ్నకు సమాధానమిచ్చిందని గ్రహించాడు. ఆనందంపై లగ్నంచేయి.

**గురువుగారు:**

బాబా తనదైన చక్కని శైలిలో సంతోషము, పరమానందము యొక్క నిజతత్త్వాన్ని వివరించారు. కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లకు ఒక క్రొత్త చీర ఇచ్చారు. ఆమె ఆ చీరను ధరించకుండా ఒక పెట్టెలో భద్రపరచింది. కానీ ఆనందంతో గంతులు వేస్తున్నది. తన క్రొత్త

చీర పెట్టెలో ఉన్నదన్న ఆ ఎరుకే ఆమెకు అంతటి ఆనందాన్ని కలిగించి ఆ ఆనందంతో నాట్యమాడేలా చేసింది. ఎందుకని? అది అర్థరహితం కదా! ఆమె ఇంకా ఆ చీరను ధరించలేదు. కానీ ఆమె చీర ధరిస్తే ఏమవుతుంది? చీర కట్టుకున్నంత మాత్రంచేత ఆమెకు ఎక్కువ ఆనందం వస్తుందా? లేదు. ఆమెకు ఆ ఆనందం అంతకు ముందే, "చీర నాది. అది నా పెట్టెలో ఉన్నది" అన్న విషయం తెలిసినప్పటి నుంచీ ఉన్నది. ఆమెకు ఆనందమివ్వడానికి ఆ ఆలోచన చాలు. అందుకే ఆమె చాలా ఆనందంతో గంతులు వేస్తున్నది. దానినే ప్రేమ అంటారు. దానినే సాన్నిధ్యమంటారు. అదే గొప్పదైన ఈశావాస్యోపనిషత్తు చెప్పింది కూడా.

చాలామందికి అర్థం కాని విషయమదే. ఆమెకొక చీర ఇచ్చారు. అది ప్రక్కనే ఉన్న గదిలో ఉన్నది. కానీ మనకది అవసరంలేదు. శారీరక అవసరాలు తప్పిస్తే చాలా విషయాలలో మన ఆనందం నిజంగా మనకు అవి ఉన్నాయన్న ఎరుక మీద ఆధారపడుతుందిగానీ వాటిని పొందటం వలన కాదు. బ్యాంకులో కొంత డబ్బు ఉన్నదన్న ఆలోచనే మనకానందాన్నిస్తుంది. మనం నిజంగా ఒక రూపాయైనా బ్యాంకు నుంచి (డ్రా) తీసుకుంటామా లేదా అన్నది వేరే విషయం. డబ్బు బ్యాంకులో ఉన్నది. "అది నాది" అన్నది చాలు. మనం చాలా నిశ్చింతగా, ఆనందంగా ఉంటాం. అది (డబ్బు) అక్కడ – మనమిక్కడ; అది అక్కడ – మనమిక్కడ ఉన్నాము. (నవ్వులు..) దీక్షిత్ పనిపిల్లలాగా; ఆమె చీర ధరించలేదు. మనము డబ్బును ఖర్చుపెట్టలేదు. అది బ్యాంకులో 5, 10, 15 సంవత్సరాల డిపాజిట్ రూపంలో ఉంటుంది. అయినా మనమానందంగా ఉంటాము.

**గురువుగారు:**

ఒక్కసారి "అవును. ఆయన నా వారు, ఆయన నాకు చెందినవారు. నేను ఆయనకు చెందినవాడిని" అనే ఎరుక ఉంటే అది చాలు. (గురువుగారు ఆయన కూర్చుని ఉన్న గదినుద్దేశించి..) నీవు ఇక్కడ కూర్చున్నా, క్రింది అంతస్థులో ఉన్నా, ఒకే గదిలో ఉన్నా లేదా రెండు గదులలో ఉన్నా, వాటి మధ్యన ఒక గోడ ఉన్నా సరే– తేడా ఏమీ లేదు. నేనిక్కడ కూర్చొని ఉన్నాను. నువ్వు అక్కడ ప్రక్కగదిలోనే కూర్చొని ఉన్నావు. కానీ మనకు గోడ చాలా ముఖ్యమైనదిగా కనబడుతుంది. అందుకే బాబా "అడ్డుగోడను తొలగించ"మన్నారు. అక్కడ కేవలం (అడ్డంగా) గోడ మాత్రమే ఉంది. నీవక్కడ – నేనిక్కడ. దీక్షిత్ పనిపిల్ల యొక్క చీరలాగా– నేనిక్కడ ఉన్నాను.

**గురువుగారు:**

నీ యథార్థమైన ఆనందానుభూతి నీవు అనుభవించే వస్తువుపై (విషయంపై) ఆధారపడిలేదు. దానిపట్ల నీకున్న దృక్పథం (నీ తీరు), ఆ విషయంపట్ల నీ వ్యవహార సరళి, అదే నీకు ఆనందాన్నిస్తుంది. అందుకే దీక్షిత్ పనిపిల్ల (తన చీర పెట్టెలోనే ఉన్నా, తనింకా దానిని ధరించకపోయినా కూడా) చాలా ఆనందం పొంది సంతోషంతో నృత్యం చేసింది.

ఉదాహరణకు ఓ వ్యక్తి ఉద్యోగం కోసం చూస్తున్నాడనుకొందాం. అతనికి అది అత్యవసరం. తర్వాత ఒకరోజు అతనికి ఉద్యోగం వస్తుంది. మొదటి జీతం అతనింకా అందుకోలేదు. అతనికి ఫలానా జీతంతో ఉద్యోగమొచ్చిందని ఈ–మెయిల్ సమాచారం (notice) మాత్రం

అందింది, అంతే. కానీ అతను ఎంతో ఆనందంగా ఉన్నాడు. అతనికి ఏమి జరిగింది? కేవలం ఆ ఎరుకే - ఉద్యోగమున్నది, దానిని తాను పొందగలడనే విషయం అతనిని ఆనందింపజేసింది. అదే- ఆ ఎరుకే అతనికి నిజమైన ఆనందాన్నిచ్చింది.

అలాగే ఈ ప్రాపంచిక విషయాలపట్ల మాత్రమే కాదు- అదే ఎరుక నీవెళ్ళి సాయిబాబా వంటి ఒక సద్గురువును కలసినపుడు కూడా ఉంటుంది. “అవును, ఇది నా ఈ-మెయిల్ ఉత్తరం, (నవ్వులు..) నాకు దక్కింది” (బాబా దగ్గరకు రావడం ఉద్యోగానికి సంబంధించిన ఈ-మెయిల్ సమాచారం వంటిది) అనే ఎరుక నీకు ఎంతో ఆనందాన్నివ్వాలి. నిర్వాణము, ముక్తి, సాక్షాత్కారము- ఏదైనా సరే, అది నీకింకా అందుబాటులోకి రాకపోయినప్పటికీ (ఇంకా దానిని పొందనప్పటికీ) ఆ అవకాశము, ఆ వాగ్దానము, అవును నాకు బాబా ఉన్నారు అనే ఖచ్చితమైన నమ్మకము నిన్ను ఆనందంగా ఉంచాలి. అందుకని మనమందరం కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లలాగా ఉందాము. (నవ్వులు..) ఆమెకు చక్కగా చీర ఉన్నది. మనకు బాబా ఉన్నారు. ఇంక దుఃఖానికి తావేది? కలతచెందడానికేమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం. ఆస్వాదిద్దాం. నృత్యం చేద్దాం. ఆనందంగా నృత్యం చేద్దాం.

**గురువుగారు:**

అనుక్షణం, ప్రతిశ్వాసలో ఆనందాన్ని ఆస్వాదిద్దాం. జీవితం మనకొక వరం. అది ఒక శాపం, దౌర్భాగ్యం కాదు. అది ప్రకృతి ప్రసాదించిన ఒక వరం. దాన్ని మనం ఆస్వాదిద్దాం. ఒకవేళ మీరు జీవితాన్ని

సంతోషమయం చేసుకోలేకపోయినప్పుడు సంతోషంగా ఉండడానికి ప్రయత్నించండి. ఎలా సంతోషంగా ఉండాలో అన్వేషించండి. ఈ సత్సంగాలు మొదలైనవి నీదైన నీ జీవితాన్ని నేర్పుతో ఎలా ఆనందమయం చేసుకోవాలో నీవు నేర్చుకొనేలా నీకు నేర్పడానికే ఉన్నాయి. అప్పుడు జీవంలేని వెనుకటి పాతక్షణాలు పోయి నీ జీవితం నిత్యనూతనంగా ఉంటుంది. ప్రతిక్షణం – అనుక్షణం నీ జీవితం క్రొత్తగా ఉంటుంది.

**గురువుగారు:**

బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్థం చేసుకొని (గుర్తెరిగి) ఆనందంగా ఉండడానికి ప్రయత్నించండి. అది ఆయన (బాబా) కృపాస్వరూపం. మీలో ప్రతి ఒక్కరిని బాబా ఎలా ఉంచారు, ఎక్కడ ఉంచారు (ఎలా మలచారు), ఆయన మీకు ఏమి ప్రసాదించారు అనేది మీలో ప్రతి ఒక్కరిలో నేను చూస్తూ ఉంటాను. మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటే ఎక్కువ ఇస్తాను. కానీ బాబా ఇచ్చిన దానిని ఆనందంతో అనుభవించండి, ఆస్వాదించండి!

**గురువుగారు:**

తెలుసుకోండి. ఆస్వాదించండి. ఉల్లాసంగా బాబా అనే ఆనందంతో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం చూస్తే నేనూ సంతోషపడతాను. బాబా అనే ప్రేమలో, ప్రేమ అనే ఆ ఆనందంతో ప్రకాశిస్తూ మీ అందరి ముఖారవిందాలు విప్పారి ఉంటాయి. బాబా

మీ వాడన్న నమ్మకము, నీవు బాబాకు చెందినవాడవన్న అనన్యత్వము ఉన్న ఆ రాజసం ఉండాలి. మనమంతా శ్రీసాయినాథ్ మహరాజ్ కుమారులం, కుమార్తెలం. ఆయన మహారాజు. (గురువుగారు నవ్వుతూ...) మనమూ ఆ రాజవంశీకులమే. మనం రాకుమారులం, రాకుమార్తెలం.



తెనాలి, 1993



# సమాధానం చెప్పే సమాధి

**భక్తుడు:**

'సమాధి' అనే పదాన్ని కాస్త వివరిస్తారా?

**గురువుగారు:**

ప్రేమను అనుభవించడం, ఆ ఆనందం లేదా పరిపూర్ణత్వం – దానిని మీరెలా పిలిచినా సరే – ఆ స్థితికి అడ్డుపడే అసంకల్పితమైన భావనలు కానీ, ఆలోచనలు కానీ లేకుండా అందులో పూర్తిగా లీనమైపోవడం. ఆ స్థితే 'సమాధి'.

**భక్తుడు:**

గురువుగారూ! మరి బాబా పార్థివదేహాన్ని ఉంచిన ప్రదేశాన్ని కూడా "సమాధి" అని ఎందుకంటారు?

**గురువుగారు:**

"సమాధి" అన్న పదానికి పలురకాల అర్థాలు ఉన్నాయి. మొదటి

అర్థం – పార్థివదేహాన్ని ఖననం చేసే ప్రదేశం. మరణించిన ఏ వ్యక్తిని ఖననం చేసిన ప్రదేశాన్నైనా 'సమాధి' అనవచ్చు (అంటారు). కాబట్టి ఒక అర్థం – సమాధి, గోరీ (tomb) అని. "సమాధి" అంటే సమాధానం పొందిన స్థితి. ఏ స్థితిలోనైతే మనలో అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలన్న మన అన్వేషణ ఫలించి, మన అవసరాలన్నీ తీరిపోతాయో అటువంటి స్థితి – ఇది 'సమాధి'కున్న రెండవ అర్థం. మూడవ అర్థం ఏమిటంటే, మనల్ని ప్రక్కకు లాగే పరస్పర విరుద్ధమైన భావోద్వేగాలుగానీ, ఆలోచనలుగానీ లేకుండా మనలోని భావోద్వేగాలు ఓ పరిపూర్ణ సామరస్యాన్ని పొంది అలా తన్మయమయ్యే మనస్సు యొక్క స్థితి. ఆ ఆనందప్రదమైన స్థితిని కూడా 'సమాధి' అంటారు.

"సమాధి"కి సరైన అర్థం ఏమిటంటే – ఏవిధమైన సంఘర్షణలు తిరిగి తలెత్తడానికి తావులేకుండా అక్కడితో మన అవసరాలన్నీ సంపూర్ణంగా తీరిపోవడం – విషయమంతటితో సమాప్తం అన్నమాట. ఇకపై తీరవలసిన అవసరాలుగానీ, కోరికలుగానీ ఉండవు. అందుచేత ఇకపై ఎటువంటి వైరుధ్యాలు తిరిగి తలెత్తడానికి కారణమైన బీజాలు కూడా ఉండవు. మామూలుగా భౌతికంగా చూస్తే మరణమనేది జీవితం యొక్క (జీవితానికి సంబంధించిన) శారీరక అవసరాలను తీరుస్తుంది లేదా పరిష్కరిస్తుంది. కాబట్టి మరణించిన తరువాత ఖననం చేసిన ప్రదేశాన్ని 'సమాధి' అంటారు. కానీ పారమార్థిక దృష్టితో చూస్తే మన యొక్క పారమార్థిక అవసరాలు అన్నీ సమాధానపడి సంపూర్ణత్వం పొందిన స్థితి ఏదైతే ఉందో, ఏ స్థితిలోనైతే మనలోని అస్పష్టమైన పరిపూర్ణత్వం ఒక విస్పష్టమైన రూపాన్ని సంతరించుకొని పూర్ణత్వస్థితి మనకు అనుభవమవుతుందో

– అదీ 'సమాధి'. అందుకని "సమాధి" అనే పదాన్ని వివిధ రీతులలో ఉపయోగించవచ్చు.

బాబా "సమాధి"లో ఉన్నారు, ఆ చైతన్యస్థితిలో ఉన్నారు. మనం ప్రత్యక్షంగా చూచే బాబా సమాధిస్థానం ఆయన భౌతికదేహాన్ని ఖననం చేసిన ప్రదేశం కాబట్టి అది ఆయన 'సమాధి'. మనం అక్కడకి వెళ్ళినప్పుడు మన అవసరాలు సమాధానపడి మనం పొందే అనుభవం 'సమాధి'. ఇలా బాబా సమాధికి "సమాధి" అనే పదానికి ఉన్న అన్ని అర్థాలు వర్తిస్తాయి. అందుకనే బాబా, "నా సమాధి సమాధానమిస్తుంది!" అన్నారు. ఆయన పరిపూర్ణస్థితి భక్తుల వివిధ రకాల అవసరాలు తీరుస్తుంది. అది సమాధానమిచ్చే సమాధి.

**గురువుగారు:**

1918కి ముందు కూడా బాబా తమ దేహానికి పరిమితమై లేరు. ఎందుకంటే బాబానే స్వయంగా, "నా ముర్షద్ (గురువు) నన్ను ఏనాడో ఈ దేహం నుంచి విడుదల చేశారు. ఎవరైతే ఈ దేహాన్నే సాయిబాబా అనుకుంటారో వారు సాయిబాబానసలు చూడనట్లే" అని చెప్పారు. తమ దేహం నుండి ఆయన అప్పటికే విడుదలయ్యారు కనుక నిజానికి ఆయన దేహమే ఒక సమాధి; కొద్దిమందితో వ్యవహరించగల పరిమితమైన కదలాడే ఒక చిన్న సమాధి. ఆయన ప్రేమస్వరూపులు, పెరుగుతున్న భక్తుల అవసరాలు తీర్చాలనుకున్న వారు కనుక, భక్తులకు కూడా ఆయనతో వ్యవహరించడానికి ఒక ఆలంబన కావాలి కనుక తరువాత ఆయన మారవలసివచ్చింది. అందుకని ఆయన తమ 'సమాధి'ని మార్చుకున్నారు. ఆ సమాధి (ఆయన

భౌతిక శరీరం) నుంచి తమ దేహం యొక్క, ఆకారం యొక్క పరిధిని పెంచి ప్రస్తుతం ఉన్న సమాధికి మారారు. అందుకనే ఆయన, "నా సమాధి మాట్లాడుతుంది, నా సమాధి కదులుతుంది, నా సమాధి సమాధానం చెబుతుంది" అన్నారు, ఆయన భౌతికదేహం అంతకు ముందు సమాధానమిస్తూ ఉండిన రీతిలోనే!

**గురువుగారు:**

మనం బాబా రూపాన్ని చూచి ఆయన ఒక సద్గురువు అని భావిస్తాము. కానీ ఏ లక్షణాలను అనుసరించి (అలా అనుకుంటాము)? ఆయన ఒక ప్రత్యేకమైన స్థితిలో ప్రకటమైనారు కనుక! ఆ స్థితి ఆయనకు సద్గురువు అనే స్థాయిని ఇస్తుంది. అక్కడ ప్రధానమైనది ఆయన రూపంకాదు, ఆయన స్థితి. అందుకనే బాబా పదేపదే "నేనీ దేహాన్ని కాదు. నేనీ రూపం మాత్రమేకాదు. ఈ శరీరం ఏదో ప్రకటమవడానికి ఒక సాధనం, ఒక సమాధి మాత్రమే" అంటుండేవారు. మనకు ఆ స్థితి ఒక స్పష్టమైన మార్గం (రూపం) ద్వారా తెలియజేస్తేగానీ బోధపడదు కనుక ఆ స్థితి సాయిబాబా రూపంగా ప్రకటమైంది.

**భక్తుడు:**

గురువుగారూ! ఈరోజు భగవాన్ రమణుల వర్ధంతి. ప్రస్తుతం ఈ రోజును ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకొంటున్నారు, మరి ఏభై సంవత్సరాలక్రితం భగవాన్ దేహాన్ని వదలిపెట్టినప్పుడు ఆయన సాన్నిధ్యాన్ని కోల్పోయిన భక్తుల పరిస్థితి ఇలా ఉండివుండదు కదా!

ఆ ప్రకారంగా ఈ రోజు ఎంత పవిత్రమైన రోజైనా, అప్పుడున్న ఆయన భక్తులకు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆయన భౌతికదేహం లేకుండా పోయినప్పుడు ఎలా ఉండివుంటుంది అని ఆలోచిస్తే, అది ఖచ్చితంగా వేదనాభరితంగానే ఉంటుంది కదా!

**గురువుగారు:**

ఆయన విదేహులైన రోజు భక్తులకు ఎంతో విషాదకరమైన రోజు. అందులో సందేహం లేదు. సాధారణంగా భారతదేశంలో మహాత్ములు సమాధి చెందిన రోజును సంతాపదినంగా కాక ఉత్సవంలా జరుపు కొంటారు. ఎందుకంటే మహాత్ములకు మరణం లేదని వారికి తెలుసు. అప్పటి భక్తులకు తమ సద్గురువు భౌతికదేహంతో ఉన్నప్పుడుగల వ్యక్తిగత సాన్నిహిత్యంవల్ల ఆయన దేహత్యాగం చేసిన రోజున వారు ఎంతో బాధతో విలపించారు. అది సహజం. అది వారికి అత్యంత విషాదకరమైన రోజు. మహాత్ముల భౌతికశరీరంతో భక్తులకుగల వ్యక్తిగత సంబంధం వలన వారి భౌతికశరీరం వెళ్ళిపోయేటప్పుడు ఎంతో హృదయవిదారకంగా ఉంటుంది. దాని స్థానంలో కాలక్రమేణా సాంప్రదాయం వస్తుంది. కనుమరుగైంది భౌతికశరీరం మాత్రమేనని తెలుసుకొని, వారు ఆ మహాత్ముని సాన్నిధ్యాన్ని వేరేవిధంగా ఇంకా ఇంకా అనుభవించగలుగుతారు.

నేను ముందు చెప్పినట్లు, ఓ మహాత్ముని మరణం – అది మరణం అని అనుకుంటే – కొంతమంది మహాత్ముల విషయంలో వారి మహిమ, వారి అవతారకార్యం యొక్క విస్తృతికి నిదర్శనం. అందువల్ల మహాత్ములు దేహత్యాగం చేసిన రోజును సంతాపదినంగాకాక ఉత్సవంలా జరుపుకుంటారు. ఒకవేళ మహాత్ముని మరణానికి

సంతాపం పాటించాల్సి వస్తే అసలు ఆయన మహాత్ముడేకాదు, కారణం మహాత్ములకు మరణమంటూ ఉండదు కనుక. అందుకే దానిని వర్ధంతి అంటారు. వర్ధ అంటే పెరిగేది, విస్తరించేది, వికసించేది – పెరగడం అన్నమాట. దేహత్యాగంతో భౌతికమైన పెరుగుదల ఆగిపోవచ్చుగానీ వారి ద్వారా ప్రకటమయ్యే మహాత్మ్యప్రభావం ఆగిపోదు (ఇంకా ఎక్కువవుతుంది). కాబట్టి వాస్తవానికి ఆయన మరణించలేదు.

**భక్తుడు:**

గురువుగారూ! ఎవరైనా మరణించిన తరువాత ఎక్కడకి వెళతారు, ఏం జరుగుతుంది అని తెలుసుకోవడం సాధ్యపడుతుందా?

**గురువుగారు:**

అవును, తెలుసుకోవడం సాధ్యమే.

**భక్తుడు:**

మరి ఎలా తెలుసుకోగలం?

**గురువుగారు:**

ఇప్పుడు ఇక్కడ ఉన్నదేదో తెలుసుకుంటే, నీ ఆత్మ గురించి ముందు తెలుసుకుంటే (అది కూడా తెలుసుకోవచ్చు). నీ ఆత్మ ఎక్కడ ఉందో నీకు తెలుసా? ఉంటే ఎక్కడ ఉంది? ఎలా ఉంది? ముందు దాని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించు.

**భక్తుడు:**

గురువుగారూ! "మీరు నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించలేకపోతే

నా రూపాన్ని ధ్యానించు" అని బాబా అన్నారు. రూపంతో అనుబంధం ఉన్న మాలాంటి భక్తులు వారి గురువు మహాసమాధి చెందితే తాము అనాథలమైపోయామని భావిస్తారా లేక తమ గురువు సంరక్షణలో ఉన్నామని భావిస్తారా?

**గురువుగారు:**

నేను బాబా రూపంతో ఆనందానుభూతిని పొందినది ఆయన మహాసమాధి అనంతరమే.

**భక్తుడు:**

కానీ మీరు బాబా సజీవరూపాన్ని చూసి ఉంటే మీ అనుభవం ఎలా ఉండివుండేది?

**గురువుగారు:**

అది ఇంకా గొప్పగా ఉండివుండేది. ఎందుకంటే అసలు బాబా భౌతికదేహం కానేకాదని తొలిసందర్భంలోనే ఒక్కసారి చూడగానే తెలుసుకోగలిగేవాడిని. నా దురదృష్టవశాత్తూ, బాబాను చూడటానికి ఆయన ఫోటో మాత్రమే ఉంది కనుక కొంతకాలంపాటు నేనాయన రూపాన్ని అంటిపెట్టుకొని ఉండవలసివచ్చింది. కానీ ఏక్షణాన్నైనా బాబా మనకు అదే అనుభవం ఇవ్వలేకపోతే ఆయన బాబా ఎలా అవుతారు?

ఏదేమైనా ముందు ప్రస్తుతాన్ని గురించి ఆలోచిద్దాం. (గురువుగారు నవ్వుతూ...) ఒకవేళ మనము ఈ అన్ని రూపాలు అశాశ్వతమని, ఏ రూపమైనా కాస్త ముందువెనుకగా మాయమవుతుంది అని తెలుసుకుంటే, దీని నుంచి (ఆ ఎరుకవల్ల) ఆ రూపం రూపాతీతస్థితికి ఒక సాధనం మాత్రమేనని మనం రూపం యొక్క విలువను అవగతం చేసుకోగలం. అందుకే నేను, కిటికీ ఫ్రేమ్‌ని చూడకండి, కిటికీని

చూడండని కిటికీని ఉదాహరణగా చెప్తాను.

**భక్తుడు:**

కానీ మనకు తొలుత ఫ్రేమ్ మీద దృష్టి పెట్టాల్సిన అవసరముంది కదా గురువుగారూ?

**గురువుగారు:**

మొదట అది ఫ్రేమ్‌తోనే ప్రారంభమవుతుంది. కానీ మీరు అక్కడే ఆగిపోవద్దు. ఊరికే ఇంకా ఇంకా అలా కిటికీ ఫ్రేమ్ ద్వారా చూడండి. అలా చేస్తే అదే మిమ్మల్ని కిటికీ అవతలకు తీసుకొని వెళుతుంది.

**భక్తుడు:**

కానీ ఒకవేళ ఫ్రేమ్‌తో మేము ఆనందంగా ఉంటే...?

**గురువుగారు:**

అయితే ఫ్రేమ్‌తోనే సంతోషపడండి!

**భక్తుడు:**

గురువుగారూ! ఆధ్యాత్మికతలో సాధారణంగా సాకారానికంటే నిరాకారానికి ప్రాముఖ్యత ఉంటుంది ఎందుకు?

**గురువుగారు:**

కారణమేమీ లేదు. రూపం కూడా అంతే విలువైనది, ముఖ్యమైనది. కాదని ఎవరన్నారు? ఇప్పటికీ నేను బాబాని పూజిస్తాను. ఆయన

రూపాన్ని చింతన చేస్తాను. నాకు సాకారంతో ఎటువంటి ఇబ్బంది లేదు. అలాగే నిరాకారంతో కూడా లేదు! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

కానీ రూపాన్ని దాటి నిరాకారాన్ని చేరుకోవాలి అని మేమెప్పుడూ వింటుంటాం...

**గురువుగారు:**

బాబా రూపం ఒక రూపమే కానీ ఆ రూపం ఇచ్చే ఆనందం ఎప్పుడూ రూపరహితం. ఆనందానికి నీవు ఏ రూపాన్ని ఇవ్వగలవు? ఒకే సమయంలో రెండూ ఉంటాయి. నీవు బాబాకేసి చూసినప్పుడు నీకొచ్చే ఆనందానుభూతి రూపరహితం. బాబా కూడా అదే విషయాన్ని "నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు. నీకది సాధ్యపడకపోతే నా రూపాన్ని ధ్యానించు" అని చెప్పారు. కానీ నీవు రూపం మీద దృష్టి నిలుపగానే మళ్ళా ఆనందాన్నే ధ్యానించడం మొదలవుతుంది. (గురువుగారు నవ్వుతూ...) అదే మరి బాబా అంటే.



తిరువణ్ణామలై, 1995



# జీవితం

**భక్తుడు:**

పారమార్థిక జీవితం, ప్రాపంచిక జీవితం వేర్వేరా? మనం వాటిని ఎలా సమన్వయపరచుకోగలం?

**గురువుగారు:**

వాస్తవానికి రెండు జీవితాలంటూ ఏమీ లేవు. నీవు జీవించేది ఒక్క జీవితాన్నే. అది పారమార్థికమా, ప్రాపంచికమా అనే నిర్ణయం నీ లక్ష్యం మీద, నీ గమ్యం మీద, ఇంకా దేనినుండి నీవు నీ ఆనందాన్ని పొందుతున్నావో ఆ మూలకారణం మీద ఆధారపడివుంటుంది. ఒకవేళ నీవు ఆనందం లౌకిక విషయంద్వారా పొందితే దానిని నీవు ప్రాపంచిక జీవితమనీ, లేదూ.. మనం పారమార్థికమనుకునే విషయాలద్వారా పొందితే దానిని ఆధ్యాత్మికజీవితమనీ అంటావు. బాబా ఈ రెండింటి మధ్య భేదాన్నెప్పుడూ చూడలేదు. మనుషులంతా

ఎందుకోసం పాటుపడుతున్నారో, ఒక మనిషి ప్రయాసకు ఆధారమైన నిజమైన మూలకారణమేమిటో ఆయన చూశారు. అది లౌకికంగా కానీ, పారమార్థికమైన ప్రయత్నం కానీ అసలు మనుషులెందుకు ఆరాట పడతారు? అది ఆనందం కోసం, తృప్తి కోసం!

సాధారణంగా ప్రాపంచిక విషయాలద్వారా మాత్రమే ఆనందం వస్తుందని అందరూ అనుకుంటారు. ఒకవేళ, "లేదు లేదు! అది ఆనందం కాదు!" అని ఎవరైనా వాళ్ళకు చెప్పినా కూడా, వాళ్ళింకా దానిని ఆనందంగానే అనుభవం పొందుతుంటారు. వాళ్ళు డబ్బు కావాలనుకొంటారు, లేదా వాళ్ళకో సమస్య ఉంది. అది తీరితేగానీ వాళ్ళు ఆనందంగా ఉండలేరు. నీవు, "ఇదంతా మాయ. నిజమైన ఆనందం ఆవల ఎక్కడో ఉంటుంది" అని అంటే గౌరవంకొద్దీ వాళ్ళు వింటే వింటారేమోగానీ అది వాళ్ళకు హృదయగతంకాదు. అదీగాక అసలు వాళ్ళకది నిజంగా అర్థమవదు. కనుక బాబా ఏం చేస్తారంటే మొదట మన కోరికలను తమ శక్తితో తీరుస్తారు. ఒకసారి మన ఆనందానికి బాబా మూలమని తెలిసిన తర్వాత మన దృష్టి చిన్నగా అసలు కోరికకు కారణమైన వస్తువు (విషయం) నుంచి ఎవరైతే దాన్ని ఇస్తారో వారి (బాబా) మీదకు మరలుతుంది.

మనం మన ఆనందాన్ని విభిన్న విషయాల (కారణాల) ద్వారా పొందుతుంటాం. ఎప్పుడైతే ఇవన్నీ ఇవ్వగల సద్గురువనే ఓ ఆధారం దొరికిందో, మన మనస్సు ఇంకా ఇంకా ఆయనపై లగ్నంకావడం మొదలవుతుంది. అప్పుడు ఆయనపట్ల మన ప్రేమ పెరిగేకొద్దీ ఇతర విషయాల పట్ల ఆకర్షణ క్రమంగా బలహీనపడుతూ పోయి ఒక్క సద్గురువు పట్ల గల ఆకర్షణ మాత్రమే మిగులుతుంది.

భక్తుడు:
దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను ఓ భాగంగా ఎలా చేసుకోగలం?

**గురువుగారు:**
నీవెందుకు జీవితాన్ని ఆధ్యాత్మికమైనది, ఆధ్యాత్మికము కానిది అని విభజిస్తావు? ఎందుకు ఈ కృత్రిమమైన విభజన చేసి ఒకదానికి ఎక్కువ, మరోదానికి తక్కువ విలువనిస్తావు? జీవితం జీవితమే. అందుకని మన దైనందినజీవితంలో ఆధ్యాత్మికతను ఒక భాగం చేసుకోవడమన్న ప్రశ్నే లేదు. సాధన అనేది మన జీవితంలో భాగం కావడంగాక మన జీవితమంతా మన సాధనలో భాగం కావాలి. ప్రతి రోజూ ఓ గంట ధ్యానం– అని మనం దానికి కేటాయించిన ప్రత్యేకమైన సమయంలోనే కాకుండా రోజుకు 24 గంటలు ఆధ్యాత్మికసాధన సంభవమవ్వాలి. మనకు నేర్చుకోవాలనే దృక్పథమే ఉంటే నిత్యజీవితంలోని ప్రతి సందర్భాన్నీ సాధనగా చూడగలం, ఉపయోగించుకోగలం. అది ప్రపంచాన్నంతా గురువులాగా భావించడం, జీవితాన్నంతా గురువుగా చూడడం, ప్రతి విషయం నుంచీ, ప్రతి వ్యక్తి నుంచీ నేర్చుకోవడం. అందుకని మౌలికంగా ప్రాపంచికము, పారమార్థికము అనే తేడా ఏమీ లేదు. అదంతా మన స్వభావం (వైఖరి) మీద ఆధారపడుతుంది. ప్రాపంచికమైన ఒకానొక విషయం ఆధ్యాత్మికం కావచ్చు. ఆధ్యాత్మికమైన ఏదో ఒక విషయం ఫక్తు ప్రాపంచికమూ కావచ్చు.

**గురువుగారు:**
మీకు ప్రపంచం పట్ల వ్యామోహం ఉంది కనుక దానిని మీ ఆధ్యాత్మికగమ్యాన్ని పొందే ఒక సాధనంగా మలుచుకోండి. అప్పుడు

ప్రపంచమంతా దానికి మార్గమౌతుంది. సాధారణంగా ఓ సాధకునికి ప్రపంచమంతా ఒక అడ్డంకిగా, ఒక శత్రువుగా, ఒక పీడకలగా పరిగణింపబడితే అదే ఒక సాయిభక్తుడికి మాత్రం అతని గమ్యానికి అతన్ని మరింత, మరింత దగ్గరగా తీసుకొచ్చే ఒక సాధనమవుతుంది. ఉదా॥కు మనకు జబ్బు చేసినప్పుడు, చాలా ఆధ్యాత్మికవర్గాల్లో దానిని గురించి పట్టించుకోకూడదనుకోవడం జరుగుతుంది. దానితో, మన సాధనకుగానీ, మన సద్గురువుకుగానీ ఎలాంటి సంబంధం ఉండదు. "నీవు శరీరంకాదు. ఈ జబ్బు గురించి ఆందోళనపడవద్దు. ఆత్మ మీద మనస్సు లగ్నం చేయి" అని గురువు నీకు చెబుతాడు. కానీ మనం మన అనారోగ్యంతో ఇబ్బందిపడుతూ ఉంటాము. అందుకని మనకు మనం "మనం శరీరం కాదు" అని చెప్పుకుంటాం. కానీ అదే సమయంలో అనారోగ్యం గురించి బాధపడుతుంటాము, అందుకని ఓ సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ ఒక సాయిభక్తుని విషయంలో అతను జబ్బుపడితే అతనికి నయమవడానికి బాబా దగ్గరకెళతాడు. అప్పుడు అతను తేటపడితే, "ఓ! బాబా నాకు నయం చేశారు!" అని అనుకుంటాడు. మామూలుగా ఒక అడ్డంకిలా కన్పించే ఆ శరీరమే, చివరకు జబ్బు కూడా, అతనికి సద్గురువుకు మరింత చేరువవడానికి సాధనమవుతుంది. విషయాలను ఈ విధంగా చూడడం ద్వారా, మన జీవితమంతా మన సద్గురువుపట్ల మన ప్రేమను వ్యక్తీకరించే విధంగా చేసుకోవచ్చు. అది ఏ మాత్రం లాంఛనప్రాయమైన అలవాటుగా అనిపించక మనలోకి ప్రేమస్ఫూర్తిని ఊపిరులూదే నిరంతరమైన, అనంతమైన (శ్రద్ధతో కూడిన) ఆరాధన. నీ జీవితమంతా ఆధ్యాత్మిక సాధనలో భాగం కావాలి అనడంలో నా ఉద్దేశ్యం అదే.

**గురువుగారు:**

కోరికలుండటం మంచిది కాదని, అవి పారమార్థికమైనవి కావని చెప్పి, కోరికలను వదలిపెట్టమని, కోరికలను త్యజించమని బాబా తన భక్తులను ఎన్నడూ అడగలేదు. మనకు గల వివిధ ఆకర్షణలను ఆయన (బాబా) నెమ్మదిగా తన పట్ల ఎనలేని ఆకర్షణగా మారుస్తారు. ఉదాహరణకు, ఓ వ్యాపారస్తుడు ఉన్నాడనుకోండి. ఒకసారి అతను బాబా దగ్గరకు వచ్చాక ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు బాబాను ప్రార్థించి తద్వారా అతను విజయం సాధిస్తాడు. కాబట్టి అతని వ్యాపారవిజయం అతన్ని బాబాతో కలుపుతుంది. వ్యాపారం అతనిని అతని సద్గురువు నుండి దూరం చేయడంలేదు, నిజానికి అతనికి గల డబ్బు అనే గట్టి వ్యామోహం– ఆ ప్రధానమైన ఆకర్షణ, అతనిని బాబాకు ఇంకా ఇంకా చేరువ చేస్తుంది. కాంట్రాక్టు వచ్చిన ప్రతిసారీ విధిగా బాబా దగ్గరకొస్తాడు. ఒకవేళ ఏ కాంట్రాక్టూ వచ్చివుండకపోతే అసలు బాబా దగ్గరకు వచ్చేవాడు కాదేమో!! (గురువుగారు నవ్వుతూ...) అసలు పారమార్థికం కాదు అని అనుకునే వ్యాపారం అతనిని పారమార్థికం అని అనబడే దానివైపుకు లాగుతోంది. ఈ పరివర్తన ఎలా తీసుకురావాలో బాబాకు తెలుసు. ఇలాగ అతని జీవితం వ్యాపారం మీద ఆధారపడి ఉంది. కానీ ఆ వ్యాపారం బాబా మీద ఆధారపడి ఉన్నందువల్ల చివరకు అతని జీవితం సమస్తం బాబా మీద ఆధారపడివుంటుంది. ఈ ఆకర్షణలు, రగులుతున్న కోరికలు... ఇవన్నీ అక్కడ ఇక్కడ చెల్లాచెదురుగాపడి మండుతున్న చిన్నచిన్న పుల్లల్లాంటివి. బాబా వీటినన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి పెద్ద జ్వాలగా మార్చాలనుకుంటున్నారు. అదీ మార్గం.

**గురువుగారు:**

ఒకసారి తన కోరిక తీరి భక్తునికి ఆ అనుభవం తన సద్గురువు ద్వారా వచ్చిందని తెలిసాక వారిద్దరి మధ్యనుండే ప్రేమానుబంధం భక్తునిలో పరివర్తనకు దారితీస్తుంది. ఇక్కడ లక్ష్యం ఆ కోరిక తీరడం కాదు; పరివర్తన.

**భక్తుడు:**

కానీ భక్తుని పరంగా చూస్తే చాలా సందర్భాలలో కోరిక తీరడమే లక్ష్యంగా కన్పిస్తుంది.

**గురువుగారు:**

వాళ్ళకు అలాగే ఉంటుంది. పరివర్తన కోసం వాళ్ళు ఎదురుచూడక పోవచ్చు. కానీ వాళ్ళ కోరికలు బాబా తీరిస్తే మాత్రం అది పరివర్తన కోసమే. అది వాళ్ళకు తెలియకపోవచ్చు. అది ముఖ్యంకాదు. ఆ అనుభవాన్ని ఇచ్చింది మాత్రం బాబా అని తెలుసుకుంటే చాలు.

**గురువుగారు:**

మనకందరికీ ఏదో కొరత ఉంటుంది, కానీ అదేంటో మనకు తెలీదు. కాబట్టి ఇది ఆనందం ఇవ్వవచ్చు, లేకపోతే అది నాకు ఆనందం ఇవ్వచ్చు అని ప్రయోగాలు చేస్తాం. ఆ కొరతను తెలుసుకోవడానికి ప్రపంచమంతా ప్రయోగాలు చేస్తోంది, పరిశ్రమిస్తోంది. వివిధ మార్గాలలో ఆధ్యాత్మికత అని పిలువబడేది కూడా ఓ మార్గం. ఆనందం కోసం ప్రయత్నిస్తున్నంతవరకు ప్రతి ఒక్కరూ సాధకులే, అందరూ ఆధ్యాత్మికపథంలోనే ఉన్నారు. అందరూ ప్రయత్నిస్తున్నారు. ప్రయత్నించే పద్ధతిననుసరించి దారులు వేరవుతాయి.

మనిషికి స్వభావరీత్యా ఆనందమనేది ప్రాథమిక అవసరం. అలా కాకపోతే ఆధ్యాత్మికతకు అర్థంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి డబ్బు కోసం కష్టపడుతున్నాడనుకుందాం. డబ్బు ఎందుకు? ఆనందం కోసం. అధికారమెందుకు? ఆనందం కోసం. సంబంధబాంధవ్యాలు, స్నేహితులెందుకు? ఆనందం కోసం. వేలకొలది రకరకాల మార్గాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారు... ప్రయత్నిస్తున్నారు... ప్రయత్నిస్తున్నారు. ఆనందం కోసం సమస్త ప్రపంచం ప్రయత్నిస్తోంది, పరిశ్రమిస్తోంది. మానవులంతా ప్రయత్నిస్తున్న ఈ లక్షలాది పద్ధతుల్లో – ఇప్పటికీ ఇంకా ఇంకా ఆవిష్కృతమవుతున్నటువంటి వాటిల్లో – మన మార్గంలో మనమూ ప్రయత్నిస్తున్నాం. ఈ మార్గంలో ప్రయత్నించడంవల్ల బహుశ మనమేదో పొందుతాం. అది మహాత్ములు ప్రవచించినటువంటి, ఇతరత్రా దేనిమీదా ఆధారపడనటువంటి ఓ ఆనందం. ఆనందం కోసం తపించడమన్నది మానవుని సమస్య. మానవనైజమైన ఆ సమస్యకు మాత్రమే మనం ప్రతిస్పందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కూడా! ప్రత్యేకమైనటువంటి పద్ధతుల్లో పరిష్కరించుకోవడానికి ఇదేదో మనకు మాత్రమే గల ప్రత్యేకమైనటువంటి సమస్య కాదు. అది అసాధారణమైన రోగమేమీ కాదు. అది ఒక సామాన్యమైన బాధ. మార్గాలే వేరు. కొన్నింటిని ఆధ్యాత్మికమని, కొన్నింటిని ప్రాపంచికమని ముద్రవేశారు. నేను మనుషులందరికీ ఉండే ప్రాథమికమైన తపన గురించి మాట్లాడుతున్నాను. ఆనందానికి అందరూ అర్హులే, అందరూ సమర్థులే. అందరూ అన్వేషిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆ అన్వేషణ కొనసాగిస్తే, అన్వేషణలో నిజాయితీ ఉంటే అందరూ దానిని తప్పక పొంది తీరుతారు.



*తిరుమల, 1995*



# ధ్యానం

**గురువుగారు:**

ధ్యానమంటే మనకు ప్రీతికరమైన విషయంపట్ల గల మన ప్రేమను, మన వాంఛితాన్ని అభివ్యక్తీకరించడం, అనుభవించడం. ఉదాహరణకు సత్సంగం తరువాత నేను గది నుండి బయటకు వెళ్ళిపోయాక మీరంతా నిశ్శబ్దంగా కూర్చుంటారు. సహజంగా మనసుకు వచ్చే ఆలోచనల అవసరం అప్పుడు ఉండదు. సత్సంగం నుండి మీరు కొన్ని పదాలు.. కొన్ని భాగాలు.. ఇలా ఏదో గ్రహించి ఉంటారు. అది మేధాజనిత సిద్ధాంతంగానీ, భావనలుగానీ, ప్రబోధాలుగానీ కాదు. మనస్సు ఆలోచించడానికి నిరాకరిస్తుంది; అది మగ్నమవుతుంది, అది లయిస్తుంది, అది తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. మీరు అంతరంగంలో ఆనందాన్ని అనుభవిస్తూ మూతబడిన కన్నులతో అలా కూర్చుని ఉండిపోతారు. ఆ ఆనందానుభవమే ధ్యానం.

**భక్తుడు:**

తీవ్రమైన ధ్యానం అంటే ఏమిటి? అందులో ఆలోచనలు ఎటువంటి పాత్రను పోషిస్తాయి??

**గురువుగారు:**

ఏ పారవశ్యమైన అనుభవంలో మనం మన (హృదయ) కలశం అంచుల వరకు పూర్ణంగా నిండిన అనుభూతిని పొందుతామో అది తీవ్రమైన ధ్యానం. ఆ పూర్ణత్వ అనుభవం వలన, మనం అసలు ఆలోచనలు తలెత్తుతున్నాయా లేదా అన్న విషయం కూడా పట్టింపు లేని స్థితికి చేరుకుంటాం. మన ధ్యాసంతా ఆ అనుభవం మీద నిలిచి ఆలోచనలు పూర్తిగా తమ ప్రాధాన్యతను కోల్పోతాయి. ఒకవేళ ఆలోచనలు తలెత్తినా ఆ అనుభవం మీద నుండి మనల్ని మరల్చ గలిగేటంత శక్తి వాటికుండదు.

**గురువుగారు:**

మనలోని ప్రేమోద్వేగాన్ని జాగృతం చేయడమే ధ్యానం యొక్క ప్రధానోద్దేశ్యం. మనలో ప్రేమ జాగృతమైనప్పుడు నిజమైన ధ్యానం మొదలవుతుంది. ధ్యానమంటే మనిషిని ఏ ఆలోచనలు లేకుండా, భావోద్వేగాలు లేకుండా, నిరాసక్తంగా, ఉదాసీనంగా, స్తబ్ధంగా, శిలలాగా మార్చేదికాదు. ధ్యానమంటే శిలను మనిషిగా మార్చడం. భావోద్వేగాలను ఒక క్రమపద్ధతిలో పెంపొందించుకుని సమన్వయం చేసుకుంటే అవి జీవితంలో ఉపయుక్తంగా వ్యక్తీకరించబడతాయి. ఓ భావోద్వేగం బలమైనదైతే మిగతావన్నీ సహజంగా దానితో సామరస్యాన్ని పొందుతాయి. మనస్సును శూన్యంగా ఉంచుకోవడం ధ్యానం కాదు. ధ్యానమంటే జీవితపు మధురిమలను ఆస్వాదించడం.

అంతేగానీ జీవితం నుండి తప్పించుకోవడం, జీవితానికి నిన్ను నువ్వు దూరం చేసుకోవడం కాదు. జీవితం ఎంతో సహజమైనది. ఒకవేళ నీవు ప్రపంచం నుండి తప్పించుకోవాలనుకొంటే, అది నిజం నుంచి తప్పించుకోవాలి అనుకోవడమే. అంతేకాదు, మనం అనుభవించలేకపోతున్నదేదో జీవితంలో ఇంకా ఉంది కనుక, ధ్యానంలో ఆ భాగాన్ని కూడా నీవు అనుభవంలోనికి తెచ్చుకోగలవు. దాన్ని సత్యాన్వేషణ అనవచ్చు. కానీ ఆ అన్వేషణలో మిగతా జీవితాన్ని శూన్యమని, మాయ అని తిరస్కరించవద్దు. అలా కాకుండా జీవితంలో పాలుపంచుకోండి, జీవితాన్ని ప్రేమగా అక్కున చేర్చుకోండి.

**గురువుగారు:**

మనలో అస్పష్టంగా ఉండే సంపూర్ణత్వభావనను విస్పష్టం చేసుకోవడానికి మనం చేసే కృషికి ధ్యానం ఓ వ్యక్తీకరణమైనప్పుడు శ్రద్ధ దానంతటదే వస్తుంది, ఆసక్తి దానంతటదే వస్తుంది. మనకు లక్ష్యం పట్ల ప్రేమ ఉన్నప్పుడు దాని ఒకానొక పర్యవసానం లేదా లక్షణం– శ్రద్ధ. మందకొడిగా, నిరాసక్తంగా కూర్చొని గడియారాన్ని చూస్తూ సమయాన్ని గమనించడం... ఇది కాదు శ్రద్ధ. శ్రద్ధాసక్తులు ఉంటే 2,3 గంటలు కూర్చున్నా మీరు గడియారాన్ని గమనించరు.

**భక్తుడు:**

ధ్యానానికి కూర్చున్నప్పుడు మేము ఏదైనా పద్ధతిని అనుసరించాలా?

**గురువుగారు:**

అవసరం లేదు! అలా కూర్చుని దానిలోని ఆనందాన్ననుభవించండి;

అసలు ఆ ఆనందాన్ని అనుభవించడమే నిజమైన ధ్యానం. ఒకవేళ మనస్సు చంచలంగా ఉంటే, మీకు నచ్చిన మార్గాలలో బాబా మీద లగ్నం చేయడానికి ప్రయత్నించండి. అది బాబా నామస్మరణ కావచ్చు లేదా బాబా గురించి చింతన చేయడం కావచ్చు... ఇలా ఏదైనా సరే. నీవు ధ్యానం చేస్తున్నావన్న ఎఱుకలో కూడా లేనటువంటి సమయమాసన్నమవడమే సరైన ధ్యానమంటే. అదెలా ఉంటుందంటే, నీకు బాగా ఆకలివేస్తున్నది, చుట్టుప్రక్కలెక్కడా రెస్టారెంట్ లేదు. రెస్టారెంట్ దొరికేవరకు దానికోసం అక్కడకు, ఇక్కడకు పరుగెత్తి, చివరకు దానిని కనుగొని ఆహారాన్ని ఆవురావురమని తింటావు. తినిన తరువాత నీకు ఎలా అనిపిస్తుంది? "ఆహా! భలే రుచిగా ఉంది" అంటావు. నీకు ఎంతో తృప్తిగా అనిపిస్తుంది. అప్పుడు "ఆహా! ఇప్పుడు ఓ కునుకు తీయాలి" అనిపిస్తుంది. ఆ పరిపూర్ణమైన తృప్తిని అనుభవించడం వలన అప్రయత్నంగా మీ కళ్ళు మూతబడి తీసే కునుకులాంటిది– నిజమైన ధ్యానమంటే.

**భక్తుడు:**

గురువుగారూ! మేము మనస్సు బాబా మీద లగ్నం చేయలేక, ఆ ఆనందానుభూతి పొందలేకపోతే ఏం చేయాలి?

**గురువుగారు:**

మనస్సును బలవంతపెట్టకుండా, నీకు వీలైన మార్గంలో ఆలోచించి నీవు ఆరాధించే నీ లక్ష్యంతో (బాబాతో) బంధమేర్పరచుకోవడానికి ప్రయత్నించు. నీకు పరిపూర్ణతను, ఆనందానుభూతిని ఇచ్చేది ఆ అనుబంధమే కనుక, ఆ బంధాన్ని కలిగించేది ఏదైనా సరే దానిని

ఇంకా ఇంకా చెయ్యి. నీ లక్ష్యమే నీకు అనుభవాన్నిస్తుంది, ఆనందం దాని స్వభావం – అది బాబా యొక్క స్వరూపం. ఒకసారి బాబాను పొందాక ఇక ఏ ఇతర సాధనలు అవసరంలేదు. కానీ ఎల్లవేళలా ఆయనను (ఆ అనుభవాన్ని) పొందడం సాధ్యపడదు, చాలాసార్లు మనము దానిని (ఆ ఆనందాన్ని) అనుభూతి చెందం. అందుకని అలాంటి సందర్భాలలో ఆయనతో అనుబంధమేర్పరచుకోవడానికి మనకు మనమే స్వంత మార్గాలను ఏర్పరచుకోవాలి.

**గురువుగారు:**

బాబాను వాళ్ళు (బాబా భక్తులు) ఎంతగానో ప్రేమిస్తారు కాబట్టి, నాలాంటివాళ్ళు ఆయనకేసి అలా చూస్తుండటాన్ని ఇష్టపడతారు. ఎప్పుడూ ఆయన (బాబా) ఊసులో, ఆయన ధ్యాసలో గడపడాన్ని ఇష్టపడతారు. అది మినహా వారు మనఃపూర్వకంగా మరేదీ చేయలేరు. ఆయన సాంగత్యాన్ని కాంక్షిస్తారు కాబట్టి వారు తదన్యమైనదేదీ చేయలేరు. వీరికి తమ ప్రేమ – ధ్యానించడం కోసమో, మననం చేసుకోవడానికో లేక నామం చేసుకోవడానికో – ఇలా ఏదో చెయ్యడానికి చేసే ప్రయత్నమో, మార్గమో కాదు. వాళ్ళకు ఇవన్నీ ఓ లక్ష్యాన్ని సాధించడానికి చేసే ఆధ్యాత్మిక సాధనామార్గాలు కావు. వాళ్ళ ప్రేమకు వ్యక్తీకరణలు మాత్రమే. ఆధ్యాత్మికసాధనలన్నీ అలాగే జరగాలి. నా అభిప్రాయమది. ఇంకా మనం బాబా నుండి పొందే ఆ చరమలక్ష్యమైన ఆ పూర్ణత్వం నేరుగా వీటి మీద ఆధారపడి లేదు. 'నువ్వు నాపై నాలుగు గంటలు ధ్యానం చేశావు కాబట్టి నీకు ఆనందాన్ని ఇస్తాను' అని ఉండదు. ప్రత్యక్షంగా దీనికి, దానికి ఎటువంటి

సంబంధంలేదు. ఎందుకంటే వారికది ఏదో పొందడానికి చేసే సాధనం కాదు, బాబా పట్ల వాళ్ళకుగల ప్రేమకు సహజమైన వ్యక్తీకరణ మాత్రమే; తాము స్వీకరించడానికి సిద్ధమైన తక్షణం బాబా ఇస్తారని వారికి తెలుసు.

**గురువుగారు:**

మనలో ప్రేమ ఉన్నంతవరకు ధ్యానం సహజంగా జరుగుతుంది. అప్పుడు ఒక గంటసేపు అలా కూర్చొని బాబాకేసి చూస్తుండటం మాత్రమే కాకుండా రోజులో మనం చేసే ప్రతి పని మన ప్రేమను అభివ్యక్తీకరిస్తుంది. ఆ ప్రేమను వ్యక్తీకరించడానికి చాలా మార్గాలు ఉన్నాయి; ఉన్న మార్గాలలో ధ్యానం కూడా ఒకటి. మనం చేసే ప్రతి పని మనలోని ప్రేమానుభవాన్ని వ్యక్తీకరిస్తున్నప్పుడు ప్రతిదీ ధ్యానంలో భాగమే అవుతుంది.

**గురువుగారు:**

మీరు దృష్టిని బాబాపై కేంద్రీకరించి నిశ్చలంగా ఇరవై నాలుగు గంటలూ కూర్చుని ఉండలేరు కనుక మీకు ఇంకా ఏదో కావాలి. విచలితం చేసే విషయవాసనలు, ఆకర్షణలు చాలా ఉన్నాయి కాబట్టి శరీరానికి కొంత పని అవసరం. క్రమేణా ఈ విషయవాసనలన్నింటిని ఒక క్రమపద్ధతిలోనికి తీసుకొనివచ్చి చివరకు మనం చేసే పనులు బాబాకు సంబంధించి ఉండేటట్లు చేయడమే దీనికి పరిష్కారం. కాబట్టి ఆ పని చేస్తున్నంతసేపు మనం ఆయన గుర్తింపులో ఉంటాం.

ఇంకా ఆయనను స్మరించుకుంటూ, బాబా కోసం చేస్తున్నాం, బాబాకు చేస్తున్నాం అన్న సంతృప్తిని అనుభవిస్తాం. మనస్సు కాస్త కుదుటపడ్డాక మళ్ళీ అలా కూర్చుని వీలైనంతసేపు ఆ ఆనందాన్ని అనుభవిస్తాం. కాసేపటి తరువాత మళ్ళీ మనస్సు చంచలమవడం ప్రారంభమవుతుంది. అప్పుడు మళ్ళీ కొంత పని అవసరమవుతుంది. ఈ విధంగా చేస్తూ పోవడంద్వారా ధ్యానము, నిశ్చలంగా కూర్చునే సమయాలు ఎక్కువవుతూ ఇక ధ్యానం నుండి బయటకు రావాల్సిన అవసరంలేని స్థితికి చేరుకుంటాం. అసలు కదలడమే అవసరం లేనపుడు (ధ్యానంలో) కూర్చున్నా లేక (ధ్యానం నుంచి) లేచినా అది పట్టించుకోవాల్సిన విషయం కాదు, అప్పుడు రెండూ ఒకటే.

కానీ ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే, చాలామంది ధ్యానంలో ఏం చేస్తున్నాం అనే విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు, కానీ వెలుపల ఏం చేస్తున్నాం అనే విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. వాళ్ళే తరువాత, “మేం గత రెండు, ఐదు లేదా పది సంవత్సరాలుగా ధ్యానం చేస్తున్నాం, జపం చేస్తున్నాం, కానీ ఏమీ జరగలేదు” అని అంటారు. దీనికి కారణం ఏమిటంటే వాళ్ళు ధ్యానసమయంలో ఏమి చేస్తున్నారో దాని గురించి మాత్రమే జాగ్రత్త వహిస్తున్నారు. కానీ నేను చెప్తున్నాను... నువ్వు ధ్యానంలో చేసేటటువంటి దానిని నిలబెట్టేది, చెడగొట్టేది, నిర్ణయించేది లేదా మార్చేది మాత్రం నువ్వు ధ్యానానికి వెలుపల ఏంచేస్తున్నావో అది. సాధారణంగా ఎవ్వరూ దానిని గురించి జాగ్రత్త వహించరు. ధ్యానానికి వెలుపల ఏమి చేస్తున్నాం అనే విషయంపై దృష్టిపెడితే, నువ్వు ధ్యానంలో పెద్దగా శ్రమించాల్సిన అవసరమే ఉండదు, ధ్యానం సహజంగా సిద్ధిస్తుంది. ఇంకా ఇంకా బాబాను కేంద్రంగా చేసుకోవడం ద్వారా రోజంతా మీ

నిత్యకృత్యాలను అర్థవంతంగా, సంతృప్తిగా ఉండేలా ప్రయత్నించండి. అలా చేయండి!! అప్పుడు ధ్యానానికి ఎలా కూర్చుంటారో, ఆ అనుభవం ఎలా ఉంటుందో చూడండి!

**భక్తుడు:**

మనం నిజంగా ధ్యానిస్తున్నామా లేక ఊరికే కళ్ళుమూసుకొని కూర్చొని ఉన్నామా అని ఎలా తెలుసుకోవడం?

**గురువుగారు:**

నువ్వు ఫలాన్ని బట్టి చెట్టును నిర్ణయిస్తావు. నువ్వు ధ్యానానికి వెలుపల ఏం చేస్తున్నావో అనే విషయమే నీకు తెలియజేస్తుంది, వేరే పరీక్షలేవీ అవసరంలేదు. నీ ముంజేతిని చూడటానికి నీకు అద్దం అక్కరలేదు. నీ రోజువారీ జీవితంలో ఏం చేస్తున్నావో అనే దానినిబట్టి నీ ధ్యానం ఎంత నాణ్యమైనదో కనిపిస్తుంది.

**గురువుగారు:**

మనం గమ్యాన్ని చేరుకునేంతవరకు ధ్యానం చేయడం, ప్రపంచంలో పనిచేయడం రెండూ సాధనే అవుతాయి. ధ్యానాన్ని మీరు కళ్ళు మూసుకుని కూర్చునే సమయం వరకే పరిమితం చెయ్యకండి, ఎందుకంటే అది మీ జీవితంలో ఓ భాగం మాత్రమే. జీవితమంటే అది మాత్రమే కాదు. ధ్యానాన్ని మీ జీవితంలో ఒక భాగం చేసుకోవడమే కాకుండా మీ జీవితం మొత్తాన్ని మీ ధ్యానంలో భాగం చేసుకోండి. అది ఎలా? బాబా "నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు. అది

నీకు సాధ్యపడకపోతే, (ఇక్కడ నీవు) రోజూ చూసే నా ఈ రూపాన్ని ధ్యానించు" అని అన్నారు. ఆయన తొలి ప్రాధాన్యత మాత్రం జీవితపు మధురిమ, జీవితసారము అయిన ఆనందమే. ఏదైనా విషయాన్ని మీరు ఆస్వాదిస్తున్నప్పుడు ధ్యానలక్షణాలన్నీ సంప్రాప్తమవుతాయి. మంచి రుచికరమైన పదార్థాలను రుచి చూస్తున్నప్పుడు మన కళ్ళు ఎందుకు మూతపడతాయి? ఎందుకంటే మనం దానిని సంపూర్ణంగా సంతృప్తిగా ఆస్వాదిస్తున్నాం, మనం సంతోషంగా ఉన్నాం. నేను మిమ్మల్ని జీవితం యొక్క రుచిని ఆస్వాదించమని అడుగుతున్నాను. జీవితపు మాధుర్యాన్ని రుచిచూడటం ద్వారా కలిగే ఆనందాస్వాదనమే ధ్యానం. అదీ నిజమైన ధ్యానం.



శిరిడీ, 2006



# అసమానమైన సాయి మహిమ

**గురువుగారు:**

అందరూ బాబాను అద్భుతలీలలు చేసే వ్యక్తిగా భావిస్తారు. కానీ ఆయన ఎన్నడూ దేనినీ సృష్టించలేదు (ఇంద్రజాలం చేయలేదు). అటువంటి వాటిని బాబా 'చమత్కారాలు' అన్నారు. "నేను చమత్కారాలు చేయను" అని బాబా నిర్దిష్టంగా చెప్పారు.

**భక్తుడు:**

మరి ఈ మానవాతీత చర్యలను ఆయన ఏమని పిలిచేవారు?

**గురువుగారు:**

ఆయనకు (బాబాకు) సంబంధించినంతవరకు, అది తల్లి తన బిడ్డలను సంరక్షించడంలాంటిది. మీరు వాటిని మహిమలని పిలుస్తామంటే ఫరవాలేదు. బిడ్డకు ఆకలివేసిన వెంటనే తల్లి ఎదనుండి పాలు వస్తాయి. అది ఒక అద్భుతం కాదా!? బిడ్డకు పాలు అవసరమైనంత

వరకు స్రవించి అవసరం (ఆకలి) తీరిన మరుక్షణం వాటంతటవే తగ్గిపోతాయి. ప్రతి తల్లి చేసే అద్భుతమే ఇది. ప్రతి బిడ్డ పొందే అనుభవమే ఇది. అయినప్పటికీ ఇది చాలా సహజం. వీటి (మహిమల) పట్ల బాబా అనుభవం కూడా ఇలాగే ఉంటుంది, చాలా సహజంగా.

**భక్తుడు:**

కానీ వీటితో మన అనుభవం అలా ఉండదుకదా!

**గురువుగారు:**

అందుకే దానిని అద్భుతమంటున్నారు. నేను దానిని సహజసిద్ధమైన మాతృసంరక్షణ అంటాను. అనురాగమయి అయిన తల్లిలా ఆయన (బాబా) మన గురించి జాగ్రత్త తీసుకుంటున్నారు. మీరు మహిమ అని పిలిచేది సాయిబాబా వంటి సద్గురువులకు స్వాభావికమైన తల్లి సంరక్షణ వంటిది.

**భక్తుడు:**

బాబా జీవితంలో మనం చాలా అద్భుతాలు చూస్తాం. వాటికి ఆయా వ్యక్తుల అవసరాలు తీర్చడమే కాకుండా మరేదైనా ఉద్దేశ్యం ఉందా?

**గురువుగారు:**

దాదాపు బాబా చేసిన ప్రతి లీల, ఆ అనుభవం పొందిన వ్యక్తిలో పరివర్తనకు దారితీసేటటువంటి ప్రభావశీలతను కలిగివుంటుంది. ఇతర మహాత్ములలో ఇది చాలా అరుదు. బాబా దగ్గర జరిగిన మహిమలు లేదా మానవాతీతమని పిలువబడేటటువంటి చర్యలు ఓ పరివర్తనను తీసుకొచ్చే బోధను కలిగివుండేవి. దీనిని కొంతవరకు బాబా జీవితచరిత్రలో చూడవచ్చు. బాబా వద్ద అద్భుతలీలలను

అనుభవించిన ఆ భక్తులలో ఎవరో ఒకరి స్థానంలో అలా మిమ్మల్ని ఊహించుకొని చూస్తే, మీరు కూడా దానిని గమనించవచ్చు. ఈ విధంగా బాబా జీవితచరిత్రంతా ఆయన ప్రబోధం. నిజానికి ఆయన ముఖతా వెలువడిన ప్రత్యేకమైన బోధంటూ ఏమీలేదు. బాబా తమ చర్యల ద్వారా బోధించారు. ఇక 'చమత్కారాల' విషయానికి వస్తే అవి అనుభవించే వ్యక్తి మనస్సును దిగ్భ్రమకు గురిచేస్తాయి. కానీ బాబా వద్ద జరిగే ఆ అద్భుతలీలలు ప్రబోధాత్మకంగా ఉండేవి. ఉదాహరణకు బాబా దగ్గరకు ఎవరైనా ధనం కోసం వస్తే, వారికి ఊరికే అలా ఇచ్చేయడమో, 'ఫలానా చోటకు వెళ్ళు. అక్కడ ధనం దొరుకుతుంది' అని చెప్పడమో లేక ఎవరో ఒకరు వచ్చి వారి చేతిలో డబ్బులు పెట్టడమో లాంటివి జరగవు. ఆ ఏర్పాటు చాలా సహజంగా జరిగితే ఎలా ఉంటుందో అలా చేస్తారు బాబా. కానీ అనుభవం పొందే వ్యక్తికి అంతకుమించినదేదో ఉందని తెలుస్తూ ఉంటుంది.

ఉదాహరణకు, బొంబాయిలో ఒక కాటన్ మిల్లులో పెద్ద మేనేజర్‌గా పనిచేస్తూ క్రమం తప్పకుండా శిరిడీ వచ్చే ఓ భక్తుడున్నాడు. ఒకానొక సందర్భంలో అతనికి యాజమాన్యంతో విభేదాలు తలెత్తి తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి నిరుద్యోగిగా ఉన్నాడు. ఇలా సుమారు ఓ సంవత్సరం గడిచింది. ఆర్థికసమస్యలు చుట్టుముట్టి అతని జీవనం కష్టసాధ్యమయింది. అతను ఒకరోజు, "నేను సమయాన్ని వృథా చేస్తూ బొంబాయిలో ఏం చేస్తున్నాను? కనీసం శిరిడీకన్నా వెళ్ళి మళ్ళీ ఏదైనా ఉద్యోగం వచ్చేదాకా బాబా సన్నిధిలో రెండుమూడు నెలలు ఉందాం" అని నిశ్చయించుకున్నాడు.

దుర్భరమైన పేదరికాన్ని అనుభవిస్తున్నటువంటి ఆ సమయంలో అతను శిరిడీకి వచ్చాడు. అతను మసీదులోకి అడుగుపెడుతూ

ఉండగానే బాబా, "ఆవో, సేఠ్, ఆవో" (ధనవంతులను సేఠ్ అంటారు), అని ఆహ్వానించారు. ఆ పిలుపుకి ఆ వ్యక్తి కించపడ్డాడు. తనలో తాను, "నన్ను ఓ సేఠ్ (ధనవంతుడా) అని పిలిచి, బాబా కూడా నా పేదరికాన్ని అవహేళన చేస్తున్నారు. ఇప్పుడు నేను సేఠ్‌ను కాదు" అనుకుంటూ వెళ్ళి మసీదులో కూర్చున్నాడు.

బాబా అతనిని "నీ కార్యక్రమం ఏమిటి" అని అడిగారు. (గురువుగారు నవ్వుతూ...)

దానికి అతను "బాబా! నేను ఇక్కడ రెండు, మూడు నెలలు ఉండాలనుకుంటున్నాను" అని చెప్పాడు.

"లేదు, బొంబాయికి వెళ్ళు" అని చెప్పి "తక్షణం బొంబాయికి బయలుదేరు" అన్నారు బాబా.

ఆ వ్యక్తి దిగ్భ్రాంతికి లోనయ్యాడు. "నేను ఇప్పుడే వచ్చాను, అంతలోనే బాబా నన్ను వెళ్ళిపొమ్మంటున్నారు! బాబా కూడా డబ్బున్న వాళ్ళనే పట్టించుకుంటారు. నేను పేదవాణ్ణి కాబట్టే బాబా నన్ను ఇక్కడ ఉంచదలచలేదు" అనుకున్నాడు. అప్పుడతను "సరే బాబా, మీ ఆదేశానుసారం నేను వెళతాను" అని చెప్పాడు.

తరువాత అతనికి బాబా ఊదీ ఇస్తూ నిర్దిష్టంగా "పూనా మీదుగా వెళ్ళు!!" అని చెప్పారు. సామాన్యంగా ఎవరూ బొంబాయికి పూనా మీదుగా వెళ్ళరు. అది హాస్యాస్పదంగా ఉంటుంది. ఎందుకంటే అది పూర్తిగా విరుద్ధమైన మార్గం. కానీ బాబా "ఈ మార్గంలో బొంబాయికి వెళ్ళు" అని చెప్పారు.

అలా ఆ వ్యక్తి పూనా వెళ్ళాడు. రైలు దిగీదిగగానే అతనికి ఒక కాటన్‌మిల్లుకు యజమాని అయినటువంటి ఒక వ్యక్తి తారసపడి ఇతనితో, 'నేను ఇప్పుడే నీ గురించి ఆలోచిస్తున్నాను' అని చెబుతాడు.

అతని మిల్లులో ఓ నెలరోజుల నుండి మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ ఉద్యోగానికి సరైన వ్యక్తి ఎవరా అని ఆలోచిస్తూ ఉన్నాడు. మిల్లు యజమానికి ఈ వ్యక్తి ముందే తెలుసు. ఇతనైతే ఆ ఉద్యోగానికి సరిపోతాడు అనుకుంటాడు. కానీ మిల్లు యజమాని దగ్గర ఇతని చిరునామాగానీ ఇతరత్రా వివరాలు ఏవీ లేకపోవడంతో అతనిని సంప్రదించడం ఎలాగో తెలియక ఊరుకుంటాడు. కానీ అంత రద్దీగా ఉన్న రైల్వేస్టేషన్‌లో, ఇతను దిగిన తక్షణం ఆ మిల్లు యజమాని సరిగ్గా అక్కడ ఉండటం, అప్పుడే అతనిని చూడటం జరిగాయి.

"నేను మీకోసమే చూస్తున్నాను! మీరు ఇప్పుడేం చేస్తున్నారు?"

"నేను ప్రస్తుతం ఖాళీగా ఉన్నాను".

"అయితే మా మిల్లులో పనిచేయడానికి అంగీకరిస్తారా?"

"తప్పకుండా. సంతోషంగా".

"సరే! మీరు రేపు బొంబాయికి రండి, నేనప్పటికి బొంబాయికి చేరుకుంటాను".

తరువాత ఇతను బొంబాయికి వెళ్ళి, ఉద్యోగంలో చేరాడు. నిజానికి అతను (బాబా అన్నట్లు) సేఠ్ అయ్యాడు.

ఇదంతా ఒక్క వారంలో జరిగిపోయింది. మీరు ఇదంతా కేవలం యాదృచ్ఛికమనుకుంటున్నారా? బాబా అతనికి ఊరికే "ఇంటికి వెళ్ళు!" అని చెప్పివుండి, ఇతను కాటన్‌మిల్లు యజమానిని బొంబాయిలో కలుసుకొని ఉంటే అది వేరే సంగతి అయివుండేది. కానీ బాబా ఉద్దేశ్యపూర్వకంగా "పూనా మీదుగా వెళ్ళు!" అని చెప్పారు. వీరిద్దరూ రైల్వేస్టేషన్‌లో కలవడం జరిగింది. అక్కడ ఆ వందలమంది మధ్యన క్షణకాలంలో ఒకరినొకరు తప్పిపోవడానికి అవకాశం ఉన్నప్పటికీ, అంతా పథకం ప్రకారం జరిగినట్లుగా ఖచ్చితంగా ఇతను దిగిన

బోగీకి ఎదురుగానే ఆ మిల్లు యజమాని ఉన్నాడు. ఆ భక్తుడు ఎలా అనుభూతి చెంది ఉండవచ్చో ఆలోచించండి. కేవలం సాయిబాబా తనకు ఉద్యోగమిచ్చారు అనే అనుభవంతోపాటు ఈ మొత్తం విషయం ఎంత అద్భుతంగా రూపుదిద్దుకుందో అనే అనుభవాన్ని కూడా పొందుతాడు.

**గురువుగారు:**

సాయిలీలలు ఎక్కడా ఆకాశం నుండి ఊడిపడే అద్భుతాలుగా జరగవు. మన చుట్టూ ఉన్న వ్యక్తుల ద్వారానే ఆయన యొక్క దయ, కరుణ, రక్షణ, అత్యంత సహజంగా అందుతుంది. 'బాబా! డబ్బు అవసరం చాలా ఉంది, చాలా కష్టాలలో ఉన్నాను!' అని బాబాకు చెప్పుకున్నాము. బాబాకు నైవేద్యం పెట్టి నిద్రపోయి లేచేలోపున– బాబా దిండు క్రింద లక్షరూపాయలేమీ ఉంచరు. ఆ సమయానికి ఎవరో వచ్చి 'ఈ రకంగా చేస్తే మీ సమస్య పరిష్కారం అవుతుంది' అని చెబుతారు. మనం ఆ విధంగా చేస్తే అన్నీ కలసివచ్చి, పరిస్థితులు అనుకూలంగా మారి, అవసరం తీరుతుంది. బాబా అలా చేస్తారు తప్పితే ఇంద్రజాల, మహేంద్రజాల టక్కుటమార విద్యలేవీ ప్రదర్శించరు. ఇదే బాబా లీలలోని ప్రత్యేకత. బాబా అనుగ్రహం, రక్షణ ఆకాశం నుండి ఊడిపడడమంటూ ఏమీ ఉండదు. ఏం జరిగినా – అది తోటి వ్యక్తినుండి, సాటి జీవులనుండి, మన చుట్టూ ఉన్న పరిస్థితుల నుండి జరుగుతుంది. ఆయన లీల ఎందుకలా ఉంటుంది అంటే, అన్నింటిలోనూ అందరిలోనూ ఉండేది, మాట్లాడేది బాబా అనే విషయం మనకు గుర్తింపులోకి రావడానికి. ప్రాపంచికమైన

వ్యవహారాలేకాదు ఆధ్యాత్మికమైన సమస్యలైనా అంతే. అందుకే ఆయన “నాకు వారసులెవరూ లేరు. నన్నాశ్రయించినవారికి నా సమాధి నుండే సమాధానమిస్తాను” అని చెప్పారు.

**గురువుగారు:**

మనకి ఆధ్యాత్మిక సమస్య వచ్చింది. ధ్యానంలోనే ఒక సందేహం వచ్చింది. 'బాబా! దీనికి పరిష్కారం ఏమిటి? అని – మనస్ఫూర్తిగా, ఆర్తితో ప్రార్థిస్తే – ఎవరో దారిన పోయే దానయ్య దానికి సమాధానం చెప్పిపోతాడు. ఆ చెప్పి వెళ్ళేవాళ్ళకే మనకు జవాబిస్తున్నట్లు, మనకు మేలు చేస్తున్నట్లు తెలియదు. కానీ మన సమస్య మాత్రం పరిష్కారం అవుతుంది. బాబా దేహంతో ఉన్ననాడు కూడా ఇలానే జరిగేది. ఎవరైనా వచ్చి వేదాలలోనో, ఉపనిషత్తులలోనో ఒక ప్రశ్న వేశారనుకోండి. బాబా స్వయంగా సమాధానం చెప్పేవారు కాదు. ఏ హరికథ జరిగే చోటుకో, ప్రవచనం జరిగే చోటుకో వెళ్ళి వినమని చెప్పేవారు. అతను అక్కడకు వెళ్ళి కూర్చోగానే, బాబాను అడిగిన ప్రశ్నకు సరిగ్గా సమాధానం వచ్చేది! ఆ ప్రవచనం చేసేవాడికి, బాబా ఫలానా మనిషిని ఫలానా ప్రశ్నతో పంపిస్తాడు అనే విషయం ఏమైనా తెలుసా? ఇంకొక తమాషా ఏమిటంటే బయలుదేరినవాడు నేరుగా అక్కడకు వెళ్ళవచ్చు, మధ్యలో టీ త్రాగవచ్చు లేదా మరేదైనా పనిచూసుకుని వెళ్ళవచ్చు. ఎట్లయినా వెళ్ళనీ, ఎప్పుడైనా వెళ్ళనీ వీడు వెళ్ళేటప్పటికి అప్పుడే వీడి ప్రశ్నకు జవాబు మొదలవుతుంది. ఆ టైమ్ కేలిక్యులేషన్ చూడండి!

**గురువుగారు:**

నేను పూండీకి వెళ్ళకముందు వేదశాస్త్రాలనన్నింటినీ విపరీతంగా చదివేవాడిని. వాటిల్లో పుణ్యక్షేత్రాల సందర్శనాన్ని, తీర్థాల మహిమను ఎంతో గొప్పగా వర్ణించేవారు. నాకో సందేహం కలిగింది: మహాత్ములు ఎందుకు క్షేత్రాలను దర్శించేవారు? పరిపూర్ణత్వాన్ని పొంది తమ చరమలక్ష్యాన్ని చేరుకున్న మహాత్ములకు, తీర్థాలకు వెళ్ళవలసిన అవసరమేముంది? పురాణాలలో ఎందరో మహాత్ములు తీర్థాలను, క్షేత్రాలను సందర్శించుకోవడం చూస్తాం. వాళ్ళకు అలా చేయాల్సిన అవసరమేముంది? పవిత్రత వృద్ధిపరచుకోవాల్సిన అవసరం వారికి ఉందా? అంతకుమించిన పవిత్రత ఏముంది? లేక వారి పవిత్రతకు మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరముందా? (గురువుగారు నవ్వుతూ...) ఎందుకని?

నేను ఓ రోజు ఆరుబయలు ప్రదేశంలో ఉన్నప్పుడు దీనిని గురించి వివిధ శ్లోకాలలో, వివిధ పురాణాలలో చెప్పబడిన వివిధ ఉదంతాల గురించి ఆలోచిస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా పెద్దగా గాలి వీచింది. అప్పుడు ఎవరో వేరుశనగకాయలో లేదా మరేదో పొట్లాంకట్టి వాడిపడేసిన బాగా పాతదైన కాగితం ఒకటి అలా ఎగిరి వచ్చి నా ముఖానికి తాకింది. నేను దానిని తీసుకుని విప్పి చూశాను. అది నారదభక్తిసూత్రాలలోని ఒక పేజీ. సరిగ్గా అదే పేజీలో గల సూత్రంలో నారదుణ్ణి ఒకరు, "మహాత్ములు పుణ్యక్షేత్రాలను ఎందుకు దర్శిస్తారు?" అని ప్రశ్నిస్తున్నారు. దానికి నారదుడు, "పుణ్యక్షేత్రాలను మరింత పవిత్రం చేయడానికి మహాత్ములు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు" (గురువుగారు నవ్వుతూ...) అని సమాధానమిస్తాడు. అదీ శ్లోకం!! అప్పుడనుకున్నాను "బాబా తలుచుకుంటే మనం

ఎక్కడున్నా సమాధానం ఇవ్వగలరు" అని. అందుకే మీరు ఎప్పుడైనా "ఏంటి గురువుగారు మీరు దూరంగా వెళ్ళిపోతున్నారు, మేము ఏం చెయ్యాలి" అనంటే, నేను ఎప్పుడూ చెబుతూ ఉంటాను... "చింత వద్దు. బాబా మహిమాన్వితులు, మీకు మీ సమాధానాలు లభిస్తాయి."

**భక్తుడు:**

కొందరు మహాత్ములు చేసిన విధంగా సాయిబాబా తాత్వికమైన ప్రబోధాలు చేయలేదు కదా! చేశారా?

**గురువుగారు:**

లేదు, లేదు. ఆయన నుండి ఎవరూ అటువంటి వాటిని ఆశించలేదు. వాళ్ళు ఆయన దగ్గరకు వెళ్ళిన మరుక్షణం మహిమను చవిచూశారు. తమ అసహాయత ఎఱుకలోకి వచ్చి ఆయన సహాయం అర్థించి దానిని పొందారు. ఆ సహాయం పొందే క్రమంలో వారికి బోధ కూడా అందేది. కాబట్టి మీరు చూసే ప్రతి లీల, ప్రతి సంఘటన, ప్రతి మహిమ, మీరు చదివే ప్రతి అనుభవం ఓ సందేశాన్ని తెలియజేస్తుంది. కొంతమంది ఇతర మహాత్ములు అదే సందేశాన్ని వాచా బోధించారు. (బాబా సాన్నిధ్యంలో) పూర్ణమైన సంతృప్తిని పొందడం వలన బాబా వాచా బోధించలేదని ఎవరూ కొరతగా భావించలేదు. దాని (బోధ) కోసం కొరత లేదు. మన అసహాయతను తొలగించుకుని ఆ ఆనందానుభూతిని పొందడానికి బోధ అవసరమవుతుంది. కానీ బాబా సన్నిధిలో ఆనందానుభవం దానంతటదే అనుభవమైనపుడు మిగతావాటి అవసరమేముంది?



శిరిడీ, 2006



# ప్రేమ – భక్తి

**గురువుగారు:**

ప్రేమ వలన ఆనందం కలుగుతుంది. మీకు ఒక ప్రీతికరమైన ధ్యేయం ఉన్నప్పుడు ఆ ప్రీతికరమైన ధ్యేయం గురించి చింతన చేయడం మీకు ప్రేమానుభవాన్ని కలిగిస్తుంది. ఒకవేళ నేను మిమ్మల్ని ఏదైనా చెయ్యమని చెప్పాల్సి వస్తే, ఇదే చెప్తాను: మీరు ఎప్పుడైనా ఆ ప్రేమానుభవాన్ని పొందలేకపోతున్నట్లయితే, ఆ అనుభవాన్ని తిరిగి పొందడానికి, ఇంకా బలీయం చేసుకోవడానికి గల ఏకైక మార్గం ఆ ప్రేమను వ్యక్తపరచడమే. మీరు దానిని ఎంతగా వ్యక్తీకరిస్తారో అది అంతగా పెరుగుతుంది, మరింత దృఢమవుతుంది.

కొంతమంది "నేను బాబా మీద మనస్సును కేంద్రీకరించి అలా కూర్చునే ఉండాలి" అని అనుకొంటూ ఉంటారు. ఎంతసేపని కేంద్రీకరిస్తూ, కేంద్రీకరిస్తూ, కేంద్రీకరిస్తూ అలా కూర్చోగలుగుతారు? ఆ కేంద్రీకరిస్తూ ఉండటం దాని కేంద్రీకరణను కోల్పోతున్నది. కాబట్టి

అందుకోసం మన మనస్సును (బాబా మీద) కేంద్రీకరించడానికి దోహదం చేసే ఇతరమార్గాలు మనం కనుగొనాలి. వీటికోసం అందరూ అన్నివేళలా అన్వేషిస్తూనే ఉన్నారు. కొందరు పూలు తీసుకొస్తారు, కొందరు పండ్లు తీసుకొస్తారు, మరికొందరు పూజ చేస్తారు లేదా నామం చేస్తారు– ఇవన్నీ ఏమిటి? పూలమీదనో, పండ్ల మీదనో దృష్టిని కేంద్రీకరించడానికి ఇలా చేస్తున్నారా? (నవ్వులు...) కాదు, ఇతర విషయాలపట్ల ఆకర్షణను తగ్గించుకుని మనకు ప్రియమైన లక్ష్యాన్ని కేంద్రంగా చేసుకుంటూ దానిపట్ల మన దృష్టిని దృఢతరం చేసుకోవడానికి అలా చేస్తాము. మన మనస్సులు చాలా క్రియాశీలతగలవి కాబట్టి మనకింకా వివిధ ఆకర్షణలున్నాయి కాబట్టి ఇవన్నీ అవసరమవుతున్నాయి.

అందువల్ల మనలోని ప్రేమకు నిజమైన వ్యక్తీకరణలేవో స్పష్టంగా తెలుసుకుని, అటువంటి పనులను ఎన్నుకుని మనస్ఫూర్తిగా చేసినపుడు మన పనులు ప్రేమకు నిజమైన వ్యక్తీకరణలవడంతో పాటు ఆ ప్రేమ మనకు అనుభవమవుతుంది. మనం ఆ ప్రేమను ఎంతగా వ్యక్తం చేస్తామో అది అంతగా పెరిగి, మరింతగా మనకు అనుభవమవుతుంది. ఇది మన లక్ష్యంపట్ల దృష్టిని దృఢతరం చేసుకునే పద్ధతి. మన పాత అలవాట్ల సరళి వల్ల మనలో కొన్ని ఆటంకాలు ఏర్పడి ఉంటాయి, ఇవి మనం దారి మళ్ళడానికి దోహదం చేస్తాయి. ఈ అవరోధాలను నిరోధించడానికి నీ ప్రేమను ఇంకా ఇంకా వ్యక్తం చేయడం ఒక్కటే మార్గం. ఒకవేళ నీ ప్రేమ బలహీనంగా ఉంటే దానిని వ్యక్తం చేయకపోతే అది క్రమంగా వసివాడిపోతుంది. అక్కడ ప్రేమానుభూతి ఉంటేవుండవచ్చు. కాని అది గాఢంగా ఉండదు, చాలా బలహీనంగా పేలవంగా ఉంటుంది. అందుకే

ఎవరైనా వచ్చి ప్రేమను అనుభూతి చెందలేకపోతున్నామని ఫిర్యాదు చేసినపుడు నేను "ఆ ప్రేమను వ్యక్తం చేయండి" అంటాను. వాస్తవానికి ఇటువంటి వ్యక్తీకరణలే నిజమైన ఆచారాలు. కొన్ని సందర్భాలలో ఇవి తంతుల మాదిరిగా ఉన్నట్లు కనిపించినా, అవి మన ప్రేమను వ్యక్తీకరిస్తుంటే మాత్రం అవి కేవలం తంతులు కావు. మనలోని ప్రేమను వ్యక్తం చేస్తున్నంతవరకు ఏ ఆచారవిధులైనా మంచిదే. మనలోని ప్రేమను వ్యక్తం చేయనటువంటి చర్యలు, అవి ఆచార విధులైనా, కాకపోయినా వాటిని తిరస్కరించవలసిందే. ఎందుకంటే మనకు కావాల్సింది ప్రేమ, ఆ ప్రేమను వ్యక్తపరచడం.

మీలో కొంతమందికి "వ్యక్తంచేసే కొద్దీ ప్రేమ పెరుగుతుంది" అనే మాట వింతగా అనిపిస్తుంది. వ్యక్తం చేసే కొద్దీ ప్రేమ ఎలా దృఢమవుతుంది? మీరెప్పుడైనా దీని గురించి ఆలోచించి చూశారా? అందులోనూ ఇది ఎంతో మానవ సహజమైనది, ప్రతి ఒక్కరూ చేస్తూనే ఉంటారు. ఈ పద్ధతి మనందరికీ స్వతఃసిద్ధంగా తెలుసు. ఇక్కడ నేను చెబుతున్నది ఆకాశం నుండి ఊడిపడిన ఏదో క్రొత్త పద్ధతి కాదు. ఉదాహరణకు, తండ్రి ఆఫీసుకు వెళతాడు. తిరిగి ఇంటికి వచ్చి తన చిన్న బిడ్డను చూస్తాడు. అతను తన బిడ్డను చాలా ప్రేమిస్తాడు. కానీ రోజంతా దూరంగా ఆఫీసులో ఉన్నాడు. అతను ఎందుకోసం పనిచేస్తున్నాడు? ఆ బిడ్డను పోషించడం కోసమే; అది వేరే సంగతి. అతను ఇంటికి వచ్చీ రాగానే ఏం చేస్తాడు? ఆ బిడ్డను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని తనతో తీసుకుని వచ్చిన ఒక బొమ్మనో లేదా డ్రస్సునో ఇస్తాడు. దేని ప్రోద్బలంతో ఇలా చేశాడు? ఎందుకు ఆ బిడ్డను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు? ఎందుకంటే అతను అంతగా ఆ బిడ్డను ప్రేమిస్తున్నాడు కాబట్టి. అంతే! మన లోపల

ప్రేమ ఉంది. దానిని వ్యక్తం చేయవలసిన అవసరం ఉందా అంటే, తప్పకుండా ఉంది. ఎందుకంటే వ్యక్తీకరించకపోతే అది క్రమంగా బలహీనపడి వాడిపోతుంది. అది బలహీనమైనప్పటికీ మనలో ప్రేమంటూ ఉంటే, మన వ్యక్తీకరణ దానికి ప్రేరణ కలిగిస్తుంది. చూడండి– బిడ్డకు నువ్వు ఒక్క ముద్దుపెట్టాలనుకుంటావు. కానీ ఆ ముద్దుపెట్టిన క్షణంలో నీలో ఏదో ఉప్పొంగుతుంది. రెండు, మూడు, నాలుగు, అయిదు ముద్దులైనా, చివరికి ఆ పసిపాప ముద్దులతో ఉక్కిరిబిక్కిరయ్యేదాకా ముద్దులు పెట్టడం నువ్వు ఆపలేవు. ఇంకా ఇంకా వ్యక్తీకరణను కోరుకోవడం ప్రేమ యొక్క స్వభావం – ఇవన్నీ ఆచారాలు (పూజావిధులు) కావా?

ప్రతి రోజూ తండ్రి ఆఫీసు నుండి ఇంటికి రాగానే ఈ పూజావిధిని నిర్వర్తిస్తాడు. ఇంకా తల్లి ఉదయాన్నే స్నానం చేయించి అందమైన బట్టలు తొడిగి తలలో పూలు సింగారిస్తుంది. సాధారణంగా అంత చిన్న వయస్సులో పిల్లలకు దుస్తులను గురించి స్పృహ ఉండదు. చిరిగి పోయిన బట్టలువేసినా, ఖరీదైన బట్టలు వేసినా ఆ పాపకు రెండూ ఒకటే. తను పట్టించుకోదు. కానీ ఏ తల్లైనా "పాపకు తేడాలేవీ తెలియదు కాబట్టి నేను చిరిగిపోయిన బట్టలే వేస్తాను" అని ఆలోచిస్తుందా? ఏ తల్లైనా అలా అనుకుంటుందా? అయినా మనం ఆ పాపకు అందమైన బట్టలే ఎందుకు వేస్తాం? మళ్ళీ అది కూడా మన ప్రేమకు చిహ్నమే. ఆ పాపకు అవసరమై కాదు. నువ్వే ఆమెను అందమైన బట్టలలో, సరిక్రొత్త అలంకరణలతో, వివిధ రకాల జడలతో ఫోటోలు తీసి, ఆల్బమ్‌గా భద్రపరచుకొని చూసుకోవాలనుకుంటున్నావు. ఇవన్నీ ప్రేమను ప్రకటించే పూజావిధులు కావా? పూజలో "అభిషేకం సమర్పయామి, వస్త్రం సమర్పయామి, నైవేద్యం సమర్పయామి" అని

చెబుతావు. ఇక్కడ నువ్వు కూడా బిడ్డకు స్నానం చేయిస్తావు, బట్టలు తొడుగుతావు, ఆహారం పెడతావు. అక్కడ పూజలో చివరగా నీవు "ధ్యానం కరిష్యే" అని కాసేపు అలా కూర్చుంటావు. ఇక్కడ నువ్వు అలా కూర్చొని ఆ బిడ్డతో ఆడుకోవడాన్ని ఆనందిస్తావు. ఏ రోజైనా నువ్వు ఇలా చెయ్యలేకపోతే, "అయ్యో, ఈ రోజు నేను పాపతో గడపలేకపోయానే, కనీసం ఓ ఐదునిమిషాలైనా దగ్గర కూర్చుంటాను, లేకపోతే ఆమె చాలా బాధపడుతుంది" అని అనుకుంటావు. కానీ ఆమెతో సమయం గడపాలనుకునేది నువ్వు కాబట్టి, వాస్తవానికి అలా గడపకపోతే నువ్వే బాధపడతావు. ఇది పూజావిధానం కాదా?

కాబట్టి ఇవన్నీ మనం ప్రేమను వ్యక్తం చేసే మార్గాలు. కానీ కేవలం ఇవి మాత్రమే మార్గాలు కాదు. ఒక్కొక్కసారి అవసరాన్ని అనుసరించి నూతన పద్ధతి ఆవిష్కృతమవుతుంది. అలా మన ప్రేమను మృదుమధురంగా, మనోహరంగా మిక్కిలి ఆనందపూర్ణంగా ప్రకటం చేసే మార్గాలను, నవ్యమైన వ్యక్తీకరణలను, క్రొత్త పూజా విధానాలను మనం కనుగొంటూనే ఉంటాం. ఎప్పుడూ కూడా నువ్వెంతగా ప్రేమను వ్యక్తం చేస్తావో అది (ప్రేమ) అంతగా పెరుగుతుంది, తిరిగి వ్యక్తం చేస్తావు. దానికి అంతంలేదు. వాస్తవానికి 'అంతం లేదు' అనంటే అదేదో అసంబద్ధమైన మాట కాదు. ఎందుకంటే ప్రేమకు అంతం ఉండాలని ఎవ్వరూ కోరుకోరు. ప్రేమకు కూడా తప్పకుండా అవధులుండాలి అని తలచే మూర్ఖులు ఎవ్వరూ ఉండరు. అలా కాకుండా, అది అనంతమైన, లెక్కకు మించిన వ్యక్తీకరణలతో అంతులేని అనుభూతులతో విరాజిల్లాలి. సద్గురువుచే ప్రేరేపించబడే ఈ ప్రేమ మనం ఎన్నుకునేది కాదు. ఎందుకంటే, ఆ అనుభవం మనకు తృప్తిని, ఆనందాన్ని కలిగిస్తుంది

కాబట్టి, ఆ తృప్తి లేశమాత్రమైనా, దాన్ని మరింతగా దృఢతరం చేసుకోవాలని, మరింతగా మరింతగా మరింతగా అనుభవంలోకి తెచ్చుకోవాలనుకుంటాము. దీనిని మీరు ఆధ్యాత్మికసాధన అనవచ్చు, ఆచారమనవచ్చు లేక అవసరంకావచ్చు. నాకు మాత్రం అది ఎంతో సహజంగా జీవించడం. అది కళాత్మక జీవనశైలి.

దీనికి ఆద్యంతాలు లేవు. నువ్వు ఎదురుచూస్తున్న నిర్వాణం, ముక్తి, స్వేచ్ఛ – అనే ఆ దుఃఖవిమోచనను చేరుకునేది తపస్సు ద్వారానో, కఠినమైన శ్రమతోనో, దుఃఖంతోనో కాదు. ప్రేమ ద్వారా సంపూర్ణానందాన్ని పొందడం నీ లక్ష్యం. ఈ (లక్ష్య) సాధన యొక్క మొట్టమొదలే చిట్టచివర కూడాను. నువ్వు దీనిని (ఆ ప్రేమను) ఆరంభం నుండే అనుభవిస్తావు. ఈ మార్గమే గమ్యం. వాస్తవానికి వేరే గమ్యమంటూ ఏమీలేదు. ప్రతి క్షణం నువ్వు దానిని ఎంతగా అనుభవించగలుగుతున్నావు అనేదే ముఖ్యం. అది పూర్ణంగానా, పరిపూర్ణంగానా, పూర్ణాతిపూర్ణంగానా! ఈ వాక్యం వ్యాకరణబద్ధంగా తప్పుకావచ్చు. కానీ మనం అలానే అనుభూతి చెందుతాం: ప్రతి క్షణం పూర్ణంగా, ప్రతి అడుగూ పూర్ణంగా! కానీ ఎప్పుడూ ఇంకా పరిపూర్ణంగా ఉండాలనిపిస్తుంది. అంతేకాదు, నీవు ఆ అనుభవాన్ని ఇంకా ఇంకా కావాలనుకొంటావు. కాబట్టి అక్కడ దుఃఖంలేదు, మార్గాలు లేవు, గమ్యం లేదు, కేవలం తనకు తానే ఆజ్యమై రగిలే ప్రేమ, పూర్ణత్వాన్ని చేకూర్చే ప్రేమ! మనల్ని పరమానందభరితుల్ని చేసే ఆ ప్రేమానుభవం – అదే ఆరంభం, అదే సాధన, అదే గమ్యం. అది లక్ష్యాన్ని చేరే మార్గంకాదు. అదే గమ్యం – దాని గురించే నేను చెబుతున్నది.

ఒక్కసారి దానిని నువ్వు అనుభవించిన తరువాత, నేను ఎక్కడికి పోతున్నాను? ఏమి చేస్తున్నాను? ఏమైనా పొందుతున్నానా? నేను

ఎంత పురోగమించాను?– ఇటువంటి తనిఖీ వ్యవహారాలుండవు. అవన్నీ అవసరంలేదు. పురోగతి లేదు, పురోగతి పత్రాలూ లేవు. ఏదైనా పురోగతి అంటూ ఉంటే అది ప్రేమను మరిన్ని మార్గాలలో వ్యక్తీకరించడంలో, ఆ ప్రేమను అనుభవించడంలో ఉంటుంది. ఒకవేళ నువ్వు పురోగమించకపోయినా కోల్పోయేది ఏమీలేదు. ఎందుకంటే నువ్వు ఆపాటికే అక్కడకు చేరుకున్నావు. ఇదీ ఇక్కడి మార్గం. ఇదే సాయిపథం!

నేను ఓ లౌకికమైన సాదృశ్యాన్నిస్తాను. నువ్వు మద్రాసుకు పోవాలనుకుంటే బస్టాండుకు వెళ్ళి సరైన బస్సులో ఎక్కుతావు. తరువాత, నువ్వు నిజంగా తెలివిగలవాడివైతే అలా సంతోషంగా నిద్రపోతావు, ఎందుకంటే నువ్వు సరైన బస్సు ఎక్కడంతోనే నీ ప్రయత్నాలన్నీ ముగిసాయి; పర్యవసానంగా నువ్వెక్కిన బస్సు ఇంకా తిరువణ్ణామలైలో ఉన్నప్పటికీ నువ్వు ఒకరకంగా నీ గమ్యస్థానాన్ని చేరుకున్నావు. అది ఎలా? బస్సు మద్రాసు చేరినా నువ్వు అదే బస్సులో ఉంటావు. నేను సరైన బస్సు ఎక్కానా లేక రావాల్సిన చోటుకే వచ్చానా అని ఆందోళనకానీ, అసహనంకానీ అవసరం ఉండదు.

ఇక్కడ మార్గమే గమ్యం కాబట్టి ఏదో పొందాలనుకొని మన జీవితాన్ని వృథా చేస్తున్నామా అనే ప్రశ్నే తలెత్తదు. నువ్వు దానిని (ఆ ప్రేమానుభవాన్ని) పొందకపోతే 'ఇన్నాళ్ళూ నేను పడిన శ్రమంతా, సమయమంతా వృథా అయింది, నేను మళ్ళీ వెనక్కు వెళ్ళి మొదటి నుండి ప్రారంభించాలి' అనుకోవాల్సిన అవసరంలేదు. ఇటువంటి వాటితో ఎటువంటి పనీలేదు. నువ్వు ఈపాటికే ఆ అనుభవం పొందుతూ అక్కడ ఉంటావు, దానిని ఇంకా ఇంకా అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటావు. నీ మొత్తం జీవితం అందులో

భాగమైపోతుంది, ఆ అనుభవంలో అంతర్భాగమైపోతుంది. మన జీవితంలో దానిని ఓ భాగంగా అనుభవించడం కాదు: దానిని అనుభవించడానికి ఒక్క జీవితం సరిపోదు! తన్మయం చేసే ఆ ప్రేమను అనుభవించడానికి ఈ చిన్న జీవితం సరిపోతుందా?

మన జీవితానికి అప్పుడు ఓ విలువ, అర్థం ఉంటుంది. అలా కాకపోతే మన జీవితాలకు అర్థమంటూ ఏముంది? ఎవరైనా చెప్పండి: నువ్వెందుకు జీవిస్తున్నావు? నీకు నిజాయితీ ఉంటే, "నేనింకా చనిపోలేదు కాబట్టి జీవిస్తున్నాను" అని సమాధానం చెబుతావు. ఎందుకంటే అది (జీవితం) మన ఎంపికకాదు కనుక, అంతకన్నా నువ్వేమీ చెయ్యలేవు కనుక. ఇలా నిస్సహాయమైన జీవితం గడపడమనే ఈ ప్రారబ్ధం ఏమిటి?

దానినే బాబా చాలా అద్భుతంగా చెప్పారు. "సద్గురువును తెలుసుకో, లేకపోతే ఎందుకొచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా?" అన్నారు బాబా. భారతదేశంలో పేడతో పిడకలు చేసి వంటచెఱకుగా వాడతారు. ఎవరైనా మరణించినపుడు అంత్యక్రియలలో పిడకలను కుప్పగా పేర్చి వారి దేహాన్ని దానిపై ఉంచి దహనం చేస్తారు. మనం మనకు ప్రియమైన లక్ష్యాన్ని తెలుసుకొని ఆ అనుభవంలోని ప్రేమాస్వాదనకు మన జీవితాన్ని వినియోగించుకోకపోతే మన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, మన ప్రయత్నాలు, మన జీవితం ఇలా సమస్తమూ పిడకలు ఏరుకోవడంలా తయారవుతుంది. అప్పుడు మన జీవితమంతా మరణానికి తయారవడమే అవుతుంది, ఎందుకంటే అంతకన్నా మనం మన జీవితానికి ఏ రకమైన అర్థాన్నీ ఆపాదించుకోలేము. నీవు విసుగుతో, వెలితితో జీవితాన్ని ఆస్వాదించలేకపోతావు. దానికి ఏమైనా అర్థమంటూ ఉంటుందా?

ఎప్పుడైతే నీవు, నీకు ప్రియమైన లక్ష్యాన్ని (సద్గురువును) కనుగొంటావో, ఇక జీవితం ఎంతమాత్రం మరణానికి తయారవడంలా ఉండదు. ఇంకా దానిని (ప్రేమను) అనుభవించడానికి ఒక జీవితం సరిపోదు. అయినా ఇప్పుడు నువ్వెందుకు జీవిస్తున్నట్లు? సద్గురువు యొక్క ప్రేమననుభవించడానికి. అప్పుడు నీ జీవితానికి ఓ అర్థం ఉంది, ఓ కారణం ఉంది. అప్పుడు ప్రతి ఉచ్ఛ్వాసనిశ్వాసం ఓ ప్రేమానుభవం లేక ఆ ప్రేమకు వ్యక్తీకరణగా మారుతుంది. ప్రతి ఉచ్ఛ్వాసంలో ప్రేమను అనుభవిస్తాము. మన ప్రతి నిశ్వాసంలో ప్రేమను వ్యక్తీకరిస్తాము. నువ్వు ఏది అనుభూతి చెందుతావో దానినే వ్యక్తీకరిస్తావు... నువ్వు ఎంత ఎక్కువగా వ్యక్తీకరిస్తావో అంత ఎక్కువ (ప్రేమ) అనుభవం పొందుతావు.



శిరిడీ, 2006



# నిష్ఠ - సబూరి

రాధాబాయి దేశ్‌ముఖ్ అను ఒక ముసలమ్మ ఉండెను. ఆమె ఖాశాబా దేశ్‌ముఖ్‌గారి తల్లి. బాబా ప్రఖ్యాతి విని ఆమె సంగమనేరు గ్రామప్రజలతో కలసి శిరిడీకి వచ్చెను. బాబాను దర్శించి మిక్కిలి తృప్తి చెందెను. ఆమె బాబాను గాఢంగా ప్రేమించెను. బాబాను తన గురువుగా చేసికొని యేదైన ఉపదేశమును పొందవలెనని మనోనిశ్చయము చేసికొనెను. ఆమెకింకేమియు తెలియకుండెను. బాబా ఆమె సంకల్పమును ఆమోదించక తనకు మంత్రోపదేశము చేయనిచో ఉపవాసముండి చచ్చెదనని మనోనిశ్చయము చేసుకొనెను. ఆమె తన బసలోనే ఉండి భోజనము, నీరు మానివేసెను. అట్లు మూడురోజులు గడిచెను. ఆమె పట్టుదలకు నేను (శ్యామా) భయపడి ఆమె పక్షమున బాబాతో ఇట్లంటిని. "దేవా! మీరేమి ప్రారంభించితిరి? నీవనేకమందిని ఇచ్చుటకు ఈడ్చెదవు. ఆ ముదుసలిని నీవెరిగియే

ఉందువు. ఆమె మిక్కిలి పట్టుదల గలది. ఆమె నీపై ఆధారపడివున్నది. ఆమె చచ్చువరకు ఉపవసించ నిశ్చయించుకొని ఉన్నది. నీవు ఆమెను అనుగ్రహించి ఉపదేశమిచ్చునంతవరకు ఆమె తన నిరాహారదీక్షను మానదు. ఆమెకేమైన హాని జరిగినచో ప్రజలు నిన్నే నిందించెదరు. నీవు తగిన ఆదేశమివ్వకపోవుటచే ఆమె చచ్చినదని లోకులనెదరు. కాబట్టి ఆమెను కరుణింపుము, ఆశీర్వదించుము, ఆమెకు తగిన దారిచూపుము!" ఆమె మనోనిశ్చయమును చూచి, బాబా ఆమెను పిలిపించి, ఈ క్రింది విధముగా బోధించెను:

"ఓ తల్లీ! నీవు అనవసరమైన యాతనకేల పాల్పడి చావును కోరుచున్నావు? నీవు నిజముగా నా తల్లివి; నేను నీ బిడ్డను. నాయందు కనికరించి నేను చెప్పునది పూర్తిగా వినుము! నీకు నా వృత్తాంతమును చెప్పెదను. నీవు దానిని బాగా వినినచో నీకది మేలు చేయును. నాకొక గురువుండెను. వారు గొప్ప యోగీశ్వరులు; మిక్కిలి దయార్ద్ర హృదయులు. వారికి చాలాకాలము శుశ్రూష చేసితిని. కాని నా చెవిలో వారే మంత్రమునూదలేదు. నాకు వారిని వదలిపోవ తలంపే లేకుండెను. నేను వారితోనే యుండుటకు, వారి సేవ చేయుటకు, వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గము వారిది. వారు నా తలగొరిగించిరి; నా నుండి రెండు పైసలు దక్షిణయడిగిరి. నేను దానిని వెంటనే వారికి సమర్పించితిని. 'మీ గురువుగారు పూర్ణకాములయినచో వారు మిమ్ములను దక్షిణ యడుగనేల? వారు నిష్కాములని యెట్లనిపించుకొందురు?' అని నీవడుగవచ్చును. దానికి సమాధానము సూటిగా చెప్పగలను. వారు డబ్బును లక్ష్యపెట్టేవారు కారు. ధనముతో వారు చేయునదేమున్నది? వారు కోరిన రెండు కాసులలో ఒకటి నిష్ఠ, రెండవది సంతోష

స్థైర్యములతో కూడిన ఓరిమి! నేను ఈ రెంటినీ వారికర్పించితిని. వారు ప్రసన్నులైరి. .... 'శ్రీసాయి సచ్చరిత్ర' నుండి.

**గురువుగారు:**

బాబా దక్షిణగా అడిగిన రెండు పైసలలో నిష్ఠ ఒకటి. మన మనస్సును లక్ష్యంపై నిలుపుకుని, మనకేం కావాలి? మనం ఎక్కడికి వెళ్తున్నాం? మనం ఏం చేస్తున్నాం? అని మనల్ని మనం ప్రశ్నించుకుంటూ ఆ లక్ష్యం పట్ల శ్రద్ధను కలిగి ఉండటం అని దాని అర్థం. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే, అవి మనకు రుచించినా రుచించక పోయినా, సంతోషదాయకమైనా కాకపోయినా పట్టువదలకుండా స్థిరచిత్తంతో లక్ష్యాన్ని అంటిపెట్టుకోవడమే నిష్ఠ. ఏ యాచకునికైనా ఇది సహజం. వాస్తవానికి నిజమైన యాచకుడు పట్టువదలడు. ఎవరైనా ఇవ్వకపోయినా లేదా అతన్ని తరిమివేసినా అతను వెళ్ళిపోడు. "అయ్యా, ఒక్క రూపాయి, ఒక్క రూపాయి" అని అడుగుతూనే ఉంటాడు తప్ప అతను కదలడు. తన లక్ష్యాన్ని అంటిపెట్టుకునే ఉంటాడు. దానిని పొందడం కోసం వెంటపడుతూనే ఉంటాడు. అతని దగ్గర నిష్ఠను నేర్చుకోండి.

బాబా అడిగిన రెండవ పైసా సబూరి. సబూరి అంటే ఆనందంగా వేచి ఉండటం. అంతేగాని "ఇది మరీ విపరీతం. ఇక నావల్ల కాదు" అని వగచడమో లేదా ఊరికే విసిగిపోయి నిస్పృహ చెందడమో లేక అసహనంతో మధ్యలో వదలివేయడమో కాదు. ఆనందంగా, ప్రేమతో సహనంతో వేచి ఉండటం. అదీ సబూరి.

**గురువుగారు:**

శ్రీసాయి సచ్చరిత్రలో సిద్ధిక్ ఫాల్కే కథ వస్తుంది. అతను హజ్ యాత్ర ముగించుకుని బాబా వద్దకు వస్తాడు. అయితే బాబా అతన్ని కనీసం ద్వారకామాయి లోనికి అడుగుపెట్టడానికి కూడా అనుమతించలేదు. తమను దూరం నుండి మాత్రమే దర్శించుకోవచ్చునని, అతను ద్వారకామాయి లోనికి మాత్రం అడుగుపెట్టనేకూడదని ఆదేశిస్తారు. దాంతో తొమ్మిదినెలల పాటు ఫాల్కే శిరిడీలోనే వేచి ఉంటాడు.

నిజానికి అది ఎంతటి అవమానకరమో కదా? ఒక హాజీ మసీదులోకి అడుగుపెట్టలేకపోవడం – దానిని అతను ఎలా భావించి ఉండాలి? అయినప్పటికీ హాజీ ఫాల్కే తొమ్మిది నెలలపాటు వేచి ఉన్నాడు. అతని ఓరిమి ఎంతటి ఉత్తమమైనదంటే (తత్ఫలితంగా) అటు పిమ్మట అతను బాబాతో కలసి భోజనం చేసేవాడు. చాలా కొద్దిమందికి, కేవలం 9 లేక 10 మందికి మాత్రమే ద్వారకామాయిలో కూర్చుని బాబాతో కలసి భోజనం చెయ్యడానికి అనుమతి ఉండేది. అయినా వారిలో ఒకరిగా ఫాల్కే ఎన్నుకోబడ్డాడు.

అంతకు ముందు ఎంతగానో అగౌరవపరచబడినటువంటి వ్యక్తి (అదే అందరూ అనుకునే అగౌరవం) ఆ తరువాత ఎంతగానో గౌరవించబడినాడు. దానికి కారణం ఏమిటి? అతనికి ఆ గౌరవాన్ని అందించింది ఏమిటి? అతని ఓరిమి, అతని సబూరి. అతని సబూరికి ఆధారభూతమైనది ఏమిటి? అతని ప్రేమ. "నేను కనీసం ద్వారకామాయిలోనికి అడుగు కూడా పెట్టడానికి లేదు, ఇక నేను శిరిడీలో ఉండవలసిన అవసరమేముంది!"... ఇలా అతను ఎప్పుడూ ఆలోచించలేదు. బాబా అతనిని ఎందుకు అలా వేచి ఉండేటట్లు చేస్తున్నారో అతనికి తెలుసు. అతను ఎదురుచూస్తూ, ఎదురుచూస్తూ,

ఎదురుచూస్తూ అక్కడే ఉన్నాడు. చివరికి అతను కోరుకున్న దానిని పొందాడు. అదీ సబూరి అంటే.

**గురువుగారు:**

నిష్ఠకు అర్థం నమ్మకం కాదు. వాస్తవానికి నిష్ఠను 'అచంచలమైన పట్టుదల' అని అనువదించాలి. అచంచలం అని ఎందుకు? ఎందుకంటే నీ ఇష్టాయిష్టాలు నిన్ను చలింపజేస్తుంటాయి కాబట్టి అచంచలం యొక్క భావం న-ఇష్ట (వేరే ఇష్టాలు లేకపోవడం). ప్రతి ఒక్కరికి వారి వారి ఇష్టాయిష్టాలు, వ్యామోహాలు, తమవైన ప్రాధామ్యాలు ఉంటాయి. సంస్కృతంలో ఇష్ట అంటే నీకు నచ్చినది, నువ్వు ఎంచుకునేది. అందుకని న-ఇష్ట అంటే ఇష్టం కానిది - ఎంచుకునేది కాదు, నచ్చినది కాదు. అంటే నీకు ఉన్న అన్ని ఇష్టాల్లో మొట్టమొదటగా ఒక ఇష్టమంటూ (మన ఆరాధ్యదైవం పట్ల ఉన్న ప్రేమ) ఉండాలి. ఉన్నటువంటి అన్ని ఇష్టాల్లో ఒకే దానిని అంటిపెట్టుకుని ఉండటం నిష్ఠ. ఇదే బాబా అడిగిన అచంచల భక్తి. మనకు ప్రీతికరమైన లక్ష్యం పట్ల మన ప్రేమ పెరిగే కొలది మిగతా ఆకర్షణలకన్నా ఆ (లక్ష్యం పట్ల మనకున్న) ఆకర్షణ బలీయమై ప్రేమ అచంచలమవుతుంది. అప్పుడు ఈ ఆకర్షణ క్రమంగా మిగతా ఆకర్షణల నుండి నిన్ను దూరంగా లాగివేస్తుంది. అప్పుడు నీ ప్రేమ అచంచలమై సుస్థిరమవుతుంది. అదీ నిష్ఠ.

**భక్తుడు:**

గురువుగారూ! నిష్ఠ, సబూరి ఉంటే దుఃఖం పట్ల మన భావన

మారుతుందా? లేక అంతర్లీనమైన లక్ష్యం ఉండటం వలన మనకు ఆ బాధ నిజంగానే తక్కువగా ఉంటుందా (అనిపిస్తుందా)?

**గురువుగారు:**

అసలు కష్టానికి, అలా కష్టపడటానికి గల కారణానికి మధ్య గల సంబంధాన్ని నువ్వేలా చూస్తున్నావు అనే దానిపై అది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఎయిర్‌పోర్టులో నీ యజమాని కోసం వేచి ఉండటానికి, నీకు ప్రియమైన వ్యక్తి గురించి వేచి ఉండటానికి గల తేడాను గమనించు. మీ యజమాని వస్తున్నాడు, అతన్ని తీసుకొని రావడానికి నిన్ను ఎయిర్‌పోర్టుకు పంపించారనుకుందాం. నువ్వు గుర్తింపు కార్డు పట్టుకుని వచ్చి అక్కడ నిలుచుని ఉంటావు. అంతలో అనౌన్సర్, 'సాంకేతిక కారణాల వలన విమానం రెండు గంటలు ఆలస్యమవుతుంది' అని చెప్తారు. ఆ రెండు గంటలు నువ్వు ఎంత బాధపడతావో చూడు. వేచి ఉండటం వలన నువ్వు విసుగు, చీకాకులకు గురవుతావు. ఆ రెండుగంటల సమయం ఎప్పుడెప్పుడు అయిపోతుందా అని అసహనంగా ఉంటావు. కానీ అదే నీకు ఇష్టమైన వ్యక్తి వచ్చే విమానం రెండుగంటలు ఆలస్యమైందనుకో, నీవు వేచి ఉండాల్సినప్పటికీ ఆ కష్టం వేరే రకమైనది. అది ఒక రకంగా నీకు సంతోషాన్నే కలిగిస్తుంది. అదే నీ యజమాని విషయంలో, నువ్వు అక్కడ వేచి ఉండకపోతే నువ్వు ఉద్యోగాన్ని పోగొట్టుకోవలసి వస్తుంది. నువ్వు అక్కడ ఉండకపోతే ముందు ముందు దాని పరిణామాలు చాలా ఉంటాయి. కానీ ఇక్కడ ఎటువంటి పర్యవసానాలు ఉండవు. నువ్వు కోల్పోయేదంటూ ఏమీ ఉండదు. విమానం నాలుగు గంటలు ఆలస్యమైనా సరే నువ్వు అక్కడే ఉంటావు. ఎందుకని? ఎందుకంటే విమానం వచ్చిన తరువాత

మన ప్రియమైన వ్యక్తిని మనం చూసినపుడు మనమెంతగా ఎదురు చూశామో అంతగా ఆనందిస్తాం. ఆ రెండుగంటల సమయం ఎదురుచూడటం సబబుగా అనిపిస్తుంది, ఇబ్బంది ఉండదు. అక్కడ నిలబడి ఉండటాన్ని నువ్వు ఆనందిస్తున్నావు కాబట్టి వేచి ఉండటాన్ని కూడా నువ్వు ఆనందిస్తావు.

'నా ప్రియమైన వ్యక్తిని చూడబోతున్నాను' అన్న ఊహే నీకు ఆనందాన్నిస్తుంది. అలా ఎదురుచూడటం కూడా ఎంతో పరవశింపజేస్తుంది. మనం దానిని ఆస్వాదిస్తాం. నిజానికి ఇది వేచి ఉండటం యొక్క లక్షణాన్ని సంపూర్ణంగా మార్చివేస్తుంది. నిజానికి అది వేచి ఉండటంలాగా ఉండదు, అది ఎదురుతెన్నులు చూడటంలా ఉంటుంది. మీకు ఈ రెండింటికీ తేడా తెలుసు కదా! మనకు ప్రియమైన వ్యక్తి కోసం ఎదురుతెన్నులు చూడటం. అదీ నిజమైన సబూరి.

**గురువుగారు:**

న-ఇష్ట అంటే ఇష్టం అనేది లేకపోవడం. అక్కడ "నా ఇష్టం" అంటూ ఉండదు. నీ ఇష్టమంటూ, నీ ఎంపికంటూ ఉండదు. నువ్వు ఎందుకు వచ్చావు అన్న విషయాన్ని అన్ని వేళలా గుర్తుంచుకుని, నీ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎల్లప్పుడూ మనస్సును దానిపై లగ్నం చేయడమే నిష్ఠ. సదా సర్వదా ఆ జాగరూకత, ఆ జాగ్రత్త, ఆ ఏకాగ్రత- అదీ నిష్ఠ.

**గురువుగారు:**

మనకు ప్రియమైన వ్యక్తి ఒకరు రైలులో వస్తున్నారు, అతన్ని కలుసుకోవడానికి రైల్వేస్టేషన్‌లో ఉండాలి అనుకొన్నామనుకోండి. ఆలస్యం కాకుండా ఉండాలని రైలు వచ్చే సమయానికన్నా గంట ముందే మనం స్టేషన్‌కు వచ్చేస్తాం. అతన్ని చూడాలని ఎంతగానో ఎదురుచూస్తూ మనం ఆనందంగా వేచి ఉంటాం – అదీ సబూరి. అలా వేచి ఉన్నప్పుడు, అతన్ని స్వాగతించే క్రమంలో మనం కొన్ని పనులను చేయవలసి ఉంటుంది.

రైలు వచ్చే ప్లాట్‌ఫారమ్ గురించి వాకబు చేయాలి, రైలు వచ్చే సమయం ఏమిటో కనుక్కోవాలి, ఏ బోగీలో ఉన్నారో తెలుసుకుని సరైన ప్రదేశంలో నిలుచుని సావధానంగా ఉండాలి. మనం రైలు వచ్చే వైపుకు ఎంతో ఆతృతగా చూస్తూ వేచి ఉండటం రైలును తొందరగా వచ్చేట్లు చెయ్యదు. కానీ రైలు వచ్చేటప్పటికి మనం తయారుగా ఉంటాం, వచ్చిన వెనువెంటనే ఆ ప్రియమైన వ్యక్తిని చూడగలం. అతన్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉంటాం. సాధన అంటే ఇటువంటి సన్నాహాలే – “ఆనందంగా వేచి ఉండటం” అనే కళ, సంసిద్ధత, గ్రహణశక్తి అనే కళ.

**భక్తుడు:**

శ్రీసాయి సచ్చరిత్రలో ముందుగా బాబా గురువు బాబా తలను క్షవరం చేయించి తరువాత రెండు పైసలు అడిగినట్లు వ్రాసి ఉంది. అంటే బాబా ఆలోచనలన్నీ తొలగిపోయిన తరువాత మాత్రమే ఆయన బాబాను నిష్ఠ, సబూరిలు అడిగారా?

**గురువుగారు:**

తక్కినవన్నీ పోయిన తరువాత మిగిలేవే నిష్ఠ, సబూరి. పరిపూర్ణమైన ప్రేమతో కూడిన శ్రద్ధతో గురువు వద్ద నిరీక్షించడం. అదీ నిష్ఠ, సబూరి.

**భక్తుడు:**

మిగిలేవి అవేనా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును. మిగిలేవి అవే. వాస్తవంగా ఆయన (బాబా) దగ్గర మిగిలిన రెండు పైసలు ఇవే – ఈ రెండూ కూడా దక్షిణగా సమర్పించవలసి వచ్చింది.



శిరిడీ, 1996



# ఆనందస్వరూపం

**భక్తుడు:**

గురువుగారూ! మా అంతరంగంలో ముక్తి కావాలని, జ్ఞానం కావాలని, బాబాను తెలుసుకోవాలనేటటువంటి ఈ కోరికకు, తపనకు అసలు కారణం ఏమిటి? ఇటువంటి తపన ఎక్కడి నుండి వస్తోంది?

**గురువుగారు:**

దీని గురించి చాలాసార్లు వివరించాననుకొంటాను. అలా ఎందుకు జరుగుతుందంటే – నీలో ఏదో కొరత ఉంటుంది, ఏదో కావాలి అనిపిస్తూ ఉంటుంది. అదేంటో నీకు తెలియదు. నువ్వు బాబాను దర్శించినప్పుడు నీవేమి కావాలనుకుంటున్నావో దానికి ఆయన ఒక స్పష్టమైన, సంగ్రహమైన, మూర్తీభవించిన రూపంలా అనిపిస్తారు. నువ్వు దానిని 'ఇదీ' అని వర్ణించలేవు, విడమరచి చెప్పనూ లేవు. అయినప్పటికీ నిగూఢ రీతిలో, స్వతఃసిద్ధంగా, తనంతటతానుగా ఏదో నీకు తెలియజేస్తుంది – "అది ఆయనే" అని. నీలో అస్పష్టంగా

ఉన్న ఆ పరిపూర్ణత్వభావనకు (ఆనందానికి) స్పష్టమైన రూపం ఆయన. నీలో అస్పష్టంగా ఉన్న పరిపూర్ణత్వభావనను బాబా ప్రజ్వరిల్లజేస్తారు. నీదైనటువంటి ఆ పరిపూర్ణత్వభావనకు బాబా ప్రతీక కాబట్టి నువ్వు ఆయన్ని ప్రేమిస్తావు. నీ ఆనందాన్ని నువ్వెలా ప్రేమిస్తావో అలానే బాబాను ప్రేమిస్తావు. ఇంకోరకంగా చెప్పాలంటే బాబా పట్ల నీకుండేటటువంటి ప్రేమ, నీలో అస్పష్టంగా ఉన్న నీ పరిపూర్ణత్వభావన పట్ల నీకు గల ప్రేమే! అదిగాక నీకు బాబాను ప్రేమించడానికి వేరే కారణమంటూ ఏమీ లేదు. అయినా నువ్వు బాబాను ఎందుకు ప్రేమిస్తావు? నీ హృదయంలోని ఆనందానికి బాబా ప్రతిరూపంగా నిలుస్తారు కాబట్టి నువ్వు ఆయనను ప్రేమిస్తావు.

**భక్తుడు:**

గురువుగారూ! మీ వద్దకు ఎంతోమంది వచ్చి సాష్టాంగనమస్కారాలు చేసి మీ ఆశీస్సులు అర్థిస్తారు. వాళ్ళు మీ పాదాలను తాకినపుడు మీరెలా భావిస్తారు?

**గురువుగారు:**

(పెద్దగా నవ్వుతూ...) నాకేమీ అనిపించదు! అసలు వాళ్ళు నాకు నమస్కరిస్తున్నట్లుగా నేను భావించను. ప్రతి ఒక్కరికి వారికే స్వంతమైన ఓ అస్పష్టమైన సంపూర్ణత్వభావన ఉంటుంది. దానిని వాళ్ళు అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలని సర్వదా ప్రయత్నిస్తూ ఉంటారు. ఆ సంపూర్ణత్వభావనకే అందరూ సదా శరణాగతి చెంది ఉంటారు. అంతటా నిండివున్న అది (ఆ భావన) అస్పష్టంగా ఉండటం వలన వారు దానిని స్పష్టంగా అనుభూతి చెందలేరు.

అందువల్ల దాని గురించి తెలుసుకోవాలని, వాస్తవం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ యత్నిస్తుంటారు. కొంతమందికి వారిలోని అస్పష్టమైన సంపూర్ణత్వభావనకు ప్రతీకగా నిలిచే బాబా వంటి సద్గురువును చూసినపుడు వారిలో ఆ సంపూర్ణత్వ భావన జాగృతమవుతుంది. అటువంటి వారు, వారి ఆనందానికి సద్గురువు మార్గం కాబట్టి దానిని అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకునే యత్నంలో భాగంగా వాళ్ళు సద్గురువును తెలుసుకుని ఆయనకు శరణాగతి చెందుతారు. బాహ్యంగా చూస్తే వాళ్ళు సద్గురువుకు శరణాగతి చెందినట్లు కనిపించినా, వాస్తవానికి వాళ్ళు తమ ఆనందానికే శరణాగతి చెంది ఉన్నారు. ఈ మొత్తం క్రమాన్ని, దాని తత్త్వాన్ని అర్థం చేసుకుంటే నాకు నమస్కరించే వారందరూ నిజానికి నా పాదాలు తాకటం లేదని మీరు తెలుసుకుంటారు. వాస్తవానికి తమ పరిపూర్ణత్వస్థితినే వాళ్ళు స్పృశించాలని ప్రయత్నిస్తున్నారు.

ప్రజలు నాకు నమస్కరించినప్పుడు నేనెలా భావిస్తాను అని మీరడిగారు. ఒకవేళ నాకు ఏదైనా అనిపిస్తే అది: “ఆ నమస్కారాలన్నీ నాకు కాదు, బాబాకు” అని అనుకుంటాను. ఎందుకంటే నా పరిపూర్ణత్వ భావనకు, ఆనందానికి సాకార రూపం సాయిబాబా. చాలామందికి తమ పరిపూర్ణత్వభావనను జాగృతం చేయడానికి, సుస్పష్టం చేసుకోవడంలో సహాయపడడానికి ఓ గురువు అవసరం. వారికి గురువు అవసరం కాబట్టి కొంతమంది నన్ను అలా భావించి దానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు. కానీ నాకు సంబంధించినంతవరకు నాకు శిష్యులు కానీ, భక్తులు కానీ అవసరం లేదు. కాబట్టి వారిని నేను ఆ దృష్టితో చూడను.

**భక్తుడు:**

గురువుగారూ! "అస్పష్టము, అవ్యక్తము అయిన దానిని వాస్తవం చేసుకోవడం" అనడంలో మీ ఉద్దేశ్యాన్ని వివరిస్తారా?

**గురువుగారు:**

తప్పకుండా. ఒక లక్షరూపాయలు ఎవరో నీ బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేశారనుకుందాం. కానీ నీ దగ్గర చెక్‌బుక్ లేదు కాబట్టి నువ్వు దానిని తీసుకోలేవు. నిన్ను నువ్వు ధనవంతునిగా భావిస్తావా లేక పేదవానిగానా? నువ్వు ధనవంతుడివే కానీ దానిని వాస్తవం చేసుకోవడానికి, ఆ డబ్బును స్వంతం చేసుకోవడానికి నీకు చెక్‌బుక్ కావాలి. బ్యాంక్‌లో లక్షరూపాయలున్నాయి అనే నిజం అస్పష్టమైన అనుభూతి. వాటిని బ్యాంకు నుండి తీసుకొని చేతిలో పట్టుకోవడం ఉంది చూశారా – అది దానిని అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడం.

**గురువుగారు:**

నేను దాని గురించి ఇంకోసారి చెప్తున్నాను. నువ్వు ఓ గురువుకో, ఓ సద్గురువుకో లేక ఓ బుద్ధునికో శరణాగతి చెందవు. నువ్వు ఎల్లప్పుడూ నీకుండేటటువంటి ఆ సంపూర్ణత్వభావనకే (ఆనందానికి) శరణాగతి చెందుతావు. ప్రతి ఒక్కరూ శరణాగతి చెందుతారు, ఎప్పుడో శరణాగతి చెందే ఉంటారు. చాలామందికి వాళ్ళు దేనికి శరణాగతులో అర్థంకాదు. ఎందుకంటే వాళ్ళకు ఫలానాది తమకు సంతృప్తినిస్తుందనే విషయం ఇంకా చాలా అస్పష్టంగా, అవ్యక్తంగా, ఎంతో అయోమయంగా ఉంటుంది. నీలోని ఆ భావనకు ఆయన

ఒక వాస్తవరూపమైన చిహ్నంగా నిలుస్తారు కాబట్టి నువ్వు బుద్ధుని (సద్గురువు) పాదాలను తాకడం ద్వారా, నీలోని అస్పష్టమైన ఆ సంపూర్ణత్వం పట్ల నీకు గల శరణాగతభావాన్ని నిర్దిష్టంగా ప్రకటిస్తావు. అది ఎలా ఉంటుందంటే: నేను బాబాను చూసినపుడు, "నాలోని ఆ పరిపూర్ణత్వ భావనకు వాస్తవ వ్యక్తరూపం ఆయన" అని అనిపించినట్లుగా.

నీలో అస్పష్టంగా ఉన్న ఆ సంపూర్ణత్వమనే భావనను ఒక స్పష్టమైన రూపంలో చూసినపుడు, దానిని ఇంకా ఇంకా స్పష్టంగా తెలుసుకోవడం సాధ్యమౌతుంది. అది ఐహికమై మరెంతో వాస్తవికతను సంతరించుకుంటుంది. ఇది మనయొక్క పరిణామక్రమం అని తెలుసుకున్నప్పుడు మిగతా సందేహాలు మాయమవుతాయి. నువ్వు నీ జీవితం యొక్క పాదాల దగ్గరే శరణాగతి చెందగలవు, అన్నీ వదిలిపెట్టగలవు. అంతేగానీ వేరొకరి పాదాల దగ్గరకాదు. అందుకనే నేను మీ జీవితాలను వదలిపెట్టమని అడగడం లేదు. తీసుకోండి... మీ జీవితాలను ఆ చివరిదైన పరిపూర్ణత్వాన్ని పొందడానికి ఓ పథంగా చేసుకోండి. అప్పుడు ప్రతిదీ, మీరు తీసుకొనే ప్రతి శ్వాస పరిపూర్ణత్వం కోసం మీరు పడే తపనకు ఊపిరులూదుతుంది.

**గురువుగారు:**

ప్రతి ఒక్కరూ – జీవమున్న ప్రతి ప్రాణీ – ఏదో ఒక దానికోసం, ఒకరకమైన తృప్తి కోసం అన్వేషిస్తోంది; ప్రతి ఒక్కరూ కూడా! ఆధ్యాత్మిక అన్వేషకులు (సాధకులు), ప్రాపంచిక కోరికల కొరకు ప్రయత్నించేవారు అంటూ ఏమీ లేదు. ప్రతి ఒక్కరూ (తృప్తి కోసం)

అన్వేషిస్తూనే ఉన్నారు. కొంతమంది డబ్బు కోసం, కొంతమంది కీర్తి కోసం, కొంతమంది కుటుంబం కోసం, కొంతమంది పిల్లల కోసం, కొంతమంది సుఖం కోసం – ఇలా ప్రయత్నిస్తూ ఉంటారు. అన్వేషణకు (తృప్తికి) మార్గాలు అనేకం. అందరూ వీటిని ఎందుకు ఆశిస్తున్నారు? ఆనందం వాటిల్లో ఉంటుందని వారు భావిస్తారు కనుక. వీటిని పొందడం వలన వాళ్ళకు నిజంగా ఆనందం వస్తుందో లేదో తెలియదు. ఆ పరిపూర్ణత్వభావన వారికి బాగా అస్పష్టంగా ఉంటుంది కాబట్టి వీటిని పొందితే తమకు ఆనందం వస్తుందని అనుకుంటూ ఉంటారు.

నాకు మంచి ఉద్యోగం వస్తే ఆనందం వస్తుంది, స్విస్‌బ్యాంక్‌లో ఒక బిలియన్ డాలర్స్‌గాని ఉంటే అప్పుడు నేను ఆనందం పొందుతాను, లేకపోతే అందమైన అర్ధాంగి ఉంటే నాకు ఆనందం వస్తుందని అతను, నా మాట వినే భర్త దొరికితే నాకు ఆనందం వస్తుందని ఆమె అనుకుంటూ ఉంటారు. (గురువుగారు నవ్వుతూ...) ఇలా ఎన్నో... ప్రతి ఒక్కరికీ తాము దేనికోసమైతే యత్నిస్తున్నారో దానికి సంబంధించిన కొన్ని ఆలోచనలు ఉంటాయి. కానీ కొంతమందికి వీటన్నింటిని పొందినా కూడా – మంచి ఉద్యోగం, మంచి భార్య, ఇల్లు, పిల్లలు, బ్యాంక్ అకౌంట్, కొంచెం పేరుప్రతిష్ఠలు ఇవన్నీ ఉన్నా కూడా వారు ఏదో వెలితిని అనుభవిస్తూ ఉంటారు. "అవును నాకు అన్నీ ఉన్నాయి, లేనిదంటూ ఏమీ లేదు" అంటే, వారు నిజంగానే సంతృప్తిగా ఉన్నారా? వారికి అన్నీ ఉన్నాయా? వారి జీవితంలో ప్రతి క్షణం తన్మయమైన పరిపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తున్నారా? లేకపోతే "మాకు అన్నీ ఉన్నాయి. ఇక చెప్పడానికి, ఆలోచించడానికి ఏముంది" అని ఏదో ఉన్నదానితో సరిపెట్టుకుంటున్నారా? కానీ

కొంతమందికి ఇవన్నీ సరిపోవు. వారు ఇంకా ఏదో కొరతను అనుభవిస్తూ ఉంటారు.

అలా వెలితిని అనుభవించేవారికి ఆ 'వెలితి' అంతుబట్టని విషయం (మిస్టరీ). అది వారి అసంపూర్ణ కథ (మిస్సింగ్ స్టోరీ) (గురువుగారు నవ్వుతూ...) నిజానికి వారికి ఏది ఆ ఆనందాన్ని ఇస్తుందో తెలియదు. అప్పుడు, ఏదో కారణంవల్ల – అది ఎందుకు అనేటటువంటి సిద్ధాంతాలలోనికి నేను వెళ్ళదలుచుకోలేదు – అస్పష్టమైన వారి ఆనందం మూర్తీభవించినటువంటి ఒక వాస్తవమైన వ్యక్తిని చూసినపుడు, ఏ కారణమూ లేకుండానే, వారికి ఆనందం పొందగలము అనిపిస్తుంది.

నా విషయంలో అది సాయిబాబా. ఆయన్ని అలా చూస్తూ ఉంటే నాకు సంతృప్తిగా అనిపించేది. ఆయన నాకేదో ఇచ్చారని కాదు. ఆయనది ఎంతో సుందరమైన రూపం అని కాదు, (గురువుగారు నవ్వుతూ...) ఆయన మంచి వక్తనో లేక మంచి రచయితనో కాదు. ఆయన పండితుడా, జ్ఞానా అని మనకు తెలియదు. కనీసం ఆయన మాట్లాడినప్పుడు మనం వినను కూడా వినలేదు. అయినప్పటికీ ఆయనను చూస్తే ఏదో జరుగుతుంది. ఒక భద్రతాభావం, సంతృప్తి, ఆనందం, ఓ పరిపూర్ణతా భావం కలుగుతుంది – ఏదో అస్పష్టంగా ఉన్నది సుస్పష్టమయినట్లు! "అది ఇదే, ఇదే అది" అనిపిస్తుంది. ఎలా? మనకు తెలియదు. మనలో ఏదో ఆకర్షణ, ఆ ఆకర్షణలతో సమ్మిళితమైన ఓ భద్రతాభావం. ఆయన దగ్గరనుండి మనమేదో భద్రతను పొందామని కాదు. "ఆందోళన చెందవద్దు, నీ సమస్యలన్నీ నాకు తెలుసు, నేను చూసుకుంటాను, నేను చేస్తాను" అని చెప్పి ఆయన మనకేదో వారెంటీ ఇచ్చారని, గ్యారంటీ ఇచ్చారని కాదు.

ఆయనేమీ చెప్పలేదు, మనమేదీ పొందలేదు. అయినప్పటికీ "ఆయన చూసుకుంటారు, నాకేమీ కాదు" అని మనకు భద్రతాభావం కలుగుతుంది.

ఈ అనుభూతి ఏమిటి? అది సినిమా చూసినప్పుడో, అందమైన ప్రకృతిని చూసినప్పుడో కలిగేటటువంటి సంతోషం కాదు. అది దేని గురించీ పట్టింపులేనటువంటి ఆనందం. ఒక రకమైన రక్షణతో కూడిన ఆనందం. నాకేమి జరిగినా ఆయన చూసుకుంటాడు, ఎందుకని?... ఏమో మనకు తెలియదు. (గురువుగారు నవ్వుతూ...) మనకు ఆ అర్హత ఉన్నదనా?... అదీ మనకు తెలియదు. మనకు సహాయం చెయ్యాలని ఆయన ఆత్రంగా ఉన్నారా?... అది కూడా మనకు తెలియదు. కానీ ఆయన తప్పకుండా మనకు సహాయం చేస్తాడని మాత్రం ఖచ్చితంగా తెలుసు. ఒకవేళ మనకు కష్టాలెదురైతే ఎక్కడికెళ్ళాలో మనకు తెలుసు. అలా ఊరికే ఆయన సాన్నిధ్యం, ఆయన రూపావలోకనం, ఆయన గురించిన ఆలోచనే మనకు నమ్మకం పెంపొందిస్తుంది. ఎందుకు?.. ఎలా?.. అని మనకు తెలియదు. ఈ ఆకర్షణకు, సంతృప్తికి, ఆనందానికి, భద్రతాభావానికి, అవ్యాజమైన ఆనందానికి కారణం ఏమిటి?... మనకు ఏ కారణాలూ తెలియవు.

కాబట్టి ఇదీ అంతుపట్టని విషయం (మిస్టరీ). చివరకు ఇవన్నీ ప్రసాదించిన రూపాన్ని ఒక సద్గురువు అని పిలవాలనిపిస్తే, సరే అలాగే ఆయనను ఒక సద్గురువు అని మీరు పిలుచుకోవచ్చు. లేదంటే మీకు ఏ పేరు నచ్చితే ఆ పేరుతో పిలుచుకోవచ్చు. కానీ ఇక్కడ జరిగేది మాత్రం ఇదే. గురువు ద్వారా లభ్యమయ్యే పరిపూర్ణమైన ఆనందమే ఈ అంతుబట్టని అంతరార్థంలో లోపించిన కథ. మీరు

దానికి మరిన్ని సిద్ధాంతాలు జోడించి ఆ అంతరార్థాన్ని ఇంకా నిగూఢపరచదలిస్తే అలాగే కానివ్వండి. లేదా ఖచ్చితంగా "ఇక్కడ ఏం జరుగుతోంది" అనే విషయం మీరు తెలుసుకోదలిస్తే, ఇక్కడ జరుగుతున్నది ఇదే. (గురువుగారు నవ్వుతూ...) అంతకుమించి ఏమీ లేదు, అలా అని అందులోని విలువ తక్కువేమీ కాదు.



శిరిడీ, 2003



# గురువుగారి బాబా

**భక్తుడు:**

గురువుగారూ! మీరు బాబా వద్దకు ఎలా వచ్చారు?

**గురువుగారు:**

నేను బాబా దగ్గరకు 'రావడం' అనంటూ ఏమీ లేదు. ఎప్పుడూ ఆయనను చూస్తూ ఉండటం నాకు ఇష్టంగా ఉండేది. నేనెప్పుడు బాబా ఫోటోను చూసినా, నాకెందుకో ఆయన చాలా సజీవంగా ఉన్నట్లు, నాతో సన్నిహితంగా ఉన్నట్లు, నాకు బదులిస్తున్నట్లు అనిపించేది. అలాగని, ఆయన నాకు ప్రత్యక్షమవడమో లేక సందేశాలివ్వడమో కాదు. అలా కాదు! కానీ ఆయనను ఎప్పుడు చూసినా ఏదో బలమైన ఆకర్షణ కలిగేది. ఆయనకు, నాకు మధ్య ఎంతో సాన్నిహిత్యం ఉన్నట్లు అనిపించేది.

**భక్తుడు:**

గురువుగారూ! మీకు బాబాతో గల మొదటి అనుభవాన్ని మాకు తెలియజేస్తారా?

**గురువుగారు:**

మొదటిది, రెండవది, మూడవది... అంటూ ఏమీ లేదక్కడ. నా అనుభవమేమిటంటే, నేను చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు కూడా బాబాను చూసిన ప్రతిసారీ ఎందుకనో ఆకర్షణకు లోనయ్యేవాడిని. నేను ఆయన వాడిని అనే భావన ఉండేది. దానిని నా మొదటి అనుభవం అంటే అనవచ్చు.

నాకు బాబా అంటే ఎవరో తెలియదు. ఆయన పేరు తెలియదు, ఏం తెలియదు. నా చిన్నతనంలో ఆయన ఫోటో ఒకటి మా ఇంట్లో ఉండేది. మా నాయనమ్మను ఆయనెవరు అని అడిగేవాడిని. అందరు దేవుళ్ళకు, దేవతలకు కిరీటాలు, ఆభరణాలు ఉండేవి. కొందరు మనిషి రూపంలో ఉంటే, కొంతమందికి జంతువుల తలలు ఉండేవి. ఇలా రకరకాలుగా ఉండేవారు. కానీ బాబా, వారందరి కంటే భిన్నంగా కనిపించేవారు. ఆయన ఒక సాధారణ వ్యక్తిలా కనిపించేవారు. అక్కడున్న (పూజాగదిలో) ఆ దేవుళ్ళ కొలువులో ఆయనొక్కరే అలా కనిపించేవారు.

అందుకనే "ఆయన ఎవరు?" అని నేను మా నాయనమ్మను అడిగేవాడిని.

ఆమెకు బాబా గురించి అసలు ఏమీ తెలియదు. ఆమె టీచర్‌గా పనిచేసేది. నాకు తెలియదు అని ఆమె ఎప్పుడూ చెప్పేది కాదు (నవ్వులు). ఎలిమెంటరీ స్కూలు టీచర్లు, పిల్లలకు "నాకు తెలియదు" అని ఎన్నటికీ చెప్పరు!! (గురువుగారు నవ్వుతూ...) అది సాపేక్ష

సిద్ధాంతమైనా, మరే ఇతర ప్రశ్నైనా సరే వారు ఏదో ఒక జవాబు చెప్పి తీరుతారు.

అందువల్ల నేను "సాయిబాబా ఎవరు?" అని అడిగినపుడు, ఆమె "ఆయనో పెద్ద శివభక్తుడు" అని చెప్పింది.

ఆ ఫోటోలో ఓ చిన్న గుర్రం, పర్వతాలో లేక కొండలో ఉండేవి. పాత ఇళ్ళలో చూస్తే ఆ చిత్రపటాలు ఇప్పటికీ కనపడుతూనే ఉంటాయి. "ఆయన ఏమి చేస్తున్నారు?" అని అడిగాను నేను.

"హిమాలయాల్లో తపస్సు చేసుకుంటూ ఉంటారు".

"ఎవరి కోసం ఆయన తపస్సు చేస్తున్నారు?"

ఎందుకనంటే ఆ రోజుల్లో తపస్సు గురించి, మనకు సినిమాల ద్వారానే అవగాహన ఉండేది! (గురువుగారు నవ్వుతూ...) భూకైలాస్ వంటి సినిమాల్లో శివుడు గురించి తపస్సు చేస్తారు. కాబట్టి "ఆయన ఎవరి కోసం తపస్సు చేస్తున్నారు" అని అడిగాను.

"శివుని కోసం!" అని ఆమె ఠక్కున సమాధానం చెప్పింది.

అందువల్ల, 'ఆయన (బాబా) ఓ శివభక్తుడు. హిమాలయాలలో ఉంటాడు' – ఇదీ ఆయన గురించి నాకున్నటువంటి ఊహ. అంతే! మా నాయనమ్మకు ఆయన గురించి ఏమీ తెలియదు. కనీసం ఆయన శిరిడీలో నివసించారని కూడా తెలియదు. నాకూ ఆయన గురించి ఏమీ తెలియదు. కానీ ఎందుకనో నాలో ఏదో ఒక భావన ఉండేది. మా ఇంట్లో పూజగదిలోకి నేను ఎప్పుడు అడుగుపెట్టినా ఆయనను ఇంకా ఇంకా ఇంకా ఎక్కువగా చూస్తుండేవాడిని. ఎందుకనో ఆయన నాకు నచ్చేవారు. ఆయన ఎంతో వాస్తవంగా, మామూలు వ్యక్తిలాగా, సులభంగా చేరువయ్యేవారిలా ఉండేవారు. మిగతా దేవుళ్ళ రూపాలన్నీ నాకు వింతగా అనిపించేవి.

అది నా మొదటి అనుభవం, అవే బాబా గురించి మొదటగా నాకు తెలిసిన వివరాలు కూడా. బాబా గొప్పతనం గురించి, ఆయన మహిమ గురించి నాకెవరో చెప్పబట్టి ఆయన పట్ల నేను ఆకర్షితుణ్ణవడం జరుగలేదు. ఆయన గురించి ఏ వివరాలు తెలియకుండానే నేను ఆయన పట్ల ఆకర్షితుణ్ణయ్యాను. నేను బాబా చరిత్రను చాలాకాలం పాటు చదువలేదు. నేను శిరిడీ వెళ్ళింది కూడా 1977లోనే. సద్గురువు గురించిగానీ లేదా నాకు సహాయపడగలిగేవారు ఎవరా అనిగానీ, నాకోసం ఏదైనా చేసేవాళ్ళుగానీ, ప్రేమతో ఆప్యాయతతో నన్ను అర్థం చేసుకునేవాళ్ళుగానీ, పసిబిడ్డ ఏమైనా అడిగితే తల్లీతండ్రిలా ప్రతిస్పందించి సమకూర్చేవాళ్ళుగానీ ఎవరా అని ఆలోచించినపుడు నాకు బాబా రూపమే తట్టేది.

నేను ఇతరత్రా ఆలోచించలేకపోయేవాడిని. ఏ సాంప్రదాయాలు, భక్తి, దేవుళ్ళు, దేవతలు, దేవాలయాలూ... ఇటువంటి వాటికి సంబంధించిన ఎటువంటి ప్రభావాలూ నా మీద ఉండేవి కావు. ఇటువంటి వాటి ప్రభావాలు నా మీద లేకపోవడం నా అదృష్టం. (గురువుగారు నవ్వుతూ...) నా మనస్సు పరిశుభ్రమైన తెల్లని కాగితంలా ఉండేది. అందుకని కేవలం బాబా రూపం మాత్రమే దాని మీద పడింది.

**భక్తుడు:**

బాబా మీ సద్గురువు అని ఎప్పుడు గుర్తించారు?

**గురువుగారు:**

నేను బాబాను ఆ విధంగా 'ఎంపిక' చేసుకోలేదు. ఫలానా అప్పుడు

“ఇప్పటి నుండి బాబా నా సద్గురువు. నేను ఆయనను సద్గురువుగా స్వీకరిస్తాను!”... ఇలా కాదు. “నా సద్గురువు” లాంటి పదాలు వాడాలి కాబట్టి అలా మాట్లాడవలసి వస్తుంది. నా హృదయంలోని భావన అది కాదు. మీ సద్గురువు ఎవరు? అని మీరు అడిగితే – “అవును. బాబానే నా సద్గురువు!” ఆ పదం మీకు బాగా తెలిసింది కాబట్టి నేను దానిని వాడతాను. కానీ నేను దానిని అలా చూడను. ఎందుకంటే, అలా చెప్పడం – ఏదో పద్ధతి ప్రకారం అన్నట్లుంటుంది, నాకేదో అంతర్లీనమైనటువంటి వేరే ఉద్దేశ్యమేదో ఉన్నట్లు, ఇదేదో సంబంధంలాగా, అందులో ఆయన నా నుంచి ఏదో ఆశిస్తున్నట్టు, నేనేదో చెయ్యాలన్నట్టు – ఏదో సిద్ధాంతంలాగా, తత్వంలాగా, వేదాంతంలాగా – ఉంటుంది. నాకు అటువంటి భావన లేదు. నాకు సంబంధించినంతవరకు ఆయన (బాబా) నా సంరక్షకుడు, నాకు తల్లి, తండ్రి, తాతగారు... అలాగన్నమాట.

**గురువుగారు:**

నేను కాలేజీలో ఉన్నప్పుడు మా ఇంగ్లీషు లెక్చరర్ అయిన ఒక ప్రొఫెసర్‌తో చాలా సన్నిహితంగా ఉండేవాడిని. ఆధ్యాత్మికత పరంగా కాదుగాని, ఆయన నాకు గురువువంటి వారు. నేనంటే ఆయనకు చాలా ఇష్టం. ఆయనకు ఎలాంటి ఆధ్యాత్మిక వాసన, భక్తి ఉండేది కాదు. ఆయన, భరద్వాజ మాస్టర్‌గారు ఒకే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవారు. మాస్టరుగారు ఇంగ్లీషు విభాగానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా ఉండేవారు. నేను ప్రతిరోజూ భరద్వాజ మాస్టర్‌గారితో కలసి కూర్చోవడం మొదలుపెట్టాను. ఎలాగైతే అంతకు ముందు

మా ఇంగ్లీష్ లెక్చరర్‌తో కలసి కూర్చునేవాడినో అలాగ! (కాకపోతే అప్పుడది ఎక్కువగా ఇంగ్లీష్ గురించే ఉండేది.)

ఆ సమయంలో మా ఇంగ్లీషు లెక్చరర్‌కు వేరే చోటుకు బదిలీ అయింది. ఆయన వెళ్ళిపోయే ముందు ఒక షాపులో బాబా చిత్రపటం ఒకటి చూశాడు. భరద్వాజ మాస్టర్‌గారు సాయిభక్తులు కాబట్టి, ఆయన దానిని కొని మాస్టర్‌గారికి బహుకరించాడు. వారం పదిరోజుల తర్వాత, మాస్టర్‌గారు ఆ బాబా చిత్రపటాన్ని నాకు బహుకరించారు. మా ఇంగ్లీషు లెక్చరర్‌గారికి వీడ్కోలు పలకడానికి వెళ్ళినప్పుడు ఆ చిత్రపటం నా దగ్గరే ఉంది.

"నేను భరద్వాజ మాస్టర్‌గారికి ఇచ్చిన చిత్రపటం ఇదే. ఆయన దీన్ని నీకిచ్చారా?" అని అన్నారాయన.

అది బాబా నన్ను మాస్టర్‌గారికి అప్పగించడంలా అనిపించింది. అది నాకు మంచి సంకేతంలా తోచింది.

నేను ఆ చిత్రపటాన్ని ఇంటికి తీసుకెళ్ళాను. అప్పటికే మా ఇంట్లో చిన్న బాబా ఫోటో ఒకటి ఉండేది. కానీ ఈ ఫోటో చాలా పెద్దది. ఆ రాత్రి నేను ఇంటికి వెళ్ళి ఈ ఫోటోను అక్కడ పెట్టాలనుకునేటప్పటికి, ఉండాల్సిన పాత బాబా ఫోటో ఆశ్చర్యకరంగా అక్కడ లేదు! ఫ్రేమ్ మాత్రమే ఉంది, బాబా ఫోటో లేదు. ఫ్రేమ్ ఖాళీగా ఉంది!

**భక్తుడు:**

ఎందుకని? ఏం జరిగింది?

**గురువుగారు:**

ఏం జరిగిందంటే... ఎలుకలు! (గురువుగారు నవ్వుతూ...) అది చాలా పాత ఫోటో. ఒక ఎలుక ఆ ఫోటోను ఫ్రేమ్ నుండి బయటకు

లాగి తినేసింది. ఆ తర్వాత ఆ ఫోటో ముక్కలు కొన్ని మాకొక మూలన కనిపించాయి. ఇది సరిగ్గా అదే రోజు జరిగింది. ఉదయాన ఆ ఫోటో అక్కడుంది, నేను రాత్రి ఒకటి లేక రెండు గంటల ప్రాంతంలో కోట (నెల్లూరు వద్ద ఒక గ్రామం)కు తిరిగి వచ్చి పూజ గదిలోకి వెళ్ళేసరికి – షాక్! ఇంట్లో ప్రతి ఒక్కరికి కూడా షాకే. ఏం జరిగింది?.. ఏం జరిగింది?.. అని.

భక్తుడు:
మీరు దానిని అశుభంగా భావించారా?

**గురువుగారు:**

అవును. అది బాబా ఫోటో. తప్పకుండా అశుభమే! కానీ మరో పెద్ద ఫోటోలో బాబా అప్పటికే అక్కడున్నారు. సాధారణ హిందూ కుటుంబంలో మాదిరిగానే మా ఇంట్లో కూడా చాలా పటాలుండేవి. నేను అక్కడున్న మిగతా పటాలన్నింటినీ ఒక ప్రక్కకు జరిపి పెద్ద బాబా ఫోటోను అక్కడుంచాను.

నేను ఆ గదిలో బాబాను చూస్తూ అలా కూర్చునేవాడిని. అప్పటికి నాకు ఏ సాధనలూ తెలియవు. బాబా గురించి తెలియదు. ఆయన జీవితచరిత్ర చదవలేదు. ఆయన సద్గురువనీ, ఆయనకు మహిమలు ఉన్నాయనీ, ఆయన నాకు సహాయం చేయబోతారనీ తెలియదు. నాకు తెలిసినదంటూ ఏమీ లేదు. కానీ ఆయన (బాబా) ముందు కూర్చున్నప్పుడు నన్ను ఎంతగానో బాధించే విపరీతమైన తలనొప్పి లాంటి భావనేదో తొలగిపోయేది. కాబట్టి నేను ఇంకా, ఇంకా, ఇంకా కూర్చోవలసిన అవసరం కలిగేది. నేను అక్కడ నుండి బయటకు వెళ్ళిన తక్షణం అది తిరిగి మొదలయ్యేది. కాబట్టి నేను

అలా గంటలు గంటలు కూర్చునేవాడిని. అదేదో సాధనలాగా కాదు, మరెవరో చెప్పారనీ కాదు. నేను చెప్పేదేమిటంటే కేవలం నా అవసరం కొద్దీ, నా శిరోవేదన మూలంగా అలా కూర్చునేవాడిని. శిరోవేదన అంటే నా ఉద్దేశ్యం కేవలం భౌతికమైన తలనొప్పి అని కాదు. నాకెలాంటి తలనొప్పులూ వచ్చేవి కావు. అది వేరే రకమైనది, ఓ రకమైన అంతర్గతమైన తలనొప్పి.

**భక్తుడు:**

మీ విషయంలో ఇది హఠాత్తుగా జరిగిందా? అంతకుముందు రోజు వరకు బాబాకు మీకు పెద్దగా సంబంధం లేదు. కానీ తరువాత రోజుకు హఠాత్తుగా బాబా పూర్తిగా, సంపూర్ణంగా మీ ఆరాధ్యదైవమై పోవడం... అది ఆ విధంగా జరిగిందా?

**గురువుగారు:**

నాకు తెలియనిది ఏదో ఉండేది. దేనిపట్లో ప్రేమ. నా మనస్సు దేని కోసమో పరితపించేది. నేను బాబాను చూసినప్పుడు "నేనిన్నాళ్ళుగా వెదకుతున్నది దీని కోసమే" అని తెలుసుకున్నాను.

**భక్తుడు:**

బాబాను మీ ఆరాధ్యదైవం అని గుర్తించడంతోనే సరిపోయిందా? లేక అది కేవలం ఆరంభం మాత్రమేనా?

**గురువుగారు:**

అది కేవలం ఆరంభం మాత్రమే.

**భక్తుడు:**

దేనికి ఆరంభమిది, గురువుగారూ?

**గురువుగారు:**

దానిని (బాబానే ఆరాధ్యదైవం అన్న గుర్తింపును) ఇంకా ఇంకా వాస్తవం చేసుకోవడానికి చేసే ప్రయత్నానికి ఇది ఆరంభం. ఉదాహరణకు నీకు ఉండటానికి ఇల్లు అవసరమైనప్పుడు, మంచి ఇంటి కోసం చూస్తావు, దాని కోసం వెదకుతుంటావు. మంచి ఇల్లు ఎలా ఉండాలి అని నీకొక అవగాహన ఉంటుంది, నీవైన కొన్ని అభిప్రాయాలుంటాయి. దాని వల్ల నీకు స్వంత ఆలోచనలుంటాయి. నువ్వు ఒక్కొక్క ఇంటిని చూస్తూ ఉంటావు. అలా చూస్తున్నప్పుడు 'ఇది కాదు, ఇది కాదు' అనుకుంటూ, అప్పుడు ఏదో ఒక ఇంటిని చూసినపుడు "దీని కోసమే చూస్తున్నది, సరిగ్గా ఇదే" అనిపిస్తుంది. కానీ అది అంతటితో ఆగదు, అది కేవలం ప్రారంభం మాత్రమే. ఆ ఇంటి యజమాని ఎవరో కనుక్కోవాలి, అద్దె ఎంతో తెలుసుకోవాలి. మన తాహతుకు సరితూగుతుందా? అసలు ఆ యజమాని దానిని అద్దెకు ఇస్తాడా లేదా అన్న విషయం కనుక్కోవాలి; ఇలా చాలా విషయాలు ఉంటాయి. కాబట్టి అది కేవలం ఆరంభం మాత్రమే. ఒక విషయానికి సంబంధించినంతవరకు అది చివర, మరొక దానికి ఆరంభం.

**భక్తుడు:**

ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన భద్రత కోసం వెతుక్కుంటూ ఉంటారు. కొంతమంది దాన్ని (భద్రతను) సంబంధ బాంధవ్యాలలో, మరికొంతమంది వాళ్ళ కుటుంబం లేదా డబ్బులో... ఇలా దేనిలోనైనా (వెతుక్కుంటారు)... ఈ ప్రశ్న కాస్త అసహజంగా

ఉన్నట్లనిపిస్తున్నా, నా మనసులో అడగాలని ఉంది. మీ భద్రత ఏమిటి గురువుగారూ!

**గురువృగారు:**

బాబా!

**భక్తుడు:**

అందరూ వారి భద్రతను వేరే వేరే మార్గాలలో పొందినట్టు, మీ అవసరాలన్నీ బాబా ద్వారా తీరుతున్నట్లు మీరు అనుకుంటున్నారా?

**గురువృగారు:**

అవును! నాకు దేనికీ కొరతగా ఉన్నట్టనిపించదు. బాబా నాకు అన్నీ ఇస్తారు. అది భద్రతకు మించినది. ఎందుకంటే, భద్రత అనంటే మనకు ఉన్నదానిని కాపాడటం లేదా రాబోయే ప్రమాదం నుండి కాపాడడం. కానీ బాబా కోరికలు తీర్చే కల్పవృక్షం. అది (ఆ కల్పవృక్షం) మనకు ఉన్న దానిని రక్షించడం, రాబోయే ప్రమాదాల నుండి కాపాడడం మాత్రమే కాదు, మన కోరికలు కూడా నెరవేరుస్తుంది.

**గురువృగారు:**

అన్నింటికంటే ముఖ్యమైనది “నేను బాబాకు చెందినవాడిని. బాబా నా వారు!” అనేటువంటి ఆ అనుబంధం, ఆ అనుభవం, ఆ గుర్తింపు. అది చాలు! దానిని నువ్వు గుర్తుపెట్టుకున్నంత వరకు అదే నిజమైన స్మరణ అవుతుంది. స్మరణ అంటే గుర్తుపెట్టుకోవడం.

**భక్తుడు:**

గురువుగారూ! నేను బాబాను కోరినవి పొందడం, పొందకపోవడం

అనే దాని మీద ఆధారపడకుండా, బాబా పట్ల ఆ అనుబంధం ఎప్పుడూ అలాగే ఉంటుందా?

**గురువుగారు:**

నీకు అటువంటి అనుబంధం ఉంటే, ఒకవేళ బాబా ఇవ్వకపోయినా ఆ అనుభవం చెరిగిపోదు. ఉదాహరణకు, నీకో బిడ్డ ఉంది. ఆమె తన స్కూల్ పరీక్ష పాస్ కావాలని నువ్వు ఎంతగానో అనుకుంటావు. కానీ ఆమె పాస్ కాలేదు. ఆ బిడ్డ పట్ల నీ ప్రేమ పోతుందా? ఆ అమ్మాయిని ఇంకా ఎందుకు ప్రేమిస్తున్నావు? ఎందుకంటే ఆమె నీ బిడ్డ కాబట్టి! మనం అడిగింది బాబా ఇచ్చినా ఇవ్వకపోయినా నీకు ఆ అనుబంధం ఉంటే అది చాలు. అన్నీ జరిగిపోతాయి. అది చాలా సులభంగా అనిపిస్తుంది కానీ అంత సులువు కాదు. ఆ అనుబంధ భావనను వాస్తవం చేసుకోవడం కోసం, ఆ గుర్తింపు కోసమే మనమందరమూ ప్రయత్నించేది.

**గురువుగారు:**

"నేనెవరు?" అనే విచారణ వ్యక్తి అస్తిత్వానికి సంబంధించినది. ఒక్కొక్కళ్ళూ ఆ గుర్తింపును ఒక్కొక్క రకంగా అనుభవం చెందుతారు. "నేను ఆత్మను, నేను బ్రహ్మాన్ని, నేను ఈశ్వరుణ్ణి, నేను సాయిబాబా బిడ్డను, నేను అరుణాచలేశ్వరుని కుమారుణ్ణి. నేను ఆయన వాడిని, ఆయన నా వాడు"... ఇలా కొంతమంది అనుభూతి చెందవచ్చు. తనను ఏదో ఆవహించినట్టు అనుభూతి చెందానని రమణమహర్షి చెప్పారు. ఆయన దానికి 'ఆవేశం' అన్న పదాన్ని వాడారు. అది

నీకు చెందినది కాబట్టి నువ్వు దానిని పొందాలనుకుంటావు. అనుభవైకవేద్యం చేసుకోవాలి అనుకుంటావు.

'నేను పొందాలి' అనుకోవడం అసహజమైన విషయం కాదు. నిజానికి మనకంటే ఉన్నతమైన అస్తిత్వంతో లీనమవడం అనేది ఒక అందమైన భావన. మనలో ఆ గుర్తింపు భావన కలగడమే ముఖ్యం. నిజానికి మనలో పరివర్తన కలిగించేది అదే. ఎందుకంటే మనలో భావోద్వేగాలు, ఆలోచనలు అన్నీ దాని మీదనే ఆధారపడివుంటాయి. ఒక్కసారి మన గుర్తింపు (Identity) మారడం, పరివర్తన చెందడం ప్రారంభమైన తరువాత మన అనుభవాలు, మన జీవితం మొత్తం పరివర్తన చెందడం ప్రారంభమవుతుంది. నేను ఫలానా అనే ఆ గుర్తింపే దానికి మూలం. అందుకే భగవాన్ "నేనెవరు? నేనెవరు? అని విచారించి నీవు ఎవరో తెలుసుకో" అన్నారు. ముందు నీ అస్తిత్వం ఏమిటో తెలుసుకో. మిమ్మల్ని మీరు ఫలానా అని అనుకోవద్దు, మీ అస్తిత్వాన్ని (Identity) తెలుసుకోండి. ఈ రెండింటికీ భేదం ఉంది. అది ఏదైనా కానీ, మన ప్రస్తుత ఉనికిని కోల్పోతే తప్ప మన నిజమైన అస్తిత్వాన్ని పొందలేము. భగవాన్ అదేంటో చెప్పలేదు. కానీ మన నిజమైన ఉనికిని మనం తెలుసుకుంటే అది చాలు.

**గురువుగారు:**

మనం ఏదైనా ఆనందం పొందినప్పుడు దానిని మనం మిగతా వారితో పంచుకుంటాం. నేను సాయిబాబాలో ఓ నిధిని చూశాను. ఏదో అనుభవాన్ని పొందాను. మీరు ఇక్కడకు వచ్చినప్పుడు నా అనుభవాన్ని మీతో పంచుకుంటాను. నేను ఎవ్వరినీ పిలవను, అలా

అని ఎవ్వరినీ కాదనను (తిరస్కరించను). ఎందుకంటే బాబానే స్వయంగా చెప్పారు: “మీ దగ్గరకు ఎవరు వచ్చినా, నేను పంపానని గుర్తుపెట్టుకోండి. మీకు వారితో గల కర్మసంబంధం వల్లనే వారు మీ వద్దకు వచ్చారు” అని. వెనుకటి ఋణానుబంధం వలన మనం ఇక్కడ ఇలా కూర్చుని ఉన్నాం. నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావిస్తాను. మిమ్మల్ని అలా గౌరవించాలనుకొంటాను. మీ కోసం నేను చేయగలిగినదంతా చెయ్యాలి. అయినా నేను ఏం చేయగలను? పంచుకోవడం తప్ప. నేనదే చేస్తున్నాను. ఇదంతా బాబా పట్ల నాకు గల ప్రేమకు వ్యక్తీకరణే!



శిరిడీ, 2004



# ప్రేమించు ప్రేమకై

**గురువుగారు:**

'ప్రేమ' అనేది ఆనందం ఉండటం వలన కలిగే అనుభవం. సాధారణంగా మనలో అటువంటి అనుభవాన్ని (ప్రేమను) కలిగించేది ఏదో మనం తెలుసుకున్నప్పుడు, ఆ అనుభవాన్ని కలిగించే దానిని (ఆ అనుభవానికి కారణమైన దానిని) ప్రేమిస్తున్నామని చెప్తాము. ప్రతి ఒక్కరికీ ఎప్పుడూ వాళ్ళు కావాలనుకునేది ఏదో ఉంటుంది. కానీ అది చాలావరకు అవ్యక్తంగా, అస్పష్టంగా ఉంటుంది. అది ఏమిటన్నది వారికి తెలియదు. మన జీవితమంతా, అస్పష్టంగా ఉన్న పరిపూర్ణత్వభావనను వాస్తవం చేసుకొని, తద్వారా పొందే నిజమైన ఆనందం కొరకు చేసే ప్రయత్నమే అవుతుంది. కొంతమందికి వారి జీవితంలో ఒక వ్యక్తి – సద్గురువు – ఎదురైనప్పుడు అక్కడ అటువంటి ప్రేమ కలుగుతుంది. అందుకు నీకే కారణమూ కనిపించదు. కానీ అది నీకు అనిర్వచనీయమైన భద్రతాభావాన్ని, నమ్మకాన్ని, ఆనందాన్ని

కలిగిస్తుంది. నువ్వు ఇష్టాయిష్టాలనుకుంటూ ప్రోగు చేసుకున్నవన్నీ అక్కడ తమ అస్తిత్వాన్ని కోల్పోయి కనుమరుగవుతాయి. అలా కావడానికి కారణం ఆ ఇష్టాయిష్టాలన్నీ తీరిపోయాయని కాదు; ఏదో జరుగుతుంది. ఆ అనుభవాన్ని అనుభూతి చెందడం, వ్యక్తపరచడం, విస్తృతం చేసుకోవడమే ప్రేమ!

**గురువుగారు:**

మీరందరూ ప్రేమ కోసం తపిస్తూ ఉంటారు. మీరు దానికి ముక్తి, మోక్షం, నిర్వాణం, బంధవిమోచనం, స్వేచ్ఛ... ఇలా రకరకాల పేర్లు పెడతారు. కానీ హృదయాంతరాళాలలో మీరు నిజంగా తపించేది మాత్రం ప్రేమను పొందాలని, ఎవరి ప్రేమనైనా నిజంగా పొందాలని!! ఒకరు నిజంగా నిన్ను ప్రేమిస్తున్నారు అనేటటువంటి అనుభవం కలిగినపుడు నీలో ప్రేమ కలగడం మొదలై, అది జ్వలించి నిన్ను పూర్తిగా ఆక్రమించి దహించివేస్తుంది. ఎందుకంటే నీలో అస్పష్టంగా ఉండే ఆనందానుభవమే అది కాబట్టి. ఎప్పుడూ నువ్వు ఆ ప్రేమకు నిర్దిష్టమైన వ్యక్తీకరణ కోసం ప్రయత్నిస్తుంటావు. అందువల్ల ప్రేమ నిజంగా రగులుకున్నప్పుడు ఆ అనుభవానికి నిన్ను నువ్వు అర్పించుకుంటావు. కానీ ఈ రగులుకోవడం అనేది నీ చేతుల్లో లేదు: నిన్ను వేరెవరో ప్రేమించాలి; ఆ ప్రేమించే మనిషి మూర్తీభవించిన ప్రేమ రూపమై ఉండాలి; నిన్ను ప్రేమించగలిగి, నీలో ప్రేమను రగిలించగల సామర్థ్యం కలిగివుండాలి. అలాంటి వారే సద్గురువు.

**భక్తుడు:**

గురువుగారూ! బాబాకు కృతజ్ఞతలు ఎలా చెప్పగలం?

**గురువుగారు:**

మనం బాబాకు చెందినవారమనే బాంధవ్యభావనతో ఆయన ప్రేమను అనుభూతి చెందడమే నిజమైన కృతజ్ఞత. ఎవరో చెప్పినట్టు గుర్తు: "ఎవరికైనా వారిపట్ల శ్రద్ధను చూపించడం కన్నా ఇవ్వగలిగిన గొప్ప బహుమతి అంటూ ఏమీ ఉండదు" అని. కాబట్టి బాబాకు మీ శ్రద్ధను ఇవ్వండి. అది ఆయనకు కృతజ్ఞత తెలియజేయడమే!

**భక్తుడు:**

శంకరులు ఎక్కడో "శ్రద్ధే భక్తి" అని అన్నారు.

**గురువుగారు:**

అవును, అది భక్తే. అందుకే దానిని నేను ప్రేమ అన్నాను. ప్రేమంటే ఏమిటి?– భక్తి; భక్తి అంటే?– శ్రద్ధ; శ్రద్ధ అంటే?– జ్ఞానం.

**భక్తుడు:**

బాబా ఇప్పుడు తమ భౌతికదేహంతో లేరు. కనుక మేము ఆయనను పట్టుకోవాలంటే కష్టం. కనుక బాబా భౌతికదేహానికి అతీతంగా ఏదో విధంగా మేమాయనతో సంబంధం కలిగివుండాలి. గురువు యొక్క భౌతికరూపంతో మాత్రమే కాకుండా, అంతరంగంలో కూడా వారితో సంబంధం కలిగివుండటానికి మార్గాలున్నాయా గురువుగారూ?

**గురువుగారు:**

నిజానికి ఇక్కడున్న వాళ్ళంతా రకరకాల మార్గాలలో చేస్తున్నది అదే! వారి జీవితాలను బాబాతో శృతి చేసుకుని, దానిని (ఆ సంబంధాన్ని)

ఇంకా ఇంకా స్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జీవితం యొక్క ప్రతి పార్శ్వంలో, ప్రతి అడుగులో, ప్రతి శ్వాసలో బాబాను అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తున్నారు.

భక్తుడు:
అది ఆంతరంగికమే అవుతుంది కదా, గురువుగారూ?

**గురువుగారు:**
అది ఆంతరంగికమే. బాబాను అనుసరించడమనుకునేది కూడా ఆంతరంగికమై ఉండాలి. అది (ఆ అనుసరించడం) అంతరంగంలోని తపనకు బాహ్యమైన వ్యక్తీకరణ. నీకు లోపల ఆ భావం లేకుండా కేవలం బాహ్యంగా అనుసరిస్తున్నంత మాత్రాన ఏమీ ప్రయోజనం లేదు. అందుకే బాబానే అన్నారు: "బాబా అంటే ఈ దేహమేనని అనుకుంటే నువ్వు నన్నసలు చూడనట్లే! నీ జీవితపర్యంతం నువ్వు నా ప్రక్కనున్నా ఉపయోగం లేదు" అని. అదీ ఆయన చెప్పింది. బాహ్యమైన అనుసరణ, అంతరంగికమైన తపనకు వ్యక్తీకరణ కావాలి; నేను ముందు చెప్పినట్టు మన ప్రేమకు వ్యక్తీకరణ.

భక్తుడు:
గురువుగారూ! మీరు 'బాబాను పిలవడం' అనేది హృదయంలో నుండి వస్తుంది అన్నారు. మేము బాబాను ఇష్టపడినపుడు, మేము ఆయన నామాన్ని కూడా ఇష్టపడతాం, అందువల్ల మేము ఆయనను పిలవాలనుకుంటాము. అది చాలా వరకు దానంతటదే జరుగుతుంది. కానీ ఒకవేళ 'పిలవడం' అన్నది దానంతటదే జరగనప్పుడు అక్కడ మన ప్రయత్నానికి తావుందా?

**గురువుగారు:**

అవును. ఇప్పుడే ఎవరో అడిగారు 'ప్రార్థన సహాయపడుతుందా?' అని. అవును! సహాయపడుతుంది. నువ్వు బాబాను పిలవడం– ఇదే ప్రార్థన అంటే. నీకు నిజంగా అవసరమైనప్పుడు నువ్వలా చేస్తావు. ఎందుకంటే నీకు వేరే దారిలేదు. కనుక అంతకన్నా చేయగలిగింది ఏముంది నీకు? అప్పుడు నువ్వు కూర్చుని నీ హృదయాంతరాళాలలో నుండి బాబాను వేలు, లక్షలసార్లు పిలవడానికి ప్రయత్నిస్తావు.

**భక్తుడు:**

కానీ అది ప్రయత్నించడం అవుతుంది కదా?

**గురువుగారు:**

అది నీ ప్రేమకు వ్యక్తీకరణ. ఆ ప్రేమను నువ్వు ఇంకా ఇంకా వ్యక్తం చేస్తున్నావు. ఇదే నేను ఇప్పుడు చెప్పింది: "నీకు ఎంతగా అవసరం ఉంటే, అంతగా వ్యక్తీకరణ ఉంటుంది, అంత ప్రేమా ఉంటుంది. నువ్వు దానిని పొందుతావు". అప్పుడు ప్రతిస్పందించే శక్తి, స్వీకరించ గలిగే శక్తి మెండుగా ఉంటాయి. నీవు కేవలం నోటిమాటతో "నాకది ఇష్టం. నాకది కావాలి, నేను చాలా నిస్పృహతో ఉన్నాను, నాకది అవసరం" అని చెప్పినంత మాత్రాన ఏమీ జరగదు. నిస్పృహగా ఎలా ఉన్నావు? నిజంగా నువ్వు అంతటి నిస్పృహలో ఉంటే, అటువంటి నిస్పృహస్థితిలో నీవేం చేస్తున్నావు? నీకు అది అత్యవసరమా? అత్యావశ్యకమా? తప్పనిసరా? అలా అయితే, దానిని పొందగలిగేలా పిలువు. అంతకుమించి ఏం చెయ్యగలవు? అలా పిలుస్తూ, పిలుస్తూ, పిలుస్తూ ఉండటం నాకిష్టం. కానీ మనం అలా చెయ్యం. ఎందుకంటే మన మనస్సు చాలా జిత్తులమారి. అలా పిలవడాన్ని తప్పించు కోవడానికి మార్గాలు వెతుకుతూ ఉంటుంది. అటువంటి పిలుపును

మన జీవితావసరంగా చేసుకోవడానికి అంగీకరించదు. నేను మిమ్మల్నెప్పుడూ కోరేదేమిటంటే, ఆ పిలుపును మీ జీవితావసరంగా చేసుకోండి, మీ జీవితవిధానంగా మలుచుకోండి. అప్పుడప్పుడు అలా కూర్చుని, మనస్సు లగ్నం చేసి, గంటల పర్యంతం... పిలవండి, పిలవండి, పిలవండి. మీకు దాని ఫలితం కనిపిస్తుంది. మొత్తం ఎంత అద్భుతంగా, ఎలా మారిపోతుందో తెలుస్తుంది.

మీరు దానిని ఒక సాధనాపద్ధతి అంటామంటే అనుకోవచ్చు, నేను పట్టించుకోను. నేనైతే దానిని సాధనాపద్ధతి అనను. అది మీ అవసరానికి, మీ ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. మీ హృదయంలో పిలవండి, మీ అవసరమంతా ఆసరాగా చేసుకుని బాబాను ఆర్తిగా, ఆర్ద్రంగా, హృదయపూర్వకంగా పిలవండి. ఊరికే (బాబా) నామాన్ని వల్లెవేయవద్దు. పిలవండి!

**భక్తుడు:**

బాబాను పిలవడం అనేది మన పారమార్థిక జీవితావసరం కావాలి అన్నారు కదా గురువుగారూ? మీ దృష్టిలో బాబాను పిలవడం అంటే ఏమిటి? ప్రత్యేకంగా కూర్చుని బాబాను పిలవడమా లేక మన మామూలు రోజూవారీ జీవితంలో బాబాను పిలవడానికి మార్గమేదైనా ఉందా?

**గురువుగారు:**

వాస్తవానికి, నిజంగా పిలవడం అనేది మన భావోద్వేగానికి, ప్రేమకు వ్యక్తీకరణ. ఉదాహరణకు, నీకు బాగా ఆకలిగా ఉన్నపుడు ఆహారం కోసం చూస్తావు (గురించి ఆలోచిస్తావు). దాని కోసం తపిస్తావు.

ఇది ఒక రకంగా ఆహారం కోసం మనం పిలుస్తుండటమే. నువ్వు 'అన్నం, కూర' అని అనాల్సిన అవసరంలేదు. కానీ మనస్సు 'అన్నం, కూర' అంటుంది. దాని కోసం వెతుకుతుంది. అంతకుముందు మీరు నామం చేసుకోవడం గురించి మాట్లాడారు కాబట్టి నేను 'వాచా పిలవడం' అని చెప్పాను. నిజానికి అది అన్వేషించడం కూడా. ప్రేమించడం, ఆ ప్రేమను వ్యక్తీకరించడం, తపించడం – ఇలా దానికి చాలా పదాలున్నాయి. సందర్భాన్ని బట్టి, పదం వాడుక మారుతూ ఉంటుంది. అది తపన కావచ్చు, అది ఒక భావోద్వేగం కావచ్చు లేదా ఒక వ్యక్తీకరణ కావచ్చు. కేవలం చింతన చేస్తూ ఆ ప్రేమను అనుభవిస్తూ, ఆస్వాదించడం కావచ్చు.

నా వరకు, ఇవన్నీ పిలవడం వంటివే. ఉదాహరణకు, మీకు సత్సంగం కావాలనుకుంటారు. కానీ సత్సంగం జరగలేదనుకోండి... మీరు సత్సంగం గురించే ఆలోచిస్తూ, "సత్సంగం ఉంటే ఎంత బాగుండేది, సత్సంగం కావాలని మేమెంతగానో కోరుకుంటున్నాం" అంటారు. ఇది సత్సంగం కోసం పిలుపులాంటిదే. ఇలా చాలా విషయాల వ్యక్తీకరణకు 'పిలుపు' అనే పదం ఉపయోగపడుతుంది. బాబాను ఆహ్వానించడం (Call about); బాబాను అర్థించడం (Call On); బాబాను అడగటం (Call For); – ఇవన్నీ బాబాను పిలవడమే. ఇంగ్లీషులో విభక్తి(Preposition)ని మార్చడం ద్వారా చాలా వ్యక్తీకరణలు వస్తాయి. అవి ఏమైనా సరే అన్నింటి గురించి ఆలోచించండి – అవన్నీ పిలవడం వంటివే. కొన్నిసార్లు బాబాను అర్థిస్తావు, కొన్నిసార్లు బాబాను అడుగుతావు, కొన్నిసార్లు బాబాను ఆహ్వానిస్తావు.

**భక్తుడు:**

కానీ నిజానికి అలా పిలవడానికి అపరిమితమైన అవకాశాలున్నాయి. ఏ రకమైన వ్యక్తీకరణైనా పిలవడమే అవుతుంది.

**గురువుగారు:**

ఏ వ్యక్తీకరణైనా పిలవడం కాదు. అది ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. అవును! ఎలాంటి వ్యక్తీకరణైనా కాదు. ప్రేమకు సంబంధించిన ఎలాంటి వ్యక్తీకరణైనా (పిలవడమే)!!

**భక్తుడు:**

జీవితం ఆనందంగా ఉంటే, ఇంకా అడగటానికి ఏముంటుంది?

**గురువుగారు:**

మనలో కొంతమందికి అవసరమైనవన్నీ ఉంటాయి. కానీ మనం అడుగుతూ ఉంటాం. అలా అడగటంలో ఆనందం ఉంటుంది. తృప్తి ఉంటుంది. అదే దానిలో ఉండే అందం.

**భక్తుడు:**

దేనిలో ఉండే అందం?

**గురువుగారు:**

(గురువుగారు నవ్వుతూ)... నేను చెబుతున్నది, అడగడంలో ఉండే అందం గురించి. ఏమీలేని వాళ్ళు మాత్రమే అడుగుతారని కాదు, కానీ కొంతమందికి అన్నీ ఉన్నా అడుగుతూ ఉంటారు. ఎందుకంటే అడగటం అనేది వాళ్ళ ప్రేమకు వ్యక్తీకరణ. దానిని పొందడం కూడా వాళ్ళ ప్రేమకు వ్యక్తీకరణే అవుతుంది. బాబా మార్గంలో ప్రతిదీ ఎంతో ఆనందంగా ఉంటుంది. మనం ఆనందంగా ఉన్నాం

కాబట్టి అడుగుతాం. అంతేగానీ పాపులమని, దౌర్భాగ్యప్రాణులమని, హేయమైన జీవులమని కాదు. ఎంతో ఆనందంగా ఉన్నాం కాబట్టి అడగటం ద్వారా మన ప్రేమను వ్యక్తం చేస్తున్నాం. అదే దానిలో ఉండే అందం! ఆనందంగా అడగడం, అలా అడగటమన్నది మన ప్రేమకు వ్యక్తీకరణ కావడం, అదీ నిజమైన సాయిపథం. అది ఎలా అంటే, మీరు ఎన్నో ప్రశ్నలు వేస్తున్నారు. వీటికి సమాధానాలు మీకు నిజంగా అవసరం కాదు. ఆ విషయం నాకు తెలుసు. అడగడం అన్నది మీ ప్రేమకు వ్యక్తీకరణ. నేను సమాధానాలు చెప్పడం నా ప్రేమకు వ్యక్తీకరణ. అదీ అడగడం అంటే! అందుకే నేను దానిని ఆస్వాదిస్తాను. దానిని ఇష్టపడతాను!! (గురువుగారు నవ్వుతూ...) జీవితమంతా అలా ఉండాలి.

అడగడం అనేది మన ప్రేమకు వ్యక్తీకరణ. ప్రాపంచికంగా ఏ లోటూ ఉండదని బాబా అభయమిచ్చారు. నీ జీవితంలో నిజమైన దుఃఖానికి చోటులేదు. నీవు అన్నీ పొందుతావు. నీకు డబ్బు కావలసి వస్తే బాబా ఇస్తారు, కావాల్సినంత! మంచి ఇల్లు కావాలంటే, ఇస్తారు. మరేదైనా కావాలంటే, దానినీ ఇస్తారు. ఇవన్నీ ఉన్నా... ప్రేమ కొరకు, కేవలం ప్రేమ కోసం... అడుగుతూ ఉంటాం.

అలా అడగడంలో అందం ఉంది. అందులో రసాత్మకమైన అనుభూతి ఉంది. అదే రససిద్ధాంతం! జీవితపు సారాన్ని (జీవితం యొక్క రసాన్ని) మనం ఎలా అనుభవిస్తాం, వృద్ధి చేసుకుంటాం అనే దానిని, ఊరికే మామూలు అనుభవాలలో కూడా తెలుసుకోవచ్చు. జీవితమంతా మధుర రసభరితం చేసుకుని, దానిని ఆస్వాదిద్దాం. అదే రసానుభూతి, రసాత్మక జీవితానుభవం. అదీ సాయిపథం!



తెనాలి, 1993



# నమస్కారం

**గురువుగారు:**

నమస్కారం అంటే 'న-మ-ఆస్కారం'. అంటే 'నేను' లేక 'నాది' అనే వాటికి ఆస్కారం లేదు అని దాని అర్థం. ఏ స్థితిలోనైతే నేను, నాది అనే వాటికి ఆస్కారం ఉండదో అది నమస్కారం. అంతేగాని 'అతను నాకు నమస్కారం చేశాడా?' లేకపోతే 'అతను ఈ రోజు నాకు నమస్కారం చేయలేదు'... ఇలా కాదు. అది నమస్కారానికి పూర్తిగా విరుద్ధమైనది! మన అహంకారం మరియు నేను, నాది అనే భావన సద్గురు పాదాల క్రింద అణగిపోవాలని మనం ప్రార్థిస్తాం కదా (ప్రార్థించమా)? కాబట్టి మనం నమస్కారం చేసిన ప్రతిసారీ అటువంటి భావోద్వేగం, వినమ్రభావం కలగాలి, ఆ నమస్కారానుభవాన్ని ఉజ్జీవం చేసుకోవడానికి ఆ భావాలను మరింత బలీయం చేసుకోవాలి. అది సాష్టాంగనమస్కారమైనా,

పాదనమస్కారమైనా, మీరు చేసే మరే ఇతర నమస్కార రూపమైనా– నమస్కారమనే ఆచారవిధి వెనుక గల ఉద్దేశ్యం ఇదే.

**భక్తుడు:**

మీరు చెప్పిన వివిధ నమస్కారాలు ఏమిటి?

**గురువుగారు:**

హృదయం ముందు అరచేతులను జోడించడం నమస్కారం (అంజలి). పూజనీయులు లేదా మహాత్ముల పాదాలను స్పృశించడం పాదనమస్కారం. సాష్టాంగ నమస్కారం అంటే శరీరం యొక్క మొత్తం ఎనిమిది అంగాలను నేలపై ఆనించడం; అందువలన ఏ అవయవం కూడా ఉన్నతస్థాయిలో ఉండదు. శిరస్సు మాత్రమే కాదు, శరీరంలోని మొత్తం అవయవాలన్నీ నేలపై సమతలంగా ఉంటాయి. ఇంగ్లీషులో "He fell flat infront of him" ("ఇతను ఆయన ముందు సాగిలపడ్డాడు") అంటారు కదా అలాగన్నమాట. దానర్థం ఏమిటంటే అతని అహం అంతా పోయింది, ఇంకేమీ మిగలలేదు. మనకు కావలసిందీ అదే కానీ సవ్యమైన రీతిలో. మనం అటువంటి వినమ్రతను కోరుకునేటప్పుడు, మనకటువంటి కోరిక ఉన్నప్పుడు ఎన్నిసార్లు అనే ప్రశ్న ఎక్కడిది? వాస్తవానికి అటువంటి నమస్కారమనేది నిరంతరం జరగాలి, అప్పుడు నిరంతర నమస్కారస్థితిలో ఉంటారు. అందుకే ముస్లింలు నమాజు చేసేటప్పుడు ఒక చిన్నగుడ్డను తల మీద కప్పుకుంటారు– ఎవరి దివ్యత్వమైతే తమ శిరస్సులపై ఉందో, అటువంటి భగవంతుని (అల్లా) క్రింద తాము ఉన్నామన్న దానికి సంకేతంగా! ఇదే కారణంతో బాబా తల మీద గుడ్డను ధరించేవారు.

**భక్తుడు:**

వాళ్ళు తమ తలపై ఏదైనా ధరిస్తారా?

**గురువుగారు:**

అవును, వారికి వినమ్రతాభావాన్ని అనుభూతి చెందడానికి దోహదం చేసే ఒక ఆచ్ఛాదనమది. అందుకనే నమాజు చేసేటప్పుడు తమ తలపై కప్పుకుంటారు. ఫకీరు అంటే నిరంతరమూ నమాజు చేస్తూనే ఉండేవారు, రోజుకు నాలుగైదుసార్లు మాత్రమే కాదు, ఆయనెప్పుడూ నమాజు స్థితిలోనే ఉంటారు, అందువల్ల వారు తమ తలపై ఎప్పుడూ కప్పుకునే ఉంటారు.

**భక్తుడు:**

నిజానికి, మేమంతా పాదనమస్కారం కోసం ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటాము. అటువంటి అవకాశం గనుక వస్తే, మేము ఆ అవకాశాన్ని వదులుకోము అనుకొంటూ ఉంటాము. అయితే పాదనమస్కారం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? మా భక్తికి అది ఎలా సహాయపడుతుంది? ఎంత తరచుగా అది అవసరమవుతుంది? దీని గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు:**

వాస్తవానికి, పాదనమస్కారం అనే ఆచారం వెనుక గల అంతరార్థం ఏమిటంటే, మన శరీరంలోని అత్యున్నత భాగమైన శిరస్సును అన్నింటికన్నా క్రింద స్థానానికి తీసుకురావడం. క్రింద స్థానం (క్రిందికి), అంటే ఏ స్థాయికి? – సద్గురువు పాదాల చెంతకు. మనం ఆయన ముందు, ఆయన పాదాల చెంత మనం అన్నింటికన్నా

తక్కువ వారమని, వినమ్రులమని ఆయనకు తెలుపడానికి అలా చేస్తాం. కాబట్టి మన శరీరంలోని అత్యున్నత భాగాన్ని సద్గురువు యొక్క అధోభాగమైన పాదాల వద్దకు తీసుకువస్తాం. తలను ఆయన (సద్గురువు) పాదాల దగ్గర ఉంచడం, పాదాలను స్పృశించడం అనే ఆచారం అలా వచ్చింది. నీ తలను సద్గురువు పాదాల వద్ద ఉంచాల్సిన అవసరం నీకున్నంతవరకు నువ్వు దానిని వీలైనంత తరచుగా చేస్తుండాలి. నిజానికి అది (తల) నిరంతరం అక్కడే (పాదాల వద్ద) ఉండాలి. ఎంత తరచుగా అన్నది కాదు, ఎప్పుడూ మన శిరస్సు సద్గురు పాదాల దగ్గరే ఉండాలి. ఈ అంగముద్రలన్నీ మన ఎఱుకను మరింత స్పష్టం చేసుకోవడానికి సహాయపడతాయి. అన్ని ఆచారాల వెనుక ఉండే అంతరార్థం ఇదే. "ఒక్కసారి చేస్తే సరిపోతుందా!"– చాలదు! అది ఆ ఎఱుకను కలిగించడానికి, దానిని ఇంకా ఇంకా ఎక్కువ చేసుకోవడానికి మాత్రమే. అంతే! దానికున్న ఏకైక అర్థం అదే. అసలు నిజమైన నమస్కారమంటే బాబా పాదాలు ఎప్పుడూ మన తలపై ఉన్నాయి అన్న ఎఱుకే; దానిని బాహ్యంగా చేయడమన్నది మన అంతరంగంలోని ఆ అనుభవానికి అభివ్యక్తీకరణ మాత్రమే. అన్నీ పూజా (ఆచార) విధులు ఇటువంటివే.

**గురువుగారు:**

బాబా ఫోటోను చూసిన ప్రతిసారీ నమస్కరించాలా అని అతను అడుగుతున్నాడు. బాబా ఫోటోకు నమస్కారం చేయకుండా ఉండడానికి పరిష్కారం ఏమిటంటే, నువ్వు బాబా ఫోటోను చూడనప్పుడు కూడా నిరంతరం నమస్కారం చేస్తూండటమే. నువ్వు హృదయంలో గనుక

ఎప్పుడూ నమస్కరిస్తూ ఉంటే అప్పుడిక బాహ్యంగా నమస్కరించాల్సిన అవసరం ఉండదు. కాబట్టి ఎప్పుడూ నిరంతర నమస్కారస్థితిలో ఉండండి. అప్పుడు మాత్రమే బాహ్యమైన వ్యక్తీకరణ అవసరం ఉండదు. అలా కాకపోతే మీరు తప్పనిసరిగా నమస్కరించాలి. నేను చేస్తాను. దానిలో తప్పేమీ లేదు. మీ ఆఫీస్‌లో పై అధికారిని చూస్తావు, అతను నీ వైపుగా వస్తూ ఉంటాడు. నువ్వు "నమస్తే సార్" అని చెప్తావు. చెప్పరా మీరు? అలా చెయ్యడానికి నువ్వేమీ సిగ్గుపడవు. బాబా దగ్గరకు వచ్చేటప్పటికి అది మనకు సమస్యగా ఉంటుంది! అలా ఉండకూడదు. నేను నమస్కారం చేస్తాను.

**గురువుగారు:**

ఆధ్యాత్మికానుభూతి పొందాలనుకునే చాలామంది, "మన ఆలోచనల నన్నింటినీ, భావోద్వేగాలనన్నింటినీ, అన్ని సంస్కారాలను, అన్ని వాసనలను వదలిపెట్టి మనల్ని మనం ఖాళీ చేసుకోవాలి. మనం నిర్మలంగా ఉండాలి, మనం చా...లా ఖాళీగా ఉండాలి!!" అని అనుకొంటూ ఉంటారు. ఈ శూన్యత (ఖాళీ) యొక్క ప్రయోజనం గురించి మనకు ఒక అస్పష్టమైన అభిప్రాయం ఉంటుంది కానీ అలా అన్నీ వదులుకోవడం మనకు ఇష్టం ఉండదు; నిజానికి దానిని (ఆ శూన్యతను) మనం ఎదుర్కోలేము. అందులోని పరస్పర వైరుధ్యం, ద్వైదీభావం అదే. కాబట్టి మొదట మనకు ఈ శూన్యం గురించి తెలియాలి. అందుకే నేను శూన్యం అన్న పదాన్ని వాడను, నేను దానిని ఎప్పుడూ పరిపూర్ణత్వమంటాను. మనం పూర్ణంగా నిండిపోవాలి. దేనితో? సంతోషంతో, ఆనందంతో, తృప్తితో. కానీ

అక్కడ ఖాళీ ఉండాలి. మనం చాలా ఖాళీగా ఉంటాం కానీ దేనినీ లోపలికి రానివ్వం. అదెలాగంటే, ఒక పాత్రలాగా అన్నమాట. ఒక పాత్రను తీసుకోండి, మీ స్నానాలగదిలో ఈ ప్రయోగం అందరూ చేయవచ్చు (నవ్వులు). ఒక పాత్రను నీళ్ళున్న బొక్కెనలో తలక్రిందులుగా, నిట్టనిలువుగా 90 డిగ్రీలలో ముంచండి. ఆ పాత్ర ఖాళీగానే ఉన్నప్పటికీ, ఒక్క చుక్క నీళ్ళు కూడా లోపలికి పోవు. ఎందుకని? అది ఖాళీగా ఉంది కాబట్టి. మనకు తెలిసినంతవరకు అది ఖాళీనే. కానీ అది నిట్టనిలువుగా ఉంది. కాబట్టి అప్పుడు మనం కొంచెం ఒక్క డిగ్రీ వంచితే నీళ్ళు లోపలికి వస్తాయి. ఇంకొంచెం, ఇంకో డిగ్రీ వంచితే మరికొన్ని నీళ్ళు లోనికి వస్తాయి. మరొక డిగ్రీకి మరికొద్ది నీళ్ళు. కాసేపటి తరువాత నువ్వు వంచాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నీళ్ళు లోపలికి త్రోసుకువచ్చేస్తాయి. మిగతాది తనంతట తానుగా నిండిపోతుంది. మనమంతా పాత్రలలాంటి వాళ్ళం, అనుగ్రహానంద మహితజలాలలో తలక్రిందులుగా ఉంచబడిన పాత్రలం.

కొన్నిసార్లు బాబా "మీరందరూ తలక్రిందులుగా ఉన్న (బోర్లించిన) కుండల్లాంటి వారు" అని చెప్పింది దీని గురించే. మనందరి గురించి ఆలోచించినపుడు, ఎందుకు ఆయన సరిగ్గా ఆ సారూప్యమే చెప్పారో నాకు మనసుకు వస్తుంది. మనమంతా ఖాళీ కుండలవంటి వాళ్ళం, కానీ మనం పూర్తిగా తలక్రిందులుగా ఉన్నాం. ఆయన మనలో ఏదైనా పోయాలని అనుకున్నా, లేదు, మనం దానికి ఒప్పుకోం, మనం చాలా గట్టిగా తొణక్కుండా ఉంటాం కాబట్టి ఏమీ లోపలికి వెళ్ళదు. మనం చేయవలసిన ప్రయత్నం ఏమిటంటే కాస్త నాలుగైదు డిగ్రీలు ఒరగడానికి కృషిచేస్తే మిగతా దాని గురించిన

బాధ్యత తీసుకోబడుతుంది. మొత్తం సమస్యంతా ఆ నాలుగైదు డిగ్రీలతోనే వస్తుంది.

**భక్తుడు:**

కానీ గురువుగారూ! ఈ నాలుగైదు డిగ్రీలు ఒరగడం మేము చేయాలి కదా? దానిని మేమెలా చేయగలం?

**గురువుగారు:**

శూన్యత్వస్థితి గురించి భయపడకుండా ఉండి, అనుగ్రహసాగరంలో నువ్వు నిజంగా తలక్రిందులుగా ఉన్న కుండవని తెలుసుకున్నపుడు, ఇక అక్కడ ఏం చెయ్యాల్సిన అవసరం లేదు. జరగవలసింది సవ్యంగా జరిగిపోతుంది. కానీ సమస్యేమిటంటే "మేం ఖాళీగా ఉన్నాం, లోపలికేం రావట్లేదు. మేము ఇక్కడ ఎన్నో కష్టాలకోర్చి, ఇలాగే చాలా రోజుల నుండి ఉన్నాం, సముద్రంలో ఉన్నా- ఇంకా ఖాళీగా ఉన్నాం" అని మనం ఫిర్యాదు చేస్తున్నాము. మనం నిజంగా ఖాళీగా ఉన్నామా? లేదు, మనలో నిండా గాలి ఉంది! (గురువుగారు నవ్వుతూ...) గాలి కూడా ఉంది, కానీ మనం ఆ గాలిని ఇష్టపడం. కాస్త దానిని (తలక్రిందులుగా ఉన్న కుండని) వంచండి, అప్పుడు బుడబుడమని బుడగలు వస్తాయి. ఇవే మీకు కలిగే ఆధ్యాత్మికానుభవాలు! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

కానీ మమ్మల్ని మేము ఎలా వంచుకోగలం?

**గురువుగారు:**

నేను మీకు చెప్పాను: మీరు ఒక పాత్ర అని మీరు తెలుసుకొంటే, మీరు వంచబడతారు. లోపలికి నెట్టుకుని రావడానికి ప్రయత్నిస్తున్న

ఆ (నీటి) ఒత్తిడిని ఎంతోకాలం ఆపలేము. ఆ అవగాహన కలిగినప్పుడు, హఠాత్తుగా పాత్ర తిరిగిపోతుంది, అప్పుడు మీరంటూ మిగలరు. కానీ నువ్వు బలవంతంగా పాత్రని పట్టుకుని ఉన్నావు. “నీళ్ళేవీ లోపలకు రావడంలేదు. ఏమీ లేదు” అని అడుగుతున్నావు, ఫిర్యాదు చేస్తున్నావు. దానిని అలా పట్టుకొని ఉన్నప్పుడు లోపలికి నీరెలా వస్తుంది? నీటికి శక్తి లేదు. కొంతకాలం తరువాత అలా పట్టుకోవడంలో నువ్వు అలసిపోయినపుడు, నిన్ను నువ్వు నిటారుగా ఉంచుకునేందుకు అశక్తుడవైనప్పుడు నీరు లోపలికి వస్తుంది. అందుకనే ఆ అశక్తతను, అసహాయతను అనుభవించవలసి వస్తుంది. దాని వలన మనం కొంచెం వంచబడటం, వంగడం జరుగుతుంది. మనం బాబా ముందు సాష్టాంగపడినప్పుడు జరిగేది అదే. నువ్వు వంగుతున్నావు, నీ పాత్ర ఒరుగుతోంది. అది గుర్తుంచుకోండి. అలా ఒక్కొక్క డిగ్రీ ఎక్కువయ్యే కొద్దీ అనుగ్రహజలం అంత ఎక్కువగానూ లోపలికి వస్తుంది. అదీ నమస్కారం. ఇలా ఇక్కడకు వచ్చి నా ముందర వంగి ఉండటంకాదు. నేనెప్పుడూ మీరు మీ పాత్రను వంచుతారని, కొద్దిగా ఎక్కువగా వంచుతారని ఆశిస్తాను.

# అనుబంధం

"శరశ్చంద్రికలు"లోని 12 అధ్యాయాలలో ఉన్న 'శ్రీబాబూజీ సత్సంగాలలోని భాగాలు' డేటాబేస్ లోని ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ క్రమసంఖ్య, సత్సంగం జరిగిన తేదీ, ప్రదేశం ఈ క్రింది సూచికలో పేర్కొనబడినవి.

స- :: రికార్డ్ చేయబడిన ఆంగ్ల సత్సంగం, ప్రక్కనే క్రమసంఖ్య
తె.స :: రికార్డ్ చేయబడిన తెలుగు సత్సంగం
*స :: రికార్డ్ చేయబడని వివరాలు (సత్సంగ భాగాలు)

**అధ్యాయం 1 :: సద్గురువు**

| | | | |
|---|---|---|---|
| 1. | స-46 | 22 జూలై 1998 | శిరిడీ |
| 2. | స-00 | 1993-1994 | తిరువణ్ణామలై |
| 3. | స-00 | 1993-1994 | తిరువణ్ణామలై |
| 4. | స-113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |
| 5. | స-104 | 10 మార్చి 2005 | తిరువణ్ణామలై |

**అధ్యాయం 2 :: ఆనందం**

| | | | |
|---|---|---|---|
| 1. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |
| 2. | స-109 | 15 జూలై 2005 | తిరువణ్ణామలై |
| 3. | స-109 | 15 జూలై 2005 | తిరువణ్ణామలై |
| 4. | స-114 | 07 డిసెంబర్ 2005 | తిరువణ్ణామలై |
| 5. | స-29 | 19 జనవరి 1998 | శిరిడీ |
| 6. | స-107 | 23 మే 2005 | తిరువణ్ణామలై |
| 7. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |

అధ్యాయం 3 : : సమాధానం చెప్పే సమాధి

| | | | |
|---|---|---|---|
| 1. | స-25 | 13 జనవరి 1998 | శిరిడీ |
| 2. | స-37 | 21 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |
| 3. | స-86 | 12 డిసెంబర్ 2003 | చెన్నై |
| 4. | స-39 | 24 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |
| 5. | స-39 | 24 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |
| 6. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |
| 7. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |

అధ్యాయం 4 : : జీవితం

| | | | |
|---|---|---|---|
| 1. | స-99 | 16 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 2. | ❉స | 31 డిసెంబర్ 1993 | శిరిడీ |
| 3. | స-49 | 19 ఫిబ్రవరి 2001 | చెన్నై |
| 4. | స-75 | 09 జూన్ 2003 | చెన్నై |
| 5. | స-59 | 03 మార్చి 2002 | చెన్నై |
| 6. | స-130 | 28 నవంబర్ 2007 | హృషీకేశ్ |

అధ్యాయం 5 : : ధ్యానం

| | | | |
|---|---|---|---|
| 1. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 2. | ❉స | 19 నవంబర్ 1993 | శిరిడీ |
| 3. | ❉స | 19 నవంబర్ 1993 | శిరిడీ |
| 4. | స-25 | 13 జనవరి 1998 | శిరిడీ |
| 5. | స-69 | 04 ఫిబ్రవరి 2003 | తిరువణ్ణామలై |
| 6. | స-60 | 21 ఏప్రిల్ 2002 | చెన్నై |
| 7. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 8. | స-133 | 23 నవంబర్ 2009 | హృషీకేశ్ |
| 9. | స-69 | 04 ఫిబ్రవరి 2003 | తిరువణ్ణామలై |

| | | | |
|---|---|---|---|
| 10. | స-00 | 1993-1994 | తిరువణ్ణామలై |
| 11. | స-00 | 1993-1994 | తిరువణ్ణామలై |

**అధ్యాయం 6 : : అసమానమైన సాయి మహిమ**

| | | | |
|---|---|---|---|
| 1. | స-54 | 25 డిసెంబర్ 2001 | చెన్నై |
| 2. | స-03 | 12 మార్చి 1997 | శిరిడీ |
| 3. | తె.స | 1990 | చెన్నై |
| 4. | తె.స | 1990 | శిరిడీ |
| 5. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 6. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |

**అధ్యాయం 7 : : ప్రేమ-భక్తి**

| | | | |
|---|---|---|---|
| 1. | స-37 | 21 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |

**అధ్యాయం 8 : : నిష్ఠ-సబూరి**

| | | | |
|---|---|---|---|
| 1. | *శ్రీసాయిసచ్చరిత్ర, 18,19 అధ్యాయాలు* | | |
| 2. | స-117 | 10 నవంబర్ 2006 | వారణాశి |
| 3. | స-48 | 06 మార్చి 2009 | శిరిడీ |
| 4. | స-134 | 14 డిసెంబర్ 2009 | హృషీకేశ్ |
| 5. | స-97 | 16 అక్టోబర్ 2004 | చెన్నై |
| 6. | స-117 | 10 నవంబర్ 2006 | వారణాశి |
| 7. | ❄ స | 31 డిసెంబర్ 1993 | శిరిడీ |
| 8. | స-85 | 8 డిసెంబర్ 2003 | చెన్నై |

**అధ్యాయం 9 : : ఆనందస్వరూపం**

| | | | |
|---|---|---|---|
| 1. | స-97 | 16 అక్టోబర్ 2004 | చెన్నై |
| 2. | *శ్రీబాబూజీ (బుక్‌లెట్), సాయిపథం పబ్లికేషన్స్, 1998* | | |
| 3. | స-05 | 30 మార్చి 1997 | తిరువణ్ణామలై |
| 4. | స-17 | 22 డిసెంబర్ 1997 | శిరిడీ |

| | | | |
|---|---|---|---|
| 5. | స-08 | 02 ఏప్రిల్ 1997 | తిరువణ్ణామలై |
| 6. | స-131 | 23 ఫిబ్రవరి 2008 | తిరువణ్ణామలై |

అధ్యాయం 10 :: గురువుగారి బాబా

| | | | |
|---|---|---|---|
| 1. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 2. | స-99 | 16 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 3. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 4. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |
| 5. | స-67 | 18 జనవరి 2003 | చెన్నై |
| 6. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 7. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 8. | స-98 | 11 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 9. | స-03 | 12 మార్చి 1997 | శిరిడీ |

అధ్యాయం 11 :: ప్రేమించు ప్రేమకై

| | | | |
|---|---|---|---|
| 1. | స-58 | 14 ఫిబ్రవరి 2002 | చెన్నై |
| 2. | స-44 | 12 జూలై 1998 | శిరిడీ |
| 3. | స-115 | 30 జనవరి 2006 | తిరువణ్ణామలై |
| 4. | స-113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |
| 5. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 6. | స-116 | 23 జూలై 2006 | తిరువణ్ణామలై |
| 7. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశి |

అధ్యాయం 12 :: నమస్కారం

| | | | |
|---|---|---|---|
| 1. | స-91 | 12 మార్చి 2004 | తిరువణ్ణామలై |
| 2. | స-91 | 12 మార్చి 2004 | తిరువణ్ణామలై |
| 3. | స-99 | 16 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 4. | స-89 | 7 ఫిబ్రవరి 2004 | చెన్నై |